
www.jagritiweekly.com
సంపుటి : 75 సంచిక : 29 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ వైశాఖ బహుళ తదియ
08-14 మే 2023
వెల : ₹15/-



## నోళ్లు తెరుస్తున్న 'డీఎంకే ఫైల్స్'

దాని చీకటి చరిత్రను తవ్వి పోస్తున్నారు, పాపాల చిట్టాను రాష్ట్ర ప్రజల ముందు ఉంచుతున్నారు కె. అన్నామలై

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# లాహిరి లాహిరిలో...





ఈశాన్య భారతదేశంలో క్రీడా ప్రతిభకు లోటు లేదు. అందులోను జలక్రీడలలో వారిది ప్రత్యేకమైన నైపుణ్యం. ఇప్పుడు మాత్రమే ఆ ప్రతిభ వెలుగులోకి వస్తున్నది. పది రాష్ట్రాల నుంచి వెళ్లిన రెగెట్టా క్రీడాకారులంతా ఇప్పుడు అక్కడికే వెళ్లారు. ఈశాన్య భారత రెగెట్టా క్రీడోత్సవాలు ఏప్రిల్ 29న మేఘాలయలో ప్రారంభమైనాయి. ఉమీయమ్ సరస్సులో జరిగే ఈ పడవల ఉత్సవంలో పది రాష్ట్రాల నుంచి వందమంది నిపుణులు పాల్గొన్నారు. ఉమీయమ్ సెయిలర్స్ క్లబ్ సహకారంతో మేఘాలయా పర్యాటక శాఖ ఈ ఉత్సవాలను నిర్వహించింది. ఇలాంటి ఒక క్లబ్ భారతదేశంలో పనిచేయడం ఇదే మొదటిసారి. మరొక 12 సంస్థలు కూడా ఇందుకు సహాయం అందిస్తున్నాయి. మేఘాలయా పర్యాటక శాఖ మంత్రి పాల్ లిగ్ధో వీటిని ప్రారంభించారు. క్రీడోత్సవానికి ఎంపిక చేసిన ఉమీయమ్ సరస్సు అద్భుత సౌందర్యంతో ఉందని సికింద్రాబాద్ నుంచి వెళ్లిన అలేఖ్య కాండూ చెప్పారు. నిజమే, అందాలకు నెలవైన ఈశాన్య భారతంలోని సరస్సులో రంగు రంగుల తెరచాపలతో బుల్లి బుల్లి పడవలు విన్యాసాలు చేయడం అద్భుతమే.





# ప్రాణాలను నిలిపే బైక్ అంబులెన్స్!

ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లడంలో అంబులెన్స్ పాత్ర కీలకం. అయితే గిరిజన గ్రామాల పరిస్థితులు మనకు తెలియనివి కావు. అక్కడి రోడ్లపైన మనుషులే నడవలేని పరిస్థితి. మరి ఆ గిరిజన ప్రజలకు అనుకోకుండా ఏదైనా ప్రమాదం ఏర్పడితే వారిని ఆసుపత్రికి ఎలా తీసుకెళ్లాలి? వారి ప్రాణాల్ని ఎలా రక్షించాలి? ప్రభుత్వ 108 వాహనాలు ఆ ఇరుకు, గతుకుల ప్రాంతాల్లో తిరగలేవు కదా మరెలా.. ఈ ఆలోచన నుంచి పుట్టిందే బైక్ అంబులెన్స్. దీనిని ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణరావు రూపొందించారు. ఈ ఆవిష్కరణలో పలువురు విద్యార్థులూ పాలుపంచుకున్నారు.

108 వాహనం వచ్చేలోపు అస్వస్థతకు గురైన వ్యక్తిని ఈ టూ వీలర్ అంబులెన్స్‌పై కొంత దూరం తీసుకొచ్చి 108లోనికి ఎక్కించవచ్చని, దీనికి ఆక్సిజన్ సిలిండర్, ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను కూడా అమర్చామని లక్ష్మణరావు తెలిపారు. అంతేకాదు, ఈ బైక్ అంబులెన్స్ వెనుక భాగంలో రోగి కూర్చోవడానికి, పడుకునేందుకు వీలుగా ఒక కుర్చీని అమర్చారు. దీనిని రోగి సౌకర్యార్థం ఎలాగైనా మలుచుకోవచ్చు. అధునాతన టెక్నాలజీతో, తక్కువ ఖర్చుతోనే ఈ బైక్ అంబులెన్స్‌ను తయారుచేశామన్నారు.

ఇటువంటి టూ వీలర్ అంబులెన్స్‌లను రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని ధీమా వ్యక్తం చేశారాయన. వనవాసీ కల్యాణ ఆశ్రమం సంఘటనా కార్యదర్శి ఆది నారాయణ ఈ వాహనాన్ని చూసి అభినందించారని లక్ష్మణరావు తెలిపారు. ★

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్ 9959310103

డిజైనర్ : సిహెచ్. కుమార్

దేశ విభజన తరువాత జరిగిన నెహ్రూ–లియాఖత్ ఒప్పందంతో ఇవాళ్టి కాంగ్రెస్‌కు సంబంధం లేదా? అలాంటి ఒక ఒప్పందం జరిగిందని ఆ పార్టీకి గుర్తుందా? ప్రథమ ప్రధాని నెహ్రూ, పాకిస్తాన్ ప్రథమ ప్రధాని లియాఖత్ ఆలీ మధ్య ఢిల్లీలో జరిగిన ఆ అవగాహన ప్రకారం పాకిస్తాన్ మైనారిటీలు భారతదేశానికి శరణార్థులుగా వస్తే ఇక్కడి ప్రభుత్వం ఆదుకోవాలి. వారికి పౌరసత్వం ఇవ్వాలి. పునరావాసానికి అన్ని ఏర్పాట్లు చేయాలి. కానీ ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ఏనాడో విస్మరించింది. అది కూడా కావాలనే. ఎందుకంటే పాకిస్తాన్ నుంచి శరణార్థులుగా వచ్చేవారంతా హిందువులు. వీరిని ఆదుకుంటే ఇక్కడి పాకిస్తాన్ భక్తులకు, ముస్లిం మతోన్మాదులకు, మైనారిటీ ఓటర్లకు నచ్చదు. కాంగ్రెస్ ఓటుబ్యాంక్ వీరే కదా! అందుకే ఆ ఒప్పందం మీద నెహ్రూ చేవ్రాలు ఉన్నా ఇవాళ్టి కాంగ్రెస్ ఖాతరు చేయడం లేదు. ఇందుకు తాజా ఉదాహరణే జోధ్‌పూర్ దగ్గర ఏప్రిల్ 24న జరిగిన హిందూ శరణార్థుల ఇళ్ల కూల్చివేత.

‘మమ్మల్ని పాకిస్తాన్ నుంచి బలవంతంగా ఖాళీ చేయించారు. ఇక్కడ (రాజస్తాన్) జరిగింది కూడా అదే. మా ఇళ్లు కూల్చేశారు.’ జోధ్‌పూర్‌ని ఆనుకుని ఉన్న చౌఖా గ్రామంలో జరిగిన ఇళ్ల కూల్చివేత సమయంలో ఒక నిస్సహాయ హిందువు గుండె నుంచి ఉబికిన ఆక్రోశమిది. ఇది ఆ ఒక్క హిందువు బాధ మాత్రమే కాదు. జోధ్‌పూర్ డెవలప్‌మెంట్ అథారిటీ కూల్చేసిన దాదాపు 70 ఇళ్ల వారి సమష్టి ఆక్రోశం కూడా. వారి పిల్లల, తల్లుల ఆవేదన. వీరంతా పాకిస్తాన్ నుంచి ప్రాణాలరచేత పట్టుకుని రాజస్తాన్ చేరినవారే. కూల్చేసిన వాటిలో కొన్ని పక్కా ఇళ్లు కాగా, ఇంకొన్ని గుడిసెలు. ఇళ్లు కూలుస్తుంటే స్త్రీలు, పిల్లలు ఆర్తనాదాలు చేశారు. జరుగుతున్న బీభత్సాన్ని చూసి స్పృహ కోల్పోయిన మహిళను చూపిస్తూ మాకు భారతదేశంలో కూడా ఇదే దుస్థితి తప్పడం లేదు అంటూ ఒక యువకుడు వాపోవడం ఆలోచించవలసిన విషయమే. నడి వేసవిలో కూలిపోతున్న గూళ్లను చూసుకుని వారంతా కన్నీరు మున్నీరు కావడంలో ఆశ్చర్యం లేదు. బయటపడేసిన సామగ్రితో మంచాలను

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ వైశాఖ బహుళ తదియ**

### లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**నోళ్లు తెరుస్తున్న ‘డీఎంకే ఫైల్స్’**
6లో

జాతీయం
**‘సత్త్వవర్తన’కు కులగణకుల ‘రాచ’బాట**
11లో





ధారావాహిక నవల
**వరాహమిహిర**
– పాలంకి సత్య
20లో

# జాగృతి

## సంపాదకీయం

నిలబెట్టి దాని నీడకు పిల్లలు చేరిన దృశ్యాలు ఎందరిని కదిలించాయో తెలియదు.

చౌఖా గ్రామంలోని రాజీవ్‌నగర్‌లో అక్రమంగా నివసిస్తున్న ఈ కుటుంబాల వాళ్లకి ముందే నోటీసులు ఇచ్చామని జోధ్‌పూర్ డెవలప్‌మెంట్ అథారిటీ చెబుతోంది. అక్కడ బీ, సీ సెక్టర్లలో ఇలాంటి నివాసాలను కూల్చి వేసి 400 బిఘాల (ఒక బిఘా అంటే 6.19 ఎకరాలు)ను స్వాధీనం చేసుకున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములలో నివాసాలు ఏర్పాటు చేసుకోవడం చట్ట విరుద్ధమే.కాదనలేం. కానీ ఇక్కడ గమనించవలసిన అధికార యంత్రాంగపు దారుణ వైఫల్యం ఉంది. కొన్ని వర్గాల మాదిరిగా వాళ్లంతా

## ఇది హిందూ ద్వేషమే


రాత్రికి రాత్రికి గుడిసెలు వేసి, తరువాత అటువైపు అధికారులు రావడానికి కూడా భయపడే వాతావరణాన్ని కల్పించిన వారు కాదు. పాకిస్తాన్ నుంచి ప్రాణభయంతో వచ్చిన వారంతా ఆ గ్రామంలో ఆ భూమి కొన్నారు. ఒక్కొక్క స్థలానికి రూ. 75,000 నుంచి రూ. 2 లక్షలు చెల్లించారు. ఆ తరువాతే ఇళ్లు, గూళ్లు కట్టుకున్నారు. అదంతా ల్యాండ్ మాఫియా చేసిన దగా. తమ గోడును కలెక్టర్‌కు విన్నవించుకున్నప్పుడు ఇవన్నీ బయటపడ్డాయి.

ఇళ్ల కూల్చివేత మీద స్థానిక బీజేపీ నాయకుల అభిప్రాయం గమనించదగినది. నోటీసులు ఇచ్చామని అధికారులు చెప్పడాన్ని బీజేపీ ఖండిస్తున్నది. హిందూ శరణార్థులే లక్ష్యంగా రాజస్తాన్‌లోని అశోక్ గెహ్లాట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కూల్చివేత నిర్వహించిందని బీజేపీ నేత, హిందూ శరణార్థుల సంక్షేమ సంఘం నిమికెత్తం (ఎన్జీవో) సహ వ్యవస్థాపకుడు జయ్ అహుజా ఆరోపించారు. ఈ కూల్చివేత విషయంలో ఎలాంటి చట్టబద్ధమైన నిబంధనలను అనుసరించలేదని కూడా ఆయన చెబుతున్నారు. పాకిస్తాన్ నుంచి వలస వచ్చిన హిందువులకు కల్పించవలసిన సదుపాయాలు కల్పించడం సంగతి అటుంచితే, వారికి నిలువ నీడ లేకుండా చేసింది రాజస్తాన్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం. ఇదంతా పథకం ప్రకారం జరిగిందన్న వాదనలు గట్టిగానే వినిపిస్తున్నాయి. హిందూ శరణార్థుల మీద కక్షతోనే జర్నలిస్ట్ ముసుగులో ఉన్న ముస్లిం మతోన్మాది మొయినుల్ హక్ మొదట ఈ ప్రాంతం, ఇక్కడ హిందువులు నిర్మించుకున్న ఇళ్ల గురించి వార్తలు ప్రచురించాడు. వాటిని నిఘా వ్యవస్థ స్థానిక శాఖ నిజమని నిర్ధారించింది. అలా ఆ దొంగ జర్నలిస్ట్, స్థానిక నిఘా వ్యవస్థ కుమ్మక్కయి పూర్వాపరాలు పట్టించుకోకుండా ఈ దారుణానికి బాటలు వేశారు.

దేశాధికారానికి ఇంతకాలం దూరంగా ఉండిపోవడం కాంగ్రెస్ పార్టీకి పిచ్చెక్కిస్తున్నది. అధికారం అందని ద్రాక్షలా మారడంతో పాత ముస్లిం మైనారిటీ బుజ్జగింపు ధోరణికి అదనంగా ఆ పార్టీ హిందూ వ్యతిరేక విధానాన్ని నమ్మడం ఆరంభించింది. రొహింగ్యాలకు, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులకు ఈ దేశంలోనే ఆశ్రయం కల్పించాలనీ, మానవతా దృక్పథంతో వ్యవహరించాలనీ కడవల కొద్దీ కన్నీళ్లు కార్చే హక్కుల కార్యకర్తలకీ, ఉదారవాదులకీ, కాంగ్రెస్ నేతలకీ హిందూ శరణార్థుల అవస్థలు కాస్త కూడా పట్టవెందుకని? కోర్టులు కూడా స్యూమోటోలని మరచిపోతాయెందుకని? ఢిల్లీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుంటే అడ్డు పడిన కాంగ్రెస్ నేతలకు, కమ్యూనిస్టులకు, ఆప్ నాయకులకు జోధ్‌పూర్‌లో హిందువుల గోడు పట్టలేదేమి? ఇదే ప్రశ్నకు మీడియా కూడా సమాధానం చెప్పవలసి ఉంటుంది. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అసాంఘిక శక్తుల ఇళ్లు, అందులోను అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చివేస్తుంటే రాజస్తాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం నిస్సహాయులైన హిందూ కాందిశీకుల ఇళ్లను నేలమట్టం చేసింది. ఈ దేశంలో మెజారిటీ ప్రజలు హిందువులకు హక్కులు ఉండవా? ఉండకూడదా? ఇప్పటికైనా ఈ అంశం గురించి ఐక్యంగా ఆలోచిద్దాం! ★

08 మే 2023, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**జై జవాన్ - జై కిసాన్**

– టిఎస్ఎ కృష్ణమూర్తి





| | | |
|---|---|---|
| ఆ ఎమ్మెల్యేలపై చర్యలేవి? (తెలంగాణ) | – | 14 |
| రెచ్చిపోతున్న వైసీపీ మాఫియా (వేదిక) | – | 16 |
| ఆయనొక గొప్ప పరంపర (నివాళి) | – | 24 |
| తలొంచని కలం...'మలయా' నిలయ (మహిళ) | – | 26 |
| సహనం నశిస్తే తిరుగుబాటు అనివార్యం (అమృతోత్సవాలు) | – | 30 |
| సైనిక కుట్రల సుడిగుండం (అంతర్జాతీయం) | – | 32 |
| 58 ఏళ్ల కల సాకారం! (క్రీడ) | – | 43 |
| 'ఏజెంట్' ఆపరేషన్ ఫెయిల్! (సినిమా) | – | 50 |

ఉదయించే సూర్యుడు ఆ పార్టీ గుర్తు. కానీ దాని వెనుకంతా ఏడున్నర దశాబ్దాల చీకటి చరిత్ర ఉంది. అది హిందూత్వ మీద ద్వేషం పేరుతో మైనారిటీలను, ముఖ్యంగా ముస్లింలను, ముస్లిం మతోన్మాదాన్ని ఎగదోస్తోంది. ఏడున్నర దశాబ్దాలుగా తమిళనాడులో ఎస్సీఎస్టీలకు జరిగిన అన్యాయాన్ని బ్రాహ్మణ వ్యతిరేకత అనే ముసుగులో దాచి పెట్టే పార్టీ కూడా అదే. సామాజిక న్యాయం అంటూ గొంతు చించుకుంటూనే శాసనసభలో ప్రతిపక్ష నాయకురాలి చీరను లాగి, జాకెట్టును చించేసిన దుశ్శాసన సంతతి అంతా ఆ పార్టీలోనే ఉంది. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నిస్తే హిందీ భాషను రుద్దుతున్నారంటుంది. జాతీయ సమైక్యతను ప్రబోధిస్తే హిందుత్వను పులుముతున్నారని గగ్గోలు పెడుతుంది. రాష్ట్ర పురోగతి పేరుతో వేర్పాటువాదాన్ని చాపకింద నీరులా సాగించే పార్టీ కూడా అదే. ప్రజాస్వామ్యం పేరుతోనే మునిమనుమలకు కూడా కిరీటాలు తయారు చేసి పెట్టుకున్న, సింహాసనాలు తయారు చేసుకుంటున్న కుటుంబ పార్టీలలో దానిదే అగ్రస్థానం. అదే ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే). లక్షల కోట్ల అవినీతి వ్యవహారాలలో పీకల్లోతు మునిగి ఉన్న డీఎంకే పాపం ఇప్పటికి పండింది. ఆ పాపాల చిట్టాను రాష్ట్ర ప్రజల ముందు ఉంచుతున్నారు కె. అన్నామలై. దాని చీకటి చరిత్రను తవ్వి పోస్తున్నారు. ఆయన ఆ రాష్ట్ర బిజేపీ అధ్యక్షుడు. ఆయన వెల్లడిస్తున్న సత్యాల సంకలనమే 'డీఎంకే ఫైల్స్'



# నోళ్లు తెరుస్తున్న

ప్రస్తుతం అధికారంలో ఉన్న డీఎంకే పార్టీలో కేవలం 13 మంది నాయకుల ఆస్తుల విలువ ఎంతో అన్నామలై బయటపెట్టారు. నాలుగు భాగాల ఈ ఆర్థిక హారర్ ధారావాహికలో మొదటిభాగం సారాంశం ఇదే. ఆ మొత్తమే రూ. 1.34 లక్షల కోట్లు. తొలి ఫైల్ విడుదల కాగానే, సుసంపన్న సంస్కృతి కలిగిన తమిళనాడును ఎంకే స్టాలిన్ అవినీతి అనే విషంతో నింపేశారని, బీజేపీ ధ్వజ మెత్తింది. అధికార డీఎంకే మనీలాండరింగ్ కోసం నీచమైన కొత్త కొత్త మార్గాలను అన్వేషించిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జఫర్ ఇస్లామ్ విమర్శించారు.

వీటన్నిటి మీద సీబీఐ దర్యాప్తు జరపాలని బీజేపీ కోరుతోంది. వచ్చే 2024 లోక్‌సభ ఎన్నికల లోపు మిగిలిన భాగాలను దశల వారీగా అన్నామలై ప్రజల ముందు పెట్టబోతున్నారు. ఆ ఎన్నికలలో అన్నామలై నినాదం ఎన్‌మన్‌ఎన్ మక్కాళ్ (నా భూమి నా ప్రజలు). ఆయన విడుదల చేస్తున్న వీడియోలు డీఎంకే ఫైల్స్ అనుకోకుండా చక్కని రుజువు వచ్చి కూర్చుంది. అదే తమిళనాడు ఆర్థిక మంత్రి పళనివేల్ త్యాగరాజన్ (పీటీఆర్)ది అని చెబుతున్న ఆడియో. దీని ప్రకారం డీఎంకే ప్రథమ కుటుంబం ఒక్క సంవత్సరంలోనే రూ. 30 వేల కోట్లు సంపాదిం చింది. ఈ డబ్బును ఎలా కాపాడుకోవాలో తెలియక ఇబ్బంది పడుతోంది.



రాజనాల బాలకృష్ణ
సీనియర్ జర్నలిస్ట్

**ఏమిటీ డీఎంకే ఫైల్స్ ?**


1969 మొదలు ఇంతవరకు, విడతల వారీగా ద్రవిడ పార్టీలే తమిళనాడులో అధికారంలో ఉన్నాయి. అందులో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుటుంబం (డీఎంకే), ఇంచుమించుగా 30 ఏళ్లకు పైగా, అధికారంలో ఉంది. ఈ 30 ఏళ్ల డీఎంకే పాలనలో కరుణానిధి/స్టాలిన్ ఫ్యామిలీ ద్రవిడవాదాన్ని కవచంగా కప్పుకుని అక్రమార్జనకు పాల్పడింది. ఇది ఇప్పుడు కొత్తగా వచ్చిన ఆరోపణ కాదు. కరుణానిధి కుమార్తె కనిమొళి సహా మరికొందరు డీఎంకే ముఖ్య నేతలపై అవినీతి ఆరోపణలు చిరకాలంగా వినిపిస్తూనే ఉన్నాయి. అయితే, కరుణానిధి నాటిన కుటుంబ పాలన అవినీతి విషబీజం, ఆయన కుమారుడు స్టాలిన్, స్టాలిన్ కుమారుడు ఉదయ్‌నిధి స్టాలిన్ చేతుల్లో ఇంతింతై అన్నట్లుగా రాష్ట్ర వ్యాపితం అయింది. వేల నుంచి లక్షల కోట్లకు పడగలెత్తింది. షెల్ కంపెనీలు చీకటి వ్యవహారాలు సాగిస్తున్నాయి. అవినీతికి టెక్నాలజీని జోడించి కొత్త పుంతలు తొక్కుతున్నాయనే ఆరోపణలు కొత్తగా వినిపిస్తు న్నాయి. ఈ అవినీతి కథలనే అన్నామలై 'డీఎంకే ఫైల్స్' పేరిట బహిర్గతం చేస్తున్నారు.

నిజానికి, అన్నామలై ఇంకా పూర్తి చిట్టాను బయట పెట్టనే లేదు. అయితే ఏప్రిల్ 14న ఆయన విడుదల చేసిన 'డీఎంకే ఫైల్స్' ఫస్ట్ ఎపిసోడ్' లోనే స్టాలిన్ ఫ్యామిలీ అవినీతికి సంబంధించిన నమ్మశక్యం కాని నిజాలను బయట పెట్టారు. అందులో ప్రధానంగా గతంలో 13 ఏళ్ల క్రితం, 2011లో కరుణానిధి ప్రభుత్వంలో ఉప ముఖ్య




# ‘డీఎంకే ఫైల్స్’


మంత్రిగా ఉన్న స్టాలిన్ మహానగర మెట్రో టెండర్ల గోల్‌మాల్ వ్యవహారంలో, ఫ్రాన్స్‌కు చెందిన అల్‌స్టోమ్ (Alstom) కంపెనీ నించి మధ్యవర్తుల ద్వారా రూ. 200 కోట్లు ముడుపులు పుచ్చుకున్నారని, అన్నామలై ఆరోపించారు. ఆరోపించడం కాదు, ఆధారాలను బయటపెట్టారు. ఈ ముడుపుల వ్యవహారంలో సీబీఐ విచారణ జరిపించాలని కోరుతున్నారు. సీబీఐ విచారణ జరుగుతుందని నమ్ముతున్నారు. స్టాలిన్ అయన కుటుంబం, పార్టీ అవినీతిపై పోరాటం సాగిస్తానని అంటున్నారు.




ముఖ్యమంత్రి స్టాలిన్ ఆయన కుటుంబ సభ్యులు, ఇతర డీఎంకే నేతలు రూ. 1.34 లక్షల కోట్ల అవినీతిలో ఎవరి వాటా ఎంతో, ఎవరి చేతివాటం ఎంతో కూడా అన్నామలై వెల్లడించారు. అంతేకాదు, ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్, అల్లుడు శబరీశన్ ఒకే ఒక్క సంవత్సరంలో రూ. 30 వేల కోట్లు సంపాదించారని, రాష్ట్ర ఆర్థికమంత్రి పళనివేల్ త్యాగరాజన్ (పీటీఆర్) చెప్పినట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న క్లిప్పింగ్ డీఎంకే ఫైల్స్‌లో తాము చేసిన ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే, తమిళనాడు ఆర్థిక మంత్రి పీటీఆర్ చెప్పినట్లు కరుణానిధి తమ జీవితకాలంలో సంపాదించిన మొత్తం కంటే, అయన మనుమలు ఒక సంవత్సర కాలంలో పోగేసిన అవినీతి సొమ్ము ఎక్కువ ఉంటుందని, దీనిపైనా కేంద్ర దర్యాప్తు సంస్థలు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని అన్నామలై డిమాండ్ చేస్తున్నారు. ఇదీ తమిళనాట ద్రవిడ పార్టీ సాధించిన పురోగతి. తమిళనాడు తొలి రాజకీయ కుటుంబం ఏడాదిలోనే రూ. 30,000 కోట్లు దండుకున్నదని తాను చెప్పినట్టు వచ్చిన వీడియో గురించి త్యాగరాజన్ గట్టిగానే ఖండించారు. తన సోషల్ మీడియాలో రెండు పేజీలు ఇందుకు కేటాయించారు కూడా. అయితే ఈ ఆడియో దేశం మీదకు వెళ్లిపోయిన నాలుగు రోజుల తరువాత జరిగింది. పార్టీలో, అసెంబ్లీలో కూడా రగడ జరిగింది. రెండో దశ ఫైల్స్ విడుదల చేసిన సందర్భంలోనే పీటీఆర్ తన ఖండనను వెలువరించారు. డీఎంకే పార్టీని చీల్చాలని బీజేపీ చూస్తున్నదని ఆయన ఆరోపించారు. ఆ ఆడియో వాస్తవం కాదనీ అన్నారు. అయితే అటు పీటీఆర్‌గాని, ఇటు డీఎంకే కాని ఈ ఆరోపణ గురించి అన్నామలై మీద పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అక్కడ ఉన్నదే డీఎంకే ప్రభుత్వం. ఇక ఫిర్యాదు చేయడానికి ఎందుకు ముందుకు రాలేదన్న విమర్శ, చర్చ వచ్చాయి. కానీ బీజేపీ మాత్రం ఆ ఆడియో నిజానిజాల మీద ఫోరెన్సిక్ దర్యాప్తు చేయించాలని కోరింది. ఈ ఆడియో డీఎంకే పరువును మంట గలిపిందన్న అభిప్రాయం ఇప్పటికే ఏర్పడింది. ఈ ఆడియోను బట్టే తాను చేసిన ఆరోపణలు నిజమవు తున్నాయని అన్నామలై వ్యాఖ్యానించారు. కాబట్టి ఆయన మీద పోలీసు ఫిర్యాదు చేయాలి. లేదా క్రిమినల్ డిఫమేషన్ కేసు పెట్టాలి. ఈ రెండూ చేయలేదు కాబట్టి ప్రజలు ఏమనుకోవాలి అని రాజకీయ విశ్లేషకుడు సుమంత్ రామన్ ప్రశ్నించారు. అన్నామలై వీడియోలు, ఆర్థికమంత్రి ఆడియో అన్నీ ఎంకే స్టాలిన్ జాతీయ రాజకీయాలలోకి అరంగేట్రం చేద్దామని

# అన్నామలై

కర్ణాటక క్యాడర్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి. ఉద్యోగం వీడి బీజేపీలో చేరారు. అనతికాలంలోనే పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. అంతే అయితే, ఆయన గురించి అంతగా చెప్పుకోవలసింది,పెద్దగా ఉండక పోవునేమో! కానీ, ఈ రోజున ఆయన గురించి ఒక్క తమిళనాడులోనే కాదు, దేశం అంతటా చర్చ జరుగుతోంది. ఎవరీ అన్నామలై ..ఏమా కథ ..అనే ప్రశ్న సోషల్ మీడియాను చుట్టేస్తోంది. ఆ పేరే అధికార పార్టీ నేతల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. తమిళనాడు రాజకీయాలలో ప్రకంపనలు సృష్టిస్తోంది. నిజానికి ఆయన పార్టీ నాయకత్వం చేపట్టిన నాటి నుంచే సంచలనాలకు కేంద్రమయ్యారు. ఇప్పుడు ఆయన ప్రతిష్ట, సాహసం, నిశిత పరిశీలన రాష్ట్రాన్ని దాటాయి. దేశం అంతా ఆయన గురించే మాట్లాడుకునేటట్టు చేశాయి. ఆయన పై అందరిలో ఎందుకు ఇంత ఆసక్తి? ఎందుకు మీడియా ముఖ్యంగా జాతీయ మీడియా ఆయన వెంట పడుతోంది? దేశంలోని ప్రధాన టీవీ ఛానల్స్ అన్నీ



ఎందుకు ఆయన ఇంటర్వ్యూల కోసం క్యూ కడుతున్నాయి. ఎందుకు సదస్సులకీ, గోష్టులకీ పిలిచి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయి? ఆయన ఇంటర్వ్యూలు ఒకటి తర్వాత ఒకటిగా దేశంలో ఉన్న టీవీ ఛానల్స్ అన్నీ ఎందుకు ప్రసారం చేస్తున్నాయి? ప్రాంతీయ ఛానల్స్‌లోనూ ఆయన పేరు ఎందుకు మారుమోగి పోతోంది? ఈ అన్నిటినీ మించి అన్నామలై పేరు వినగానే అధికార పార్టీలో ఎందుకు ప్రకంపనలు, ప్రకోపాలు పుట్టుకొస్తున్నాయి? ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బంధుమిత్ర సకుటుంబ సపరివార సమేతంగా అన్నామలై పై ఎందుకు కస్సుబుస్సు మంటోంది? ఎందుకు స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ సహా డీఎంకే పరివార భోక్తలు కోట్లలో (రూ.1,400 కోట్లు) పరువు నష్టం దావా వేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు? ఉదయ్‌నిధి, టీఆర్ బాలు, కనిమొళి అంతా పరునష్టం దావాల కోసం క్యూ కట్టారు. నోటీసులతో అయన నోరు మూయించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు?అంటే, ఈ అన్ని ప్రశ్నలకు ఒకటే సమాధానం వస్తుంది. ఆ సమాధానమే 'డిఎంకే ఫైల్స్'. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం పెట్టి తన ఆరోపణలు సంధిస్తున్నారు అన్నామలై. ఈ ద్రవిడ పార్టీ, అది ప్రచారం చేస్తున్న 'ద్రవిడ నమూనా'ల అసలు రూపు, రంగు ఏమిటో ప్రజలకు తెలియచేయడమే తన ఉద్దేశమని ఆయన అన్నారు. ఈ ఫైల్స్‌లో మొత్తం 35 మంది అవినీతి చిట్టాలు ఉన్నాయి. వాటి సేకరణ కోసం ఆరు మాసాలు శ్రమించవలసి వచ్చిందని బీజేపీ అధికార ప్రతినిధి సూర్యనారాయణన్ చెప్పారు. ★

అనుకుంటున్న సమయంలో వెలువడడం... తనకు మూఢ నమ్మకాలు లేవని చెప్పుకునే డీఎంకేకు అశుభమే.

చిత్రం ఏమంటే, కరుణానిధి మనుమలు, (స్టాలిన్ కొడుకు, అల్లుడు) ఒకే సంవత్సరంలో కరుణానిధి జీవిత కాలంలో సంపాదించిన ఆస్తుల కంటే ఎక్కువ అక్రమ ఆస్తులు కూడా పెట్టారని ఆర్థికమంత్రి పీటీఆర్ చెప్పినట్టు ప్రచారంలో ఉన్న ఆడియో క్లిప్పింగ్‌పై డీఎంకే ముఠా వెంటనే స్పందించలేదు. నోళ్లు పడిపోయాయని అనుకోవాలి. అంతేకాదు, డీఎంకే ప్రభుత్వం చేస్తున్న పనులకు మంత్రిగా ఆమోదం తెలపడానికి తన ఆత్మ అంగీకరించడం లేదని పీటీఆర్ అన్నట్టు చెబుతున్న మరొక వీడియో కూడా వైరల్ అయింది. ఉదయ్‌నిధి, శబరీశన్ భారీ సంపాదన గురించి మిత్రపక్షాల నుంచి వత్తిడి వచ్చినా ఆయన మొదట మౌనంగానే ఉన్నారు. చివరకు స్వయంగా స్టాలిన్ కాల్ చేసి హెచ్చరించిన తర్వాత మాత్రమే ఆర్థికమంత్రి అప్పటికే సోషల్ మీడియాలో భయంకరంగా వైరల్ అయిన ఆడియో క్లిప్పింగ్‌పై స్పందించారు. అదంతా కల్పితమని, తమ మధ్య చిచ్చుపెట్టేందుకే అన్నామలై ఈ ఆరోపణలు చేస్తున్నారని ప్రకటన విడుదల చేశారు.

**ఇంతేకాదు.. ఇంకా ఉంది**

నిజానికి, ఇంతవరకు డీఎంకే ఫైల్స్‌లో బయటపెట్టింది... తక్కువని బయట పెట్టవలసింది, ఎక్కువని స్వయంగా అన్నామలై ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. డీఎంకే ఫైల్స్ ఫస్ట్ ఎపిసోడ్‌లో బయట పెటిన రూ. 1.34 లక్షల కోట్ల అవినీతి వ్యవహారం కేవలం 11 మంది డీఎంకే నాయకులకు సంబంధించినదే అయినా, అది వారు ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన మొత్తానికి, తాము పూర్తి ఆధారాలతో సేకరించిన వాస్తవ ఆస్తుల వివరాల ఆధారంగా లెక్క కట్టిన అవినీతి మొత్తమే రూ. 1.34 లక్షల కోట్లుగా నిర్ధయానికి రావడం జరిగిందని వివరించారు. ఇతర నాయకులు, బినామీల వివరాలను కలిపితే, ఈ మొత్తం అంచనాలకు సైతం అందనంతగా ఉంటుందని అన్నామలై ఒక ఇంటర్వ్యూలో వివరించారు.ఇక చోటా నాయకులు కూడబెట్టిందో ఎంతో తెలుసుకోవాలంటే సాధారణ తమిళుడు గుండె నిబ్బరంతో ఉండక తప్పదు. అంతేకాదు, ముందు ముందు మరిన్ని ఎపిసోడ్స్ రిలీజ్ చేస్తామని అందులో మరిన్ని సంచలనాలు బయటకు వస్తాయని అన్నామలై అంటున్నారు. ఈ లెక్కన చూస్తే, 'డీఎంకే ఫైల్స్' ముందు ముందు మరిన్ని ప్రకంపనలు సృష్టించినా ఆశ్చర్యపోనవసరం లేదని అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

**ఇదిగో చిట్టా**

నిజానికి, అన్నామలై డీఎంకే ఫైల్స్ వన్‌లో స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ అవినీతి కథలనే కాదు, స్టాలిన్ సోదరి కనిమొళి సహా ఇతర కుటుంబ సభ్యులు, మంత్రులు, ఇతర పార్టీ నేతల అవినీతి చిట్టాను కూడా బయట పెట్టారు. కనిమొళి 2019 ఎన్నికల సమయంలో తన ఆస్తులను రూ.30 కోట్లుగా పేర్కొన్నారు. కానీ ఆమెకు కలయింగర్ టీవీలో ఎనిమిది వందల కోట్ల విలువైన వాటాలు ఉన్నాయి. ఇంత స్వల్ప వ్యవధిలో అంత సంపాదన ఎలా సాధ్యమైంది అనేది అన్నామలై ప్రశ్న. ఇక జగద్రక్షకన్ అనే కేంద్ర మాజీమంత్రి తన ఎన్నికల అఫిడవిట్లో అప్పులు ఉన్నాయని చూపించాడు. ఇప్పుడు ఆయన సంపాదన ఏకంగా వందల కోట్లకు వెళ్లిపోయింది. ఇది ఎలా సాధ్యమవుతుందో చెబితే తమిళ ప్రజలు మొత్తం అనుసరిస్తారని అన్నామలై అడుగుతున్నారు. ఇక ఇవి వేలు అనే మంత్రి ఎన్నికలప్పుడు తన అరుణయి అనే కాలేజీ విలువ రూ. 1086 కోట్లు ఉంటుందని అఫిడవిట్‌లో ప్రకటించాడు. కానీ ఇప్పుడు ఆయన కాలేజీ విలువ రూ. 4,000 కోట్లకు పెరిగింది. ఆయన కాంబన్ కాలేజీ విలువ కూడా రూ.141 కోట్లకు పెరిగింది. ఇలా అనేక మంది డీఎంకే నాయకులు తమ ఆస్తులను అడ్డగోలుగా పెంచుకున్నారని అన్నామలై ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్, రేపోమాపో అన్నీ కలసి వస్తే తరువాతి ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, బావకు పోటీగా రావడానికి సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్న

అల్లుడు శబరీశన్, సీఎం సోదరి కనిమొళి, దగ్గరి బంధువు కళానిధి మారన్ అవినీతి చిట్టాలు, కూడబెట్టిన మొత్తాల వివరాలు కూడా ఇందులో ఉన్నాయని వేరే చెప్పక్కరలేదు. తొలిభాగంలో ఆయన లేవనెత్తిన ప్రశ్నలలో మెట్రో ప్రాజెక్టులో నేటి ముఖ్యమంత్రి స్టాలిన్‌కి నాడు అందిన భారీ ముడుపులు, ఉదయ్‌నిధి స్టాలిన్ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ మూవీస్‌కు పెట్టుబడులు, శబరీశన్ మనీ లాండరింగ్ వ్యవహారాలకు సంబంధించి ఉన్నాయి. డీఎంకే మంత్రులు కేఎన్ నెహ్రూ, కె. పొన్ముడి, అన్బిల్ మహేశ్ పొయ్యామొజి, ఎంపీలు ఎస్. జగద్రక్షకన్, టీఆర్ బాలు, డీఎం కాతిర్ ఆనంద్, కళానిధి వీరాస్వామిల అవినీతి చిట్టాలు కూడా ఉన్నాయి.

డీఎంకే ప్రథమ కుటుంబం అవినీతి సినిమా చాలా పెద్దది. తాత, తండ్రి, ఇప్పుడు మనుమడు కూడా ఒకరి నుంచి ఒకరు అవినీతిని పుణికి పుచ్చుకున్నారు. 2006-2011 మధ్య స్టాలిన్ కొడుకు ఉదయనిధి కొన్ని సినిమాలు తీశాడు. వాటికి అయిన ఖర్చు రూ. 300 కోట్లు. అప్పుడు డీఎంకే అధికారంలో ఉంది. అందులో చాలావరకు సినిమాలు బాక్సాఫీసు దగ్గర బోల్తా పడ్డాయి. అయినా ఇన్ని సినిమాలు ఇంత పెట్టుబడితో ఉదయ్‌నిధి ఎలా తీశారని అన్నామలై అడుగుతు న్నారు. ప్రస్తుతం ఉదయ్‌నిధి ఆస్తుల విలువ రూ. 2,039 కోట్లు. అదే 2021లోనే అంటే రెండేళ్ల క్రితమే ఆయన ఆస్తుల విలువ కేవలం రూ. 33 కోట్లు. 2019-20లో ఆయన చూపిన వార్షికా దాయం రూ. 4.98 లక్షలు.

స్టాలిన్ అల్లుడు శబరీశన్‌కు సెయింట్ జార్జెస్ బ్యాంక్‌తో ఉన్న బంధం గురించి కూడా అన్నామలై ప్రశ్నించారు. ఈ బ్యాంక్‌కు మనీలాండరింగ్‌తో సంబంధాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి స్టాలిన్‌కూ, నోబెల్ స్టీల్‌కూ మధ్య కుదిరిన రూ. 1000 కోట్ల అవగాహన ఒప్పందం గురించి కూడా అన్నామలై ప్రశ్నించారు. ఈ ఒప్పందం మార్చి 2022లోనే కుదరింది. విషయం అదికాదు, నోబెల్ స్టీల్ సంస్థలో డైరెక్టర్లు అన్బిల్, ఉదయ్‌నిధి ముఖ్యమంత్రి స్టాలిన్ చంకలో మనుషులు.

ఇప్పుడు డీఎంకేను నడిపిస్తున్నది కరుణానిధి

## ఆట మొదలైంది



ఉదయ్‌నిధి స్టాలిన్, స్టాలిన్ అల్లుడు శబరీశన్, ఒకే ఒక్క సంవత్సరంలో రూ.30 వేల కోట్లు అక్రమాస్తులు కూడపెట్టారని తమిళ నాడు ఆర్థిక మంత్రి పి.త్యాగరాజన్ (పీటీఆర్) పేరిట వైరల్ అవుతున్న వీడియో మరింత సంచలంగా మారింది. ఇందుకు సంబంధించి, ప్రధానంగా స్టాలిన్ అల్లుడు శబరీశన్, ప్రాధాన ప్రమోటర్‌గా ఉన్నట్లు చెపుతున్న రియల్ ఎస్టేట్ సంస్థ జీ స్క్వేర్' సంస్థ కార్యాల యాలపై ఏప్రిల్ 24న ఐటీ సోదాలు జరిగాయి. అది కూడా ఎక్కడో ఒక దగ్గర కాదు..చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు,తిరువనంతపురం సహా దేశంలో మొత్తం 50 చోట్ల ఏకకాలంలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. అదే సమయంలో ఈ కేసుతో సంబంధం ఉందని అనుమానిస్తున్న డిఎంకే నాయకుల ఇళ్లపైనా సోదాలు నిర్వహించారు.

డీఎంకే ఎమ్మెల్యే మోహన్, ఆయన కొడుకు కార్తీక్, మరికొందరు ఈ రియల్టర్ సంస్థలో భాగస్వాములు. అన్నానగర్‌లో ఆడిటర్ షణ్ముగం నివాసంలోను, ఇంకా చెన్నైతో బాటు ఆళ్వార్ పేట్, కోయంబత్తూరు, తిరుచ్చి వంటి చోట్ల గల ఈ సంస్థ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. ఇక చెన్నై సహా తిరుచ్చి, కోయంబత్తూరు, కర్ణాటక లోని హోసూర్, బెంగుళూరు, మైసూర్, బళ్లారితో బాటు తెలంగాణలోని వివిధ చోట్ల ఐటీ సిబ్బంది నిర్విరామంగా తమ సోదాలు నిర్వహించారు. ఈ సోదాలకు, డిఎంకే ఫైల్స్'కు ఏదైనా సంబంధం ఉందా? లేక కంపెనీ ప్రకటించిన విధంగా ఇవి రొటీన్ సోదలేనా అనేది తేలవలసి ఉంది. అయితే, ఐతే సోదాలతో అట మొదలైందని అనుకోవచ్చని ఇటు డిఎంకే అటు బీజేపీ వర్గాలు అంటున్నాయి.అందుకే ఈ ప్రకంపనలు, అందుకే ఈ ప్రకోపాలు. అందుకే అన్నామలై చుట్టూ మీడియా పరుగులు. ★


**'జాగృతి' నిర్వహించిన ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో**
**ద్వితీయ బహుమతి పొందిన రచన**



**మహా సంకల్పం**



**ధారావాహికగా అతి త్వరలో**
**మీ ముందుకు వస్తోంది...**

**రచన: పి. చంద్రశేఖర ఆజాద్**

కుటుంబం. అయితే అది చాలా చాలా చాలా పెద్దది. ఎందుకంటే ఆయనకు ముగ్గురు భార్యలు. వారే పద్మావతి అమ్మాళ్, దయాళు అమ్మాళ్, రజతి అమ్మాళ్. ఎంకే ముత్తు, ఎంకే స్టాలిన్, ఎంకే అళగిరి, ఎంకే తమిళరుసు కుమారులు. సెల్వి, కనిమొళి కుమార్తెలు. వీరు, వీరి సంతానం, మనుమలు, కూతుళ్లు, అల్లుళ్లు కూడా రాజకీయాలలో, వ్యాపారంలో, సినిమా రంగంలో తమిళనాట మకుటాలు లేని మహారాజుల మాదిరిగా వెలిగిపోతున్నారు. ఇందులో దయాళు అమ్మ సంతానమే స్టాలిన్.

ఎంకే స్టాలిన్ తనకంటే పదేళ్లు చిన్నదైన దుర్గను 1976లో పెళ్లి చేసుకున్నారు. చిత్రంగా ఈయన రాజకీయ జీవితం అవినీతికి వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం ప్రారంభించిన నేపథ్యంలో, అత్యవసర పరిస్థితి కాలంలో మొదలయింది. దుర్గను పెళ్లి చేసుకున్న ఐదు మాసాలకే ఇతడిని మీసా కింద అత్యవసర పరిస్థితిలో అరెస్టు చేశారు. అప్పుడు జైలులో తనను హింసించారని తన ఆత్మకథ 'మీలో ఒకడిని'లో చెప్పుకున్నారు. దుర్గ డీఎంకే కుటుంబంలో ఉన్నా, ఆస్తికురాలు. ఆ మధ్య ఒక ఆలయానికి వెళితే, దేవతామూర్తులకు పట్టే ఛత్రాన్ని ముఖ్యమంత్రి భార్యగా దుర్గకు పట్టడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

యథాప్రకారం అన్నామలై చేసిన ఆరోపణలను డీఎంకే నేతలు ఖండించారు. డీఎంకే ఎంపీ ఆర్ఎస్ భారతి ఈ ఆరోపణలను జోక్ అని అన్నారు. ఆయన పేర్కొన్న డీఎంకే నేతలంతా తమ ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారని తెలిపారు. వాటిలో ఏ ఒక్కటి తప్పుగా అనిపించినా వారి ఎన్నికను ప్రజలు సవాల్ చేయవచ్చని అన్నారు. అలాగే, 2011లో మెట్రో రైలు టెండర్ల వ్యవహారంలో


ప్రథమ కుటుంబం

డీఎంకేకు రూ.200 కోట్ల ముడుపులు అందినట్లు అన్నామలై చేసిన ఆరోపణలనూ డీఎంకే తోసి పుచ్చింది. చెన్నై మెట్రో రైలు ప్రాజెక్ట్ అవినీతిపై 2014 నుంచి సీబీఐ ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. అన్నామలై చేసిన అవినీతి ఆరోపణలపై కేసు నమోదు చేయాలని డీఎంకే ఆర్ఎస్ భారతి సవాల్ విసిరారు. ఇక అన్నామలై పేర్కొన్నట్లుగా ఆయన ఇంటి అద్దె నుంచి ఇతర ఖర్చులకు సంబంధించి నెలకు ఏడు నుంచి ఎనిమిది లక్షలను ఇతరులు, ఆయన పార్టీ భరిస్తే ఇక ఆయనకు సొంతంగా ఏమి ఉన్నాయని డీఎంకే ఎంపీ ఆర్ఎస్ భారతి ప్రశ్నించారు.

### ఎదురు దాడి

అంతేకాదు, డీఎంకే అన్నామలైపై ఎదురు దాడికి దిగింది. ఆయన ఇంటి ఖర్చులు, ఆఫీస్ ఖర్చుల లెక్కలు తీసింది. కారెక్కడిది..కారులో పెట్రోల్‌కు పైసలెక్కడివీ అని ప్రశ్నలు లేవనెత్తింది. నెలకు ఏడు నుంచి ఎనిమిది లక్షల రూపాయలు ఎక్కడి నుంచి వస్తున్నాయని, వేల కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంకే నేతలు,అవినీతి మచ్చలేని అన్నామలైని ప్రశ్నిస్తున్నారు. అలాగే, ఆయన చేతికున్న ఖరీదైన వాచ్ ఎక్కడిదని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలు అన్నిటికీ అన్నామలై సమాధానం ఇచ్చారు. అంతే కాదు, ఆయన ఐపీఎస్ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఇంతవరకు జరిపిన బ్యాంకు లావాదేవీలకు సంబంధించి 212 పేజీల బ్యాంకు ఎకౌంటు స్టేట్‌మెంట్ బహిర్గతం చేశారు. డీఎంకే నేతలు, మీడియా, సామాన్య ప్రజలు ఇంకా ఎవరైనా చూసుకోవచ్చని సవాలు విసిరారు. అంతే కాదు, తనపై నిరాధార ఆరోపణలు చేసిన డీఎంకే నేతలపై పరువు నష్టం కేసులు వేస్తానని ప్రకటించారు. అన్నట్లుగానే, అరుధర అవినీతి కేసులో తనకు ముడుపులు ముట్టాయని ఆరోపణలు చేసిన డీఎంకే నేత ఆర్ఎస్ భారతికి రూ. 500 కోట్ల పరువు నష్టం డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసు పంపారు.

### ఇది అంతం కాదు


నిజానికి, డీఎంకే నేతల అవినీతి ఆరోపణలకు సంబంధించి డీఎంకే ఫైల్స్ బయట పెట్టింది పిసరంత అయితే బయటకు రావలసింది కొండంత అని, అన్నామలై అంటున్నారు. ఈ సంవత్సరం చివరి వరకు, మరిన్ని సంచలన వివరాలతో డీఎంకే ఫైల్స్ ... విడుదల చేస్తానే ఉంటానని, ఆయన చెపుతున్నారు. అంతేకాదు త్వరలో డీఎంకే ఫైల్స్‌ను ప్రజల్లోకి తీసుకు వెళతామని అన్నామలై స్పష్టం చేశారు. అలాగే, డీఎంకే నేతలు డిమాండ్ చేసిన విధంగా క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని, పరువు నష్టం కేసులకు సంబంధించి డీఎంకే నేతలు ఇచ్చిన లీగల్ నోటీసులకు స్వాగతం పలుకుతున్నానని అన్నామలై స్పష్టం చేశారు. పరువు నష్టం నోటీసులు ఇచ్చిన డీఎంకే నాయకులు ప్రొసీడ్ కావాలని అంటున్నారు. కోర్టులో కేసుకు ఎదుర్కునేందుకు తను సిద్ధంగా ఉన్నానని అన్నామలై డీఎంకే నేతలకు సవాలు విసిరారు. ఇప్పుడు బంతి డీఎంకే కోర్టులో ఉంది.. స్టాలిన్ సాహసం చేస్తారా .. చేతులెత్తేస్తారా.. చూడవలసి ఉంది. ★

## అంత ఖరీదైన వాచీ ఎక్కడిది?



ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న డీఎంకే ఒక అస్త్రాన్ని దక్కించుకున్నానని సంబరపడింది. అదే అన్నామలై చేతికి ఉండే రాఫెల్ వాచ్. నాలుగు గొర్రెలు మాత్రమే ఆస్తిగా ఉన్న కుటుంబం నుంచి వచ్చిన అన్నామలైకు అంత ఖరీదైన చేతి గడియారం ఎలా వచ్చిందని రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీ ప్రశ్నించడంతో అన్నామలై రంగంలోకి దిగారు. అందుకు సంబంధించిన బిల్లులను బహిర్గతం చేయాలని కూడా ఆయన కోరారు. బెల్ అండ్ రాస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఆ వాచ్‌ను కోయంబత్తూరుకు చెందిన మిత్రుని వద్ద కొనుగోలుచేశానని, ఇందుకు సంబంధించిన బిల్లు ఇదిగోనంటూ చూపించారు. ఈ వాచ్‌ను మొదట చేరలతన్ రామకృష్ణన్ కోయంబత్తూరులోనే మార్చి, 2021లో 4.5 లక్షలకు కొనుగోలు చేశారని, తరువాత ఆయన నుంచి తాను మూడు లక్షల రూపాయలకు కొనుగోలు చేశానని అన్నామలై వివరించారు. చేరలతన్ నుంచి తాను మే, 2021లో కొన్నట్టు చెప్పారు. తనకు చేరలతన్ రెండేళ్లుగా తెలుసునని విలేకరుల సమావేశంలో అన్నామలై తెలియచేశారు. అయితే ఈ బిల్లులో కొన్ని అసమంజసాలు ఉన్నాయని డీఎంకే నాయకులు తరువాత మళ్లీ విమర్శలు గుప్పించారు. ఇన్ని లక్షల కోట్ల అవినీతి చేసిన వారికి ఆ వాచీ, మూడు లక్షలు ఎందుకు కనిపించాయో మరి!

వడ్డించేవాడు మనవాడైతే.. పంక్తిలో చివర కూర్చున్నా అన్నీ అందుతాయి. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఇటీవల చేసిన పని ఇంత కాలంగా ఆయన వేసుకున్న ముసుగును ఒక్కసారిగా తొలగించింది. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గానికి చెందిన కలెక్టర్‌ను హత్య చేయించిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తిని 'సత్ప్రవర్తన' కారణంగా జైలు నుంచి విడిచిపెట్టారు. గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ ఆనంద్‌మోహన్‌సింగ్ విడుదల వెంటనే వివాదాస్పదంగా మారింది. ఆయన విడుదలను సవాలు చేస్తూ దివంగత కలెక్టర్ సతీమణి ఉమాదేవి సుప్రీంకోర్టు తలుపు తట్టారు.



# 'సత్ప్రవర్తన'కు కులగణకుల 'రాచ'బాట

నితీశ్‌తో ఆనంద్‌మోహన్

**30** ఏళ్ల క్రితం జరిగిన ఘటన. ఇంకా ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిగిపోలేదు. జరిగింది బిహార్‌లోనే అయినా, తెలుగు ప్రాంతంతోను ముడిపడి ఉంది. లాలూ ప్రసాద్ యాదవ్ బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయం అది. అన్ని రంగాల్లోనూ వెనుకబడిన ఈ రాష్ట్రంలో మాఫియా గ్యాంగులు పోటీ ప్రభుత్వాన్ని నడిపేవి. 1994లో ముజఫర్‌పూర్ గ్యాంగ్‌స్టర్ ఛోటన్ శుక్లా అనే నేరగాడిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఇతడు గ్యాంగ్‌స్టర్, బిహార్ పీపుల్స్ పార్టీ (బీపీపీ) ఆనంద్ మోహన్ సింగ్ తోమర్‌కు ముఖ్యఅనుచరుడు. ఈ హత్యకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లు చెలరేగాయి. 1994 డిసెంబర్ 5న ఛోటన్ శుక్లా అంత్యక్రియకు భారీ సంఖ్యలో బీపీపీ కార్యకర్తలు తరలి వచ్చారు. ఆ సమయంలోనే గోపాల్‌గంజ్ జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్) జి.కృష్ణయ్య (35) అదే మార్గంలో కారులో వెళుతున్నారు. ఆనంద్‌మోహన్ పిలుపుతో ఓ పెద్ద మూక కృష్ణయ్యను కారు నుంచి బయటకు లాగి రాళ్లతో తీవ్రంగా కొట్టారు. ఈ దాడిలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తనపై దాడి జరుగుతున్నా వెంట ఉన్న అంగరక్షకున్ని పాడేందుకు ప్రయత్నించారు కృష్ణయ్య. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది.

ఆందోళనకారులను రెచ్చగొట్టి కృష్ణయ్య హత్యకు కారణమయ్యాడన్న ఆరోపణలపై ఆనంద్‌మోహన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడు విచారణలో ఉండగానే, కారాగారం నుంచి 1996లో సియోహార్ స్థానం నుంచి పోటీ చేసి లోక్‌సభ సభ్యునిగా గెలిచాడు. కానీ ఈ కేసులో బిహార్ దిగువ కోర్టు ఆనంద్‌మోహన్‌ను దోషిగా తేల్చి, 2007లో అతడికి మరణశిక్ష విధించింది. అలా ఆనందమోహన్ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మరణశిక్ష పడిన తొలి రాజకీయ నాయకుడిగా కూడా చరిత్రకు ఎక్కాడు. కాగా ఈ తీర్పుపై విచారణ చేపట్టిన పట్నా హైకోర్టు 2008లో ఈ శిక్షను జీవితఖైదుగా మార్చింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థించింది.

ఆనంద్‌మోహన్ సింగ్‌కు బిహార్ రాజకీయ నాయకులతో బలమైన సంబంధాలున్నాయి. యావజ్జీవ శిక్షతో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోయినా జైలు నుంచే చక్రం తిప్పేవాడు. ఆయన సతీమణి లవ్లీ ఆనంద్ కూడా ఒకసారి లోక్‌సభకు ఆర్‌జేడీ తరపున ఎన్నికయ్యారు. వీరి కుమారుడు చేతన్ ఆనంద్ ప్రస్తుతం ఆర్‌జేడీ ఎమ్మెల్యే. తన కొడుకు చేతన్ నిశ్చితార్థం కోసం 15 రోజుల పెరోల్‌పై బయటికొచ్చాడు ఆనంద్‌మోహన్. ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సహా పలువురు రాజకీయ నేతలు హాజరయ్యారు.

జైలు మాన్యువల్ 2012 నిబంధనలలో నితీశ్‌కుమార్ సర్కారు ఏప్రిల్ 10న కీలక మార్పులు చేసింది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వోద్యోగిని హత్య చేసి, శిక్ష అనుభవిస్తున్నవారికి 'రెమిషన్' (శిక్షాకాలం తగ్గింపు) ఇవ్వరాదన్న నిబంధనను తొలగించారు. దీని ప్రాతిపదికగానే 27 మంది ఖైదీల విడుదలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఆనంద్‌మోహన్ సింగ్ కూడా ఒకరు. ఏప్రిల్ 20న జరిగిన రెమిషన్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు దానిలో పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారి కృష్ణయ్య హత్య కేసులో దోషిగా యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న ఆనంద్ మోహన్ నిబంధనల సవరణతో జైలు నుంచి విడుదలయ్యాడు. జైలు మాన్యువల్‌లో మార్పులు చేయకపోతే ఆనంద్‌మోహన్ మరో ఆరేళ్లు జైలులోనే ఉండాలి. అయితే తన కుమారుడు చేతన్ ఆనంద్ నిశ్చితార్థం కోసం పెరోల్‌పై బయటకువచ్చాడు. ఈ వేడుకల్లో ఉండగానే జైలు నుంచి శాశ్వతంగా విడుదలవుతున్న సమాచారం అందించారు.

రాష్ట్రంలో కులగణన గురించి చర్చ జరుగుతున్న సమయంలో నితీశ్ ఎలాంటి సంకేతాలు ఇవ్వాలని అనుకున్నారో తెలియదు కానీ, ఆర్జేడీ–జేడియూ–కాంగ్రెస్ సంకీర్ణ సర్కారులో రాజ్‌పుత్ నాయకుల వత్తిడి మేరకే ఆనంద్‌మోహన్ విడుదల నిర్ణయం నితీశ్ తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది.

రాజ్‌పుత్‌లను ఆకర్షించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి నితీశ్ 2016లో ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తానే నీరుగార్చారన్న విమర్శ కూడా ఉంది.


నితీశ్ తమ కూటమి భాగస్వామి ఆర్జేడీ చేతుల్లోకి పావుగా మారిపోయారని బిహార్ బీజేపీ అగ్రనేత సుశీల్‌కుమార్ మోదీ ఆరోపించడం అందుకే. మిత్రపక్షం ఆర్జేడీ కోసం నితీశ్ చట్టాన్ని త్యాగం చేశారని ధ్వజమెత్తారు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వారిలో ఆనంద్‌మోహన్‌తో పాటు భయంకర నేరాలతో శిక్షలు అనుభవిస్తున్నవారు కూడా ఉన్నారు. కాబట్టే సంఘవిద్రోహ శక్తుల నుంచి ప్రజలకు ఇక రక్షణ ఎక్కడిదన్న ఆందోళనలు కూడా మొదలయినాయి. ఉత్తరప్రదేశ్‌లో యోగికి భయపడి నేరగాళ్లు రాష్ట్రం వదిలి పోతుంటే, నితీశ్ జైళ్లలో ఉన్న నేరగాళ్లని ప్రధాన జీవన స్రవంతిలోకి వదిలి పెడుతున్నారు. ఈ నిర్ణయం కృష్ణయ్య రెండో హత్య అని బీఎస్పీ అధినేత్రి మాయావతి వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గ ఐఏఎస్ అధికారి హత్య కేసులో దోషి విడుదలపై తప్పు పట్టారామె. ఈ వ్యాఖ్యలేవీ అసంబద్ధమైనవని అనలేం. పైగా నితీశ్ ఈ నిర్ణయం చేయడానికి తీసుకున్న సమయం ఆయన భవిష్యత్తుకి కూడా చేటు చేసేదే. నితీశ్ విపక్షాల ప్రధాని అభ్యర్థిగా ప్రచారం పొందుతున్న సమయంలో ఆనంద్‌మోహన్ విడుదల నిర్ణయం ఏమిటి? పదవీ వ్యామోహంలో ఆయన అంతగా స్పృహ లేకుండా ఉన్నారా? అందుకే కరుడుగట్టిన నేరగాళ్లను కేవలం రాజకీయాల కోసం విడిచిపెట్టే ప్రభుత్వంపై, నాయకులపై ప్రజలకు ఏం నమ్మకం ఉంటుందని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నించారు.

ఆనంద్‌మోహన్‌ను విడుదల నిర్ణయాన్ని ఇండియన్ సివిల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (సెంట్రల్) అసోసియేషన్ తప్పుపట్టింది. విధి నిర్వహణలో ఉన్న ఐఎఎస్ అధికారిని హత్య చేసిన కేసులో ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దారుణమని వ్యాఖ్యానించింది. ఇది న్యాయ నిరాకరణతో సమానం అని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరింది. "ఖైదీల వర్గీకరణ నిబంధనలను మార్చడం ద్వారా గోపాల్‌గంజ్ మాజీ జిల్లా మేజిస్ట్రేట్ జి. కృష్ణయ్యను దారుణంగా హత్య చేసినవారిని విడుదల చేయాలనే బిహార్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం పట్ల సెంట్రల్ ఐఎఎస్ అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తోంది" అని అది పేర్కొంది. ఆనంద్ మోహన్ విడుదలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ అసోసియేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. వివిధ రాష్ట్రాల ఐఏఎస్‌లు ఈ చర్యను ఖండించారు. బిహార్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. అయితే బిహార్ ఐఏఎస్ అధికారుల సంఘం మాత్రం ఆనంద్ మోహన్ విడుదలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా మౌనంగా ఉండటం విమర్శలకు దారి తీస్తోంది. దీనినే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ నిలదీశారు.

ఆనంద్‌మోహన్ విడుదలను దివంగత కృష్ణయ్య కుటుంబ సభ్యులను దిగ్భ్రాంతికి గురి చేయడం సహజం. ఏ తప్పూ చేయని తమ ఇంటి యజమానిని హత్య చేయించిన వ్యక్తికి క్షమాభిక్ష పెట్టడం ఆ కుటుంబం గట్టిగా వ్యతిరేకించింది. ఇదంతా రాజకీయ ప్రయోజనాల కోసమేననీ, బిహార్‌లో ఇప్పటికీ నడుస్తున్నది ఆటవిక రాజ్యమేననీ కృష్ణయ్య భార్య ఉమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, ప్రధాని ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని, ఆనంద్‌మోహన్‌ను మళ్లీ జైలుకు పంపాలని నితీశ్‌ను డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే నీతీశ్ ప్రభుత్వం ఆనంద్‌ను విడుదల చేసిందని కృష్ణయ్య కుమార్తె పద్మ విమర్శించారు. ఈ విషయంలో న్యాయపోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## కూలీ నుంచి

తెలుగు ఐఏఎస్ కృష్ణయ్య జీవితం వడ్డించిన విస్తరి కాదు. కానీ దేశ యువతకు ఆయనొక ఆదర్శమే. పేద కుటుంబంలో పుట్టి కూలీగా జీవితం ప్రారంభించి సివిల్ సర్వీసులకు ఎంపికైన స్ఫూర్తిదాయక జీవితమాయనది. జోగులాంబ గద్వాల్ జిల్లా ఉండవల్లి మండలం, భైరాపురం గ్రామంలో శేషన్న, వెంకమ్మ దంపతులకు ఫిబ్రవరి 8, 1957న జన్మించారు కృష్ణయ్య. చిన్నప్పటి నుంచి కూలీ పనులు చేయాల్సి వచ్చేది. మూడు పైసలకు సిమెంట్ బస్తాలు ఎత్తడం, వ్యవసాయ కూలీ పని చేయడంతో పాటు రైల్వే గ్యాంగ్‌మెన్ అయిన తండ్రికి కూడా సాయం చేసేవారు. అలాంటి పరిస్థితులలోను కృష్ణయ్య చిన్నప్పటి నుంచి పుస్తకాలను విరివిగా చదివే అలవాటు చేసుకున్నారు. గద్వాల్‌లోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఓయూ పీజీ కాలేజీలు చదువుకున్నారు. జర్నలిజంతో పాటు ఆంగ్ల సాహిత్యంలో ఎంఏ చేశారు. సాదాసీదా జీవితాన్ని ఇష్టపడే కృష్ణయ్య స్వయంసేవక్ కావడం గమనార్హం. స్వామి వివేకానంద బోధనల నుండి ప్రేరణ పొందారు. ఎంతో పట్టుదలతో సివిల్స్ సాధించారు. గద్వాల్‌లో ఉన్నప్పుడు ఉమాదేవిని ప్రేమించి, ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసిన తర్వాత పెళ్లి చేసుకున్నారు. కృష్ణయ్యను మొదట బొగ్గు గనులతో నిండిన హజారీబాగ్‌లో నియమించారు. కృష్ణయ్యకు అర్ధరాత్రి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే బయలు దేరేవారు. ముఖ్యమంత్రిగా ఉన్న లాలూ ప్రసాద్ యాదవ్ తనకు లబ్ది కూర్చే పనుల కోసం కృష్ణయ్యను అడిగేవారు. కానీ తాను నిబంధనల ప్రకారమే నడుచుకుంటానని ఆయన స్పష్టం చేసేవారు. పనినే కర్తవ్యంగా భావించే కృష్ణయ్య తన తండ్రి మరణించినప్పుడు అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. ఎందుకంటే అయోధ్య ఉద్యమ సమయంలో బాబ్రి కట్టడం కూల్చివేత తర్వాత ఆ రోజు బిహార్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వారం తర్వాత స్వగ్రామానికి



# ఐఏఎస్ అధికారిగా..



వచ్చి తన తండ్రి సమాధి వద్ద నివాళులర్పించారు. కృష్ణయ్య గోపాల్‌గంజ్ జిల్లా మెజిస్ట్రేట్‌గా పని చేస్తున్న కాలంలో పేద ప్రజల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నారు. డిసెంబర్ 5, 1994న హత్యకు గురయ్యారు.

కృష్ణయ్య మరణం తరువాత భార్య ఉమాదేవికి బిహార్ ప్రభుత్వం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ పదవిని ఇచ్చింది. అయితే ఆమె నిరాకరించి హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉమాదేవికి ఉద్యోగం ఇచ్చింది.

**సుప్రీం కోర్టులో పిటిషన్**

ఆనంద్‌మోహన్ సింగ్‌ను బిహార్ ప్రభుత్వం జైలు నుంచి విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ ఐఎఎస్ జి.కృష్ణయ్య భార్య ఉమాదేవి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆనంద్‌మోహన్‌కు అంతిమ శ్వాస వరకు జీవితకాల శిక్ష పడిందని, కానీ, 14 ఏళ్లకే విడుదల చేయడం సరికాదని అన్నారు. ఆయనకు ఎలాంటి వెసులుబాటూ ఇవ్వకుండా, కోర్టు ఆదేశాలను కచ్చితమైన రీతిలో పాటిస్తూ ఆయనను చనిపోయే వరకు జైలులో ఉంచాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఉమా కృష్ణయ్య తరపు న్యాయవాది చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ తేదీని ఖరారు చేసింది. ఈ పిటిషన్‌ను మే 8న విచారించేందుకు భారత అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. ★

భర్త ఫోటోతో ఉమాదేవి

కానీ గొప్ప ప్రజాస్వామికవాదిగా, ఉదారవాదిగా పేరు సంపాదించిన నితీశ్ తన చర్యను సమర్థించుకోవడం విశేషం. ఆనంద్‌మోహన్ విడుదలను పూర్తిగా సమర్థించుకున్నారు. ఆనంద్‌మోహన్, 14 ఏళ్ల జైలు శిక్ష పూర్తి చేసుకున్న 26 మందిని కూడా విడుదల చేయడంలో తప్పేముందని ఎదురుదాడికి దిగారు కూడా. జైల్ మాన్యువల్‌లో మార్పులను నాడు అందరూ ఆహ్వానించారని, నేడు ఎందుకు విమర్శలు చేస్తున్నారని నితీశ్ ఎదురు ప్రశ్నించారు. తన భర్తను విడుదల చేసినందుకు ఆనంద్‌మోహన్ భార్య లవ్లీ ఆనంద్ నితీశ్ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఏమైనా ఆనంద్‌మోహన్‌లో నాటకీయత కాస్త ఎక్కువే. తన విడుదల వార్త తెలిసిన తరువాత ఆయన నితీశ్ కృతజ్ఞతలు, కృష్ణయ్య భార్యను కలుసుకుంటాను అని ట్వీట్ చేశారు. ఇందులో అతిని చూడకుండా ఉండడం కష్టం. నితీశ్ నిర్ణయంతో ఏప్రిల్ 27వ తేదీన సహర్సా జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. ఇటీవలి వికృత సంప్రదాయానికి తగ్గట్టే ఏదో ఘనకార్యం చేసి జైలుకు వెళ్లి వస్తున్న వారి కోసం అన్నట్టే స్వాగతం పలికేందకు భారీ ఎత్తున అభిమానులు తరలి వచ్చారు. కానీ జైలు నుంచి రాగానే రహస్య ప్రదేశానికి వెళ్లిపోయాడు ఆనంద్‌మోహన్. తన తండ్రి కృష్ణయ్య కుటుంబాన్ని కలవాలనుకుంటున్నారని ఆయన కుమారుడు చేతన్ ఆనంద్ మీడియాకు చెప్పారు. దీనిపై బీజేపీ తెలంగాణ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇందుకు అనుమతి ఇస్తే తీవ్ర పరిణామాలుంటామని హెచ్చరించారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్. పాలమూరు బిడ్డ కృష్ణయ్యను అతి కిరాతకంగా చంపిన హంతకుడు ఆనంద్‌మోహన్ కృష్ణయ్య కుటుంబ సభ్యులను కలవబోతున్నారన్న వార్త తనను కలిచివేస్తోందన్నారు. నిజానికి ఇక్కడ చెప్పుకోవలసిన విషయం ఒకటి ఉంది. అది–నితీశ్, కేసీఆర్ ఇద్దరూ మాట్లాడుకున్న తరువాతే ఆనంద మోహన్ హైదరాబాద్ రావాలన్న నిర్ణయం ప్రకటించారని తాము భావిస్తున్నామని బీజేపీ నాయకులు చెబుతున్నారు. మరొక ముఖ్య విషయం కూడా ఉంది. ఆనంద్‌మోహన్ విడుదలను అన్ని విపక్షాలు తప్పు పట్టాయి. కానీ మృతుడు తెలంగాణ వాసి అయినప్పటికీ, హత్య కిరాతకమే అయినప్పటికీ ఈ అంశం మీద భారస ప్రభుత్వం మాత్రం పెదవి విప్పలేదు. దేశ వ్యాప్తంగా అని వైపుల నుంచి బిహార్ సర్కారును అంతా తప్పు పట్టినా తెలంగాణ సీఎం కేసీఆర్ ఎందుకు లేఖ రాయడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి నితీశ్ సర్కారు వైఖరిపై సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఇప్పుడు తన దోస్తు , బిహార్ సీఎం నితీశ్ కుమార్‌ను సమర్థిస్తారా లేక ఐఏఎస్ అధికారి కుటుంబానికి మద్దతుగా నిలుస్తారో లేదో చెప్పాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఇలాంటి వాటికైనా కేసీఆర్ స్పందిస్తే ఆయన ఎంతటి ప్రజాస్వామ్యవాదో జనానికి తెలుస్తుంది.



జి. కృష్ణయ్య

**ఆనంద్‌మోహన్ విడుదలను దివంగత కృష్ణయ్య కుటుంబ సభ్యులను దిగ్భ్రాంతికి గురి చేయడం సహజం. ఏ తప్పూ చేయని తమ ఇంటి యజమానిని హత్య చేయించిన వ్యక్తికి క్షమాభిక్ష పెట్టడం ఆ కుటుంబం గట్టిగా వ్యతిరేకించింది. ఇదంతా రాజకీయ ప్రయోజనాల కోసమేననీ, బిహార్‌లో ఇప్పటికీ నడుస్తున్నది ఆటవిక రాజ్యమేననీ కృష్ణయ్య భార్య ఉమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు.**

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



# ఆ ఎమ్మెల్యేలపై

తెలంగాణ సుసంపన్న, సస్యశ్యామల, ధనిక రాష్ట్రం. దేశంలోనే సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందిస్తున్న రాష్ట్రం. అవినీతి లేని రాష్ట్రం.... ఇవన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నినాదాలు, వ్యాఖ్యలు, ప్రకటనలు. కానీ, వాస్తవ పరిస్థితి అలాగే ఉందా? లేక అందుకు విరుద్ధంగా ఉందా? అని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరడం లేదని వాదిస్తున్నాయి. ధనిక రాష్ట్రం కాదని, లోటు బడ్జెట్‌లో ఉందని లెక్కలు చెబుతున్నాయి. అసలు కేసీఆర్ పాలనే అవినీతిమయమని ప్రతీ సభలో, ప్రతీ సందర్భంలో అవి నినదిస్తు న్నాయి. అయితే, ఇప్పుడు స్వయంగా కేసీఆర్ నోటి నుంచే బయటికి వచ్చిన ఆ మాట సొంత పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రతిపక్షాలకు ఆయుధమయ్యింది. వాస్తవమేంటో బయటకు రావాల్సిందేనన్న డిమాండ్లు నలువైపుల నుంచీ చుట్టు ముడుతున్నాయి. అంతర్గతంగా చెప్పాల్సిన అంశాలను బాహాటంగా సభలో ప్రస్తావించడం సంచలనంగా మారింది. కేసీఆర్‌కే బూమరాంగ్ అయ్యిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

దేశంలోనే ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సహా మంత్రులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రతి సభలోనూ చెప్పడం సర్వసాధారణం కాగా. కొన్ని పథకాల విషయంలో వాటిని అంగీకరించాల్సిందే అన్న భావన ఉంది. అయితే, సంక్షేమం విషయంలో అవినీతికి తావులేదని, ఇది అవినీతి రహిత రాష్ట్రమని కేసీఆర్ సహా ప్రభుత్వ యంత్రాంగం ప్రతిసారీ చెబుతుండటం కూడా కేసీఆర్ తాజా వ్యాఖ్యల నేపథ్యంలో చర్చనీయాంశమవుతోంది.

తెలంగాణలో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకం దళితబంధు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పూర్తిస్థాయి సబ్సిడీతో ఎస్సీల కోసం ఈ పథకాన్ని రూపొందించారు. సమాజంలో ఎస్సీలపై వివక్ష కొనసాగుతోందని, దానిని రూపుమాపే లక్ష్యంతో ప్రతి ఎస్సీ కుటుంబానికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని కేసీఆర్ ప్రకటించారు. అందులో భాగంగానే ఎస్సీలైన ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కూడా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రతి ఎస్సీ కుటుంబానికి రూ.పది లక్షల ఆర్థిక సాయం అందించడం దళితబంధు ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద పొందిన ఆర్థిక సాయాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లించవలసిన అవసరం లేదు. అంటే.. పూర్తి సబ్సిడీతో కూడిన సాయమన్న మాట. హుజురాబాద్ ఉపఎన్నిక సమయంలో ఈ పథకాన్ని ప్రకటించారు. అయితే, పథకం విధి విధానాల విషయంలో అప్పుడే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఎస్సీల సాధికారత అంశం సమంజసమే అయినా, అట్టడుగున ఉన్నవాళ్లతో పాటు, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింప జేయనవసరం లేదన్న వాదనలు వినిపించాయి. అంతగా సాయం చేయాలనుకుంటే.. ఇతర సామాజిక వర్గాల్లోనూ అంతకంటే అట్టడుగున ఉన్న కుటుంబాలను ఎంపిక చేసి సాయం అందించవచ్చన్న సూచనలు వచ్చాయి. కానీ, ప్రభుత్వం మాత్రం వాటిని పరిగణనలోకి తీసుకోకుండా దళితబంధు పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే.. కొంతమేర మాత్రమే అబ్ధిదారులను ఎంపిక చేసి సాయం అందించారు. ఈ పథకం కింద రాష్ట్రమంతటా సాయం అందించాలంటే మరికొన్ని సంవత్సరాలు పట్టే అవకాశం ఉంది.

మరికొన్ని సంక్షేమ పథకాలు కూడా తెలంగాణలో అమలవుతున్నాయి. వాటిలో రైతు బంధు, పింఛన్లు వంటివి ప్రధానంగా చెప్పుకోవచ్చు. అయితే, వీటి కింద లబ్ధిదారులను ఎంపిక చేసే సందర్భం, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం విడుదలయ్యేటప్పుడు పెద్దఎత్తున అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు మొదటి నుంచీ వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారుల నుంచి బలవంతంగా 'ఆమ్యామ్యా'లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. విపక్షాలు తరచూ ఈ అంశాన్ని లేవనెత్తుతున్నా, వాటిమీద ఇన్నాళ్లూ పెద్దగా చర్చ జరగలేదు. ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి కేసీఆర్.. పార్టీ ఆవిర్భావ సమావేశం వేదికపైనే బహిరంగంగా ఎమ్మెల్యేలను హెచ్చరించడం, సంక్షేమ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులనుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న లెక్కలు తన దగ్గర ఉన్నాయని చెప్పడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ 2001 ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీని స్థాపించారు. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తర్వాత మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించి, దీనితో కేసీఆర్ సీఎం అయ్యారు. తరువాతి ఎన్నికలలో (2018) కూడా విజయం సాధించారు. ఇక గతేడాది దేశ రాజకీయాల్లోకి వెళ్తున్నట్టు ప్రకటించి టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి)గా మార్చారు. పేరు ఏదైనా పార్టీ గత నెల (ఏప్రిల్) 27వ తేదీకి 22 ఏళ్లు పూర్తి చేసుకుని 23వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం అయ్యారు. మంత్రులనుంచి పార్టీ జిల్లా స్థాయి నాయకుల దాకా తరలివచ్చారు.

సుజాత గోపగోని, 6302164068



# చర్యలేవి?

ఈ సందర్భంగా ప్రసంగించిన కేసీఆర్ 'దళితబంధులో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టా నా దగ్గర ఉంది. కొందరు ఎమ్మెల్యేలు లబ్ధిదారుల వద్ద రూ. మూడు లక్షల వరకు తీసుకున్నారు. ఇది రిపీట్ అయితే వాళ్లకు టికెట్ ఉండదు' అని బీఆర్ఎస్ నేతల గుండెల్లో బాంబు పేల్చారు. అనుచరులు డబ్బులు తీసుకున్నా ఎమ్మెల్యేలదే బాధ్యత అని స్పష్టం చేశారు. టికెట్ ఇవ్వకపోవడం కాదని, అసలు పార్టీలోనే ఉండబోరని కుండబద్దలు కొట్టారు. ఇప్పటికే చాలా సార్లు చెప్పానని, అయినా కొందరు ఎమ్మెల్యేలు వైఖరి మార్చుకోవడం లేదని మండి పడ్డారు. సరిగ్గా పనిచేయని ఎమ్మెల్యేల తోకలు కత్తిరిస్తా అంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆ సభలో కేసీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. దళితబంధుపథకంలో అవినీతి జరుగుతోందని స్వయంగా కేసీఆరే చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది.

వాస్తవానికి ఎమ్మెల్యేల అనుచరులు రూ.లక్ష నుంచి 2లక్షల వరకు దండుకుంటున్న విషయం గతేడాదే మీడియా ద్వారా బయటకు వచ్చింది. డబ్బులు ఇచ్చి ఏడాది గడిచినా దళితబంధు కింద సాయం అందకపోవడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్న అంశం చర్చకు వచ్చింది. దళితబంధులో అవినీతి జరిగిందని తాజాగా స్వయంగా సీఎం కేసీఆరే స్పష్టంగా చెప్పడం రాజకీయ రగడ రాజేసింది. గతంలో ప్రతిపక్ష నేతలు విమర్శలు చేసినప్పుడు ఖండించిన బీఆర్ఎస్ పెద్దలు పథకాన్ని పారదర్శకతతో అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. కానీ, ఇప్పుడు అవినీతి జరిగిందని కేసీఆరే ఒప్పుకోవడం రాజకీయంగా ఆ పార్టీకి మింగుడు పడని వ్యవహారంగా మారింది.

స్వయంగా ముఖ్యమంత్రే వ్యాఖ్యానించడం ఆషామాషీ కాదని విపక్షాల నేతలు అంటున్నారు. కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేలను అంత సూటిగా, స్పష్టంగా విమర్శించిన కేసీఆర్ తన దగ్గర కచ్చితంగా వాళ్ల పేర్లు, అవినీతికి సంబంధించిన వివరాలు ఉంటాయని, అలాంటి ఎమ్మెల్యేల పేర్లు బయట పెట్టాలని, వారిని పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని, అనర్హులుగా ప్రకటించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇంకొందరు నేతలైతే, సీఎం వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని, విచారణ జరపాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేస్తున్నారు. కేసీఆర్ వ్యాఖ్యల ఆధారంగా దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మంజూరులో కమీషన్లు నొక్కేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విచారణ జరపాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. పారదర్శకత, నిక్కచ్చితనం అంటూ పదేపదే నీతులు వల్లెవేసే కేసీఆర్, అవినీతిపరులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకపై అవినీతికి పాల్పడవద్దని హెచ్చరించడం బాగున్నా, ఇప్పటి వరకూ జరిగిన కమీషన్ల దందాను ఎలా ఉపేక్షిస్తారని నిలదీస్తున్నారు.

30 శాతం కమీషన్ తీసుకునే ప్రభుత్వం మనకు అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజలను రాబందుల్లా పీక్కు తింటున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. వాళ్లపై చర్యలు తీసుకునే దమ్ము, ధైర్యం కేసీఆర్‌కు లేదని, ఎమ్మెల్యేల అవినీతిని ముఖ్యమంత్రే ప్రోత్స హిస్తున్నారని ఆరోపణలు గుప్పిస్తున్నారు. కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేల జాబితాను బయటపెట్టాలని, లబ్ధిదారులకు న్యాయంగా ప్రభుత్వం నుంచి రావలసిన డబ్బును ఎమ్మెల్యేల నుంచి తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న తాడికొండ రాజయ్యపై ఆరోపణలు రాగానే పదవి నుంచి వెంటనే తొలగించారని, ఇప్పుడు ఎమ్మెల్యేల అవినీతిపై స్పష్టమైన సమాచారం ఉందంటూనే ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రతిపక్షాల నేతలు నిలదీస్తున్నారు.

వాస్తవానికి ఈ పథకం అమలుకు సంబంధించి మొదటి నుంచీ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని 17 లక్షల ఎస్సీ కుటుంబాలకు విడతల వారీగా సాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, పైలట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్‌లో సంతృప్తి స్థాయిలో పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించింది. అయితే, ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో పథకాన్ని అమలు చేస్తే, అక్రమాలు జరిగే అవకాశాలుంటాయని గతంలోనే ప్రతిపక్ష నాయకులు, నిపుణులు హెచ్చరించారు. అయినా పట్టించుకోని ప్రభుత్వం, లబ్ధిదారులకు నేరుగా నగదు రూపం లోనే సాయం మొత్తం ఇవ్వాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించింది. ఎమ్మెల్యేలు ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని ముందుగా తమ అనుచరులు, కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేశారన్న ఆరోపణలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఒక్కో ఎమ్మెల్యే గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు లంచంగా తీసుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. కొన్ని చోట్ల ప్రారంభించిన యూనిట్లలో నష్టాలు రావడం, కొన్ని మూతపడడం వంటి పరిస్థితులు కూడా నెలకొన్నాయి. ఇలాంటి పరిణామాలతో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో తేరుకున్న ప్రభుత్వం..లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఎమ్మెల్యేల పరిధి నుంచి తప్పించి ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది.

అంటే.. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అవినీతి, అక్రమాలను ఇంతకుముందే గుర్తించింది. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం, వాళ్లు ఎంపిక చేసుకున్న ప్రాజెక్టులు సాధ్యమా? కాదా? అన్న అంశాన్ని ప్రభుత్వ అధికారులైతే సమర్థవంతంగా పూర్తిచేసే అవకాశం ఉంటుంది. పథకం మార్గదర్శకాలను కూడా పరిగణనలోకి తీసుకొని, నిబంధనల ప్రకారం ముందుకెళ్లే అవకాశం ఉంటుంది. అదే ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు అయితే.. జవాబుదారీ తనం ఉండకపోవచ్చు. అందుకే ఆలస్యంగా తేరుకున్న ప్రభుత్వం ఎమ్మెల్యేలను పక్కన బెట్టింది. ఈ మార్పులు జరిగి యేడాది అవుతుండగా... కేసీఆర్ ఇప్పుడు ఎమ్మెల్యేలను హెచ్చరించడం వెనుక ఎన్నికల వ్యూహం దాగి ఉందంటున్నారు విశ్లేషకులు.

అసలే ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ.. ఈ పరిణామం బీఆర్ఎస్ నేతలకు మింగుడు పడటంలేదు. గులాబీ నేతల్లో గుబులు పట్టుకుంది. ఎన్నికల్లో తమకు టిక్కెట్ దక్కుతుందా? లేదా? అని చాలామంది ఆందోళనలో పడ్డారు. ఇప్పటికే 42 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు పీకే సర్వేలో తేలింది. పార్టీ నేతలతో పాటు గ్రామాల్లో కూడా వీరిని జనం పట్టించుకోవడం లేదని సర్వే సారాంశం.

ఈ సర్వేలో కొందరు ఎమ్మెల్యేలు నాలుగో స్థానానికి కూడా పడిపోయారట. ఇలా ఒకటి కాదు రెండు కాదు మూడు సర్వేలు ఇవే తేల్చాయంటున్నారు. అసలే ఈ టెన్షన్‌లో తలలు పట్టుకుంటున్న పలువురు ఎమ్మెల్యేలకు తాజాగా కేసీఆర్ హెచ్చరికలు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

**రాష్ట్రంలో వైసీపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల్ని యథేచ్ఛగా దోచేస్తోంది. మైనింగ్ మాఫియా పేట్రేగిపోతోంది. రాష్ట్రంలోని 65 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మట్టి, గ్రావెల్, బాక్సైట్, లేటరైట్, ఇసుక, బెరైటీస్, లైంస్టోన్‌ను అక్రమంగా కొల్లగొడుతున్నారు. నదీ తీరాలు, వాగులున్న చోట ఇసుకను, కొండలు, గుట్టలున్న చోట మట్టిని, గనులున్న చోట ఖనిజాలను ఆయా అసెంబ్లీ స్థానాల పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. ప్రతి జిల్లాలో వేల కోట్ల విలువైన సంపదను తరలించుకుపోయారు. వైసీపీ ముఠా అవినీతిపై బీజేపీ ఈ నెల 5 నుంచి ఛార్జిషీట్లు వేసి వారి బాగోతాన్ని ఎండగట్టి ప్రజాక్షేత్రంలో వారిని దోషులుగా నిలబెడుతోంది.**




ఆ పార్టీ నేతలు పెద్దాపురం సమీపంలోని రామేశ్వరం మెట్ట వద్ద భారీ ఎత్తున తవ్వకాలు జరిపి వందల కోట్ల విలువైన మట్టిని తరలించుకోపోయినట్లు ఆరోపణలు వచ్చాయి. రామేశ్వరం పేట మెట్ట సర్వే నెంబరు 1 నుంచి 90 వరకు ఉన్న 828 ఎకరాల ఈ కొండల్లో ఇప్పటికే 425 ఎకరాల్లో అడ్డగోలుగా మట్టి, గ్రావెల్ తవ్వేసి రియల్ ఎస్టేట్ అవసరాలకు విక్రయించేశారని కలెక్టరుకు లిఖిత పూర్వక ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ కడప జిల్లా ఓబులాపురం అక్రమ మైనింగ్ తరహాలో కొండలన్నీ మాయమైపోయి లోయలు కనిపిస్తున్నాయి. మొదట్లో పేదల ఇళ్లస్థలాల చదునుకు ఇక్కడి నుంచి తాత్కాలిక పర్మిట్లు కేటాయించగా, అవన్నీ గత ఏడాది ప్రారంభంలోనే ముగిసినా, ఆ ముసుగులో ఇప్పటికీ రేయింబవళ్లు మట్టి, గ్రావెల్ తవ్వి కాకినాడ, చుట్టుపక్క ప్రాంతాలకు రియల్ ఎస్టేట్ అవసరాలకు విక్రయస్తూ కోట్లు గడిస్తున్నారనేది ఫిర్యాదు.

అనుమతులు లేకుండా తవ్వి, తరలించుకుపోయిన మట్టి, గ్రావెల్ విలువ రూ.550 కోట్లకుపైగా ఉందని, దీనిపై ప్రభుత్వానికి రూ.60 కోట్ల వరకు రాయల్టీ రావలసి ఉన్నా రూపాయి ఆదాయం కూడా రావడం లేదని ఫిర్యాదు దారులు చెబుతున్నారు. ఇక్కడి అక్రమాలపై స్పందించి మట్టి తవ్వకాలు జరగకుండా గత కలెక్టర్ మురళీధర్‌రెడ్డి రామేశ్వరం మెట్టలోని కొండలపై మొక్కలు నాటారని, వాటిని కూడా నరికేశారన్నారు. ఇక్కడి కొండలపై లక్షల సంఖ్యలో జీడి, మామిడి, టేకు చెట్లను ఎస్సీ కులస్తులు పెంచారని, వారికి మాయమాటలు చెప్పి ఆ భూముల్లోను మట్టి, గ్రావెల్ తవ్వేస్తున్నారని ఆరోపించారు. గనులశాఖ ఇక్కడకు వచ్చి సర్వే చేసి ఎన్ని కోట్ల క్యుబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తరలి వేయడంపై అంచనా వేయాలని ఇదివరకు నిర్ణయించింది. కానీ సిబ్బంది కొరత సాకుతో ఆ పని చేయలేదు. ఇప్పటికే ఇక్కడ సాగుతున్న అరాచకాల వలన వందలాది వన్య ప్రాణులు తరలిపోయాయి. ఈ అక్రమాల గురించి స్థానిక రెవెన్యూ, అటవీ, గనులశాఖ వారికి తెలుసు కానీ వైసీపీ నేతలకు భయపడి మౌనంగా అక్రమాలను చూస్తు కూర్చున్నారని ఫిర్యాదు. తూర్పు గోదావరి జిల్లా కడియంలో ప్రకృతి అందాలకు మారుపేరైన వేమగిరి కొండలనూ చెరువులుగా మార్చారు. పట్టిసీమ కుడిగట్టు కాలువ బండ్ మట్టిని మింగేసి కాల్వ గట్టును బలహీనం చేస్తున్నారు. ఆవ భూములు, మడ అడవులు విధ్వంసం చేశారు.

**విశాఖ మన్యంలో..**

విశాఖ మన్యంలో రూ. 15 వేల కోట్ల విలువైన బాక్సైట్ దోపిడీకి వైవీ సుబ్బారెడ్డి కుట్ర పన్నారని ఆరోపణ. లేటరైట్ ముసుగులో అడ్డగోలుగా తవ్వకాలకు ప్రణాళిక వేశారంటున్నారు. విశాఖ మన్యంలో బాక్సైట్ దోపిడీకి ప్రభుత్వమే రహదారి నిర్మించిందనేది విమర్శ. రికార్డు స్థాయిలో 24 రోజుల వ్యవధిలో అటవీ ప్రాంతంలో 14 కిలోమీటర్ల మేర 30 అడుగుల రోడ్డు నిర్మించి అందర్నీ ఆశ్చర్య పరిచారు. భారీ వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు 10 వేల చెట్లను నరికేశారు. 250 మంది జనాభా ఉన్న మారుమూల ప్రాంతానికి రవాణ సౌకర్యం కోసం ఇదంతా చేశామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరం. ఇందంతా 15 వేల కోట్ల బాక్సైట్ దోపిడీ కోసమే అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

**రుషికొండకు బోడిగుండు**

విశాఖ నగరంలోని చారిత్రక రుషికొండను సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి అడ్డగోలుగా తవ్వేయడంపై ఎన్‌జీటీ మొట్టికాయలు వేసినా వైసీపీ ముఠా రుషికొండను మింగేసింది. ఇక్కడ గతంలో 6 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటక శాఖకు చెందిన రిసార్టులు ఉన్నాయి. అయితే పర్యాటక శాఖ వాటిని కూల్చేసి కొత్తవి నిర్మించేందుకు సిద్ధమైంది. కొండను మొత్తం తవ్వేసి బోడిగుండు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇక్కడ భారీ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసి విపక్షాలు అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. పాత రిసార్టులను కూల్చేసి కొత్తవి ఎందుకు నిర్మిస్తున్నారనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. దీంతో ఫిర్యాదుదారులు కోర్టును ఆశ్రయించారు. పాత రిసార్టులు ఉన్న ఈ కొండ ప్రాంతంలో ఆరు ఎకరాల్లో మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని సుప్రీంకోర్టు పర్యాటక శాఖను ఆదేశించినా 20 ఎకరాలను తవ్వినట్లు ఆరోపణలు వచ్చాయి. అమరావతిని కాదని ఇక్కడే రాజధానిని ఏర్పాటు చేసేందుకు, అందుకు అవసరమైన భవనాల కోసం ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తోంది.

**కర్నూలులో దారుణం..**

కర్నూలు జిల్లా బనగానపల్లి నియోజకవర్గం రవ్వలకొండను సైతం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అక్రమంగా తవ్వుకుని కోట్లు కొల్లకొడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రవ్వలకొండ గుహలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారు 450 ఏళ్ల క్రితం 12 ఏళ్లు తపస్సు చేసి కాలజ్ఞానం రాశారు. అలాంటి పరమ పవిత్రమైన రవ్వలకొండను సైతం వైసీపీ మాఫియా ఇష్టానుసారంగా తవ్వేస్తోందని కర్నూలు జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ నేతలు ఆరోపిస్తున్నారు. బనగానపల్లె మండలం భానుముక్కల



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**

గ్రామంలోని అన్ సర్వేయ్డ్ హిల్ బ్లాక్‌లో ప్రభుత్వ అధీనంలోని 3.002 హెక్టార్లలో ఓ క్వారీ ఉంది. సంబంధిత 3.002 హెక్టార్లతో పాటు ఆనుకుని ఉన్న రవ్వలకొండలోని ఎక్స్‌టెన్షన్ 1.910 హెక్టార్లనూ తవ్వేస్తున్నారు. రవ్వలకొండలోని గుహలకు 500 మీటర్ల దూరంలోపు మైనింగ్ జరప కూడదన్న నిబంధనలను అక్రమార్కులు తుంగలో తొక్కుతున్నారు. భారీగా ఎక్స్‌వేటర్లను మోహరించి ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు.

**పశ్చిమ గోదావరిలో..**

పోలవరం కుడికాలువ ప్రాంతంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా కొత్తూరు రిజర్వు ఫారెస్టు ప్రాంతం, పోలవరం కుడికాలువ ప్రాంతాల్లో కోట్ల విలువైన గ్రావెల్



అక్రమంగా తరలిపోతోంది. కొత్తూరు రిజర్వు ఫారెస్టుతో పాటు చుట్టుపక్కల 750 ఎకరాల్లో సుమారు రూ. వెయ్యి కోట్ల విలువైన గ్రావెల్‌ను తరలిస్తున్నారని హైకోర్టులో పిటిషన్ వేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్‌లోనూ ఫిర్యాదు నమోదైంది. దీనిపై ముగ్గురు సభ్యుల బృందం ఇటీవల రెండు విడతలుగా ఈ ప్రాంతాన్ని పరిశీలించింది.

ప్రతిచోట 10 నుంచి 15 అడుగుల లోతున మట్టిని తవ్వేశారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో అటవీ, రెవిన్యూ, నీటిపారుదల శాఖల భూములున్నాయి. తవ్వకాలు జరపాలంటే ఎన్విరాన్‌మెంట్, పొల్యూషన్, అటవీశాఖ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు కావాలి. ఇవేమీ లేకుండానే మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వేసి మట్టిని తరలించేస్తున్నారు. ఎన్జీటీ బృందం రెండోసారి పర్యటనకు వచ్చినపుడు ఈ మాఫియా రెచ్చిపోయింది. తవ్వకాలు జరిగే ప్రాంతాలకు ఎన్జీటీ బృందం వెళ్లకుండా రోడ్డును అడ్డంగా తవ్వేశారు. ముళ్లకంచెలు అడ్డుపెట్టారు. అయినా కిలోమీటర్ల వరకు అధికారులు కాలినడకన వెళ్లి పరిశీలించారు. దీని వెనక వైసీపీ నాయకత్వం ఉందనేది ఫిర్యాదుదారుల అరోపణ. మంత్రిస్థాయి వ్యక్తులే దీనిని నడిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఇంత జరిగినా ఏ ప్రభుత్వ శాఖ కూడా చర్యలు తీసుకోడానికి ముందుకు రావడం లేదు.

**కృష్ణా జిల్లాలో..**

కృష్ణా జిల్లా కొండపల్లి కొండ రిజర్వ్ ఫారెస్ట్‌ను సైతం వదలలేదు. కొండపల్లి రిజర్వ్ దగ్గర స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ అనుచరులు, బంధువులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ కోట్లు గడిస్తున్నారనేది ఆరోపణ. కొండపల్లి కపిలవాయి సత్రం దేవాలయ భూముల్లోనూ ఎటువంటి అనుమతులు లేకుండా 30 ఎకరాల్లో అక్రమ తవ్వకాలు జరుపుతున్నారట. ఈ అక్రమ గ్రావెల్ తవ్వకాలు పరిశీలించేందుకు వెళ్లినవారిపై వైసీపీ ప్రేరేపిత రౌడీలు దాడులు చేయడం తెలిసిందే. పైగా ఎదురు కేసులు పెట్టారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి షాబాద్‌లో ఇప్పటికే కోట్లు విలువచేసే అక్రమ తవ్వకాలు జరిగాయని సమాచారం.

గుడివాడలో ఎమ్మెల్యే నాని అనుచరులు యథేచ్ఛగా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. చెరువులను పూడ్చి ఆక్రమించుకుంటున్నారని, బెదిరించి స్థలాలు లాగేసుకుంటున్నారని ఫిర్యాదులొచ్చాయి. గుడివాడ మండలం, మోటూరు గ్రామంలో జరిగిన అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించు కోవడం లేదని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. గన్నవరం మండలం చిక్కవరం గ్రామంలోని శ్రీ బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి దేవాలయం, బ్రహ్మ లింగయ్య చెరువు పరిసర ప్రాంతాల్లో గనుల అక్రమ తవ్వకాలు, చిన్న తరహా ఖనిజాలను వెలికితీయడాన్ని అడ్డుకోవాలంటూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలైంది.

**నెల్లూరులో..**

నెల్లూరు జిల్లాలోని పెన్నా నదిలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ నేతృత్వంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. సర్వేపల్లి రిజర్వాయర్‌లో మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అండదండలతో లక్షలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయి. మైనింగ్ మాఫియా వందలాది ప్రొక్లెయిన్లతో గ్రావెల్‌ను, ఇసుకను తవ్వి టిప్పర్‌లలో తరలించుకుపోవడంతో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే సర్వేపల్లి రిజర్వాయర్ భద్రత ప్రమాదంలో పడింది. అంతేకాదు, ఈ జిల్లాలో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో తెల్లరాయి తవ్వకాలను చేపట్టి తరలిస్తున్న అక్రమార్కులను వరికుంటపాడు మండలం ధర్మవరం గ్రామస్తులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**కడపలో..**

జిల్లాలోని చలమారెడ్డి పల్లెలో కొండను పూర్తిగా మాయం చేశారు. మైదుకూరు మండలం శెట్టివారి పల్లె సమీపంలో అతి పెద్ద కొండను నిలువునా తవ్వేస్తున్నారు. వీరపునాయునిపల్లె మండలంలో కొండలను తవ్వేస్తూ మట్టిని కమలాపురం, కడప నగరానికి తరలిస్తున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట సమీపంలోని తెల్లకొండను భారీ యంత్రాలతో అక్రమంగా తవ్వేస్తున్నారు. కడప– రేణిగుంట జాతీయ రహదారికి సమీపంలో గుండ్లూరు కొండను తవ్వేశారు. రాజంపేట మండలం అప్పరాజుపేట పంచాయితీ హత్యరాల సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. రాజంపేట మండలం ఎస్.రాజంపేట జంగాలపల్లెలో మట్టి క్వారీలు నడుస్తున్నాయి.

**అన్ని చోట్ల ఇదే పరిస్థితి..**

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పీర్లకొండను అనుమతులకు మించి తవ్వేశారంటున్నారు. విజయ నగరం నెల్లిమర్లలో పచ్చని కొండలను తవ్వేశారు. గుంటూరు జిల్లా అనుమర్లపూడిలో పెద్దఎత్తున మట్టి దోపిడీ జరుగుతోంది.

**వ్యాసకర్త: చైర్మన్, సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,**
**కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.**

❋ రామాయణంలోని పాత్రలు ❋

# కుశలత కలిగిన కౌసల్య



దశరథుని ముగ్గురు పత్నులలో పెద్దభార్య పట్టపు రాణి కౌసల్య. అయోధ్య నగరానికి మహారాణి. జగదభిరాముడు శ్రీరాముని తల్లి. అయితే, రామచంద్రుడి మాతృమూర్తి మాత్రమే కాదు... పేరుకు తగ్గట్టే కుశలత కలిగిన స్త్రీ. కౌశల్యం ఉన్న స్థితప్రజ్ఞురాలు. సవతి కైకేయికి భర్త ఇచ్చిన వరం మూలంగా తన పుత్రుడు పద్నాలుగేళ్ల పాటు దూరం కావడంతో అంతులేని వేదనను అనుభవించిన మాతృమూర్తి. భర్త నిస్సహాయత, కైకేయి దురాలోచన ఫలితంగా రాముడు వనవాసానికి వెళ్లి తాను శోకసంద్రంలో మునిగిపోయినప్పటికీ తనయుడి పితృవాక్యపరిపాలనా దీక్షకు లోటు రాకూడదన్న సదాశయంతో, సంయమనంతో వ్యవహరించిన తల్లి కౌసల్యాదేవి.

రామాయణ మహాకావ్యాన్ని పరిశీలించి చూస్తే ఆమె ఒక్కో సందర్భంలో ఒక్కోలా కనిపిస్తుంది. కొన్ని సందర్భాలలో సాధారణమైన ఇల్లాలిగా, ఇంకొన్ని సందర్భాలలో సంయమనం ఉన్న పట్టపురాణిగా, ఒక్కోసారి మూర్తీభవించిన పుత్రవాత్సల్యం గల సాధారణ మాతృమూర్తిలా కనిపించినప్పటికీ, అంతలోనే ఎంతో స్థితప్రజ్ఞత, పాండిత్యం, శాస్త్ర విషయాలు తెలిసున్న మహోన్నత స్త్రీగా దర్శనమిస్తుంది.

'నేను నాన్నగారి

ఆధ్యాత్మికం

❋ 'మొక్క'బడి ❋

# సర్వ విషాలను హరించే 'ఈశ్వరి'

ఇది ఒక తీగ జాతి మొక్క. గ్రామీణ ప్రాంతాల్లో, అడవి ప్రాంతంలో ఎక్కువగా ఉంటుంది. ఆంగ్లంలో–ఇండియన్ బర్త్‌వర్ట్, హిందీ – ఈశ్వరమూల్, ఈసర్ మూల్, కన్నడ – ఈశ్వర బెరుస, మలయాళం– కరల్ ఆయం, ఈశ్వరముల్లా, కరలకం, సంస్కృతంలో గరలిక, ఈశ్వరి, తమిళం – కరుటకొట్టి, ఈశ్వరమూలి. లోతట్టు ప్రాంతాలలోని పొదలు, కంచెలలో భారతదేశమంతటా పెరుగుతుంది.



ఎలా గుర్తించాలి?

పొదలాగా ఉండే తీగ అన్ని రుతువులలోను పెరుగుతూ చాలా పొడవుగా దట్టంగా అల్లుకొంటుంది. తీగకు ఎటువంటి ముళ్లు, నూగు లేకుండా నున్నగా ఉంటుంది. ఆకులు మామూలుగా పొట్టిగా ఉండి తీగకు ఇరువైపులా ఒకదాని తరువాత మరొకటి ఉంటాయి. అకు అంచులు వంపులు కలిగి ఉంటాయి. పూవులు తెలుపు ఆకుపచ్చ లేత ఊదారంగులో ఉంటాయి. గరాటా ఆకారంలో, కాయలు కోలగా, షడ్భుజాకారంలో ఉంటాయి. కాయ కింద భాగం నుండి ఆరు గొట్టాలుగా తొడిమ సాగి ఉంటాయి. గింజలు పల్చగా, రెక్కలు కలిగి ఉంటాయి.

ఈ తీగ ఉన్న చోటుకు నాగుపాములు అసలు రావు. నాగుపాము, త్రాచు పాము కాటు వేసిన వారికి ఈ మొక్క ఉపయోగపడుతుంది. కాటుకి గురైన వారికి దీని వేరును అరగదీసి గంధం ఇవ్వాలి. లేదా వారు దీనిని నమిలే స్థితిలో ఉన్నప్పుడు బాగా నమిలి పసరు మింగితే వెంటనే గుణం కనిపిస్తుంది.

కడుపునొప్పితో బాధ పడే పిల్లలకి దీని వేరును నూరి

**దోర్బల పూర్ణిమాస్వాతి**

మాట విని తీరవలసిందే.

ఆయన మాట మేరకు అడవులకు వెళ్లి తీరుతా'నని చెప్పిన రామయ్య మాటలను, ఆ మాటల వెనక కుమారుడి ధర్మనిరతిని, పితృవాక్పాలనను, దృఢనిశ్చయాన్ని అమ్మగా అర్థం చేసుకుంది. తనను తాను స్థిమిత పరచుకుంది. ఎటువంటి పరిస్థితులలోనూ ధర్మం తప్పవద్దని చెప్పి, సీతకు పాతివ్రత్య ధర్మాన్ని బోధించి, ఇరువురినీ ఆలింగనం చేసుకుని వదలలేక వదలలేకనే, వెళ్లిరమ్మంటూ నిండు మనస్సుతో ఆశీర్వదించింది.

పుత్రవియోగాన్ని తట్టుకోలేక మరణించిన దశరథునితో పట్టపురాణిగా సహగమనం చేసేందుకు సిద్ధపడుతుంది. అనంతరం మహర్షుల మాటలతో తెప్పరిల్లి ఎప్పటికైనా తన రాముని అయోధ్యానగరానికి రాజుగా చూసుకోవాలన్న ఆకాంక్షతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటుంది. వైధవ్య దుఃఖాన్ని, పుత్ర వియోగభారాన్ని దిగమింగుకుని, అతి సామాన్య స్త్రీ వలె నిరాడంబరంగా గడుపుతూ పద్నాలుగేళ్లపాటు రాముని కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, తిరిగి శ్రీరామపట్టాభిషేకం అనంతరం కన్నుమూస్తుంది కౌసల్య.

ఒక మహారాజుకు భార్యగా, పట్టపురాణిగా, మర్యాద పురుషోత్తముడిగా పేరుగాంచిన రాముడి తల్లిగా, ఉత్తమ ఇల్లాలైన సీతకు అత్తగారిగా వివిధ రకాల విపత్కర పరిస్థితులలోనూ సంయమనాన్ని పాటించిన కౌసల్య పాత్ర చిరస్మరణీయం. ★

---

నీళ్లతో స్పూన్ మోతాదులో తాగిస్తే వెంటనే గుణం కనిపిస్తుంది. పెద్దలకైనా, పిల్లలకైనా శరీరంపై దద్దుర్లు వస్తే ఈ మొక్కను సమూలంగా తీసుకువచ్చి, నూరి శరీరం మొత్తం పూయాలి, ఇలా మూడురోజులు రాస్తే దద్దుర్లు తగ్గిపోతాయి. దీనిని వాడేటప్పుడు మంచి ఆహారం తీసుకోవాలి.

ఔషధ లక్షణాలు, ఉపయోగాలు

ఈ తీగ వేళ్లు చేదుగా ఉంటాయి. నాలుకకు తగిలిస్తే చురుక్కుమనిపించే గుణముంది. జీర్ణకారి, విరేచనకారి, నొప్పులను తగ్గిస్తుంది. రక్తశుద్ధి చేసి, కడుపులో పురుగులను నాశనం చేస్తోంది. కడుపునొప్పిని తగ్గిస్తుంది. గుండె బలానికి, చర్మంపై మంటల నివారణకు పనిచేస్తుంది. తరచు వచ్చే జబ్బులను నివారిస్తుంది. కురుపులను తగ్గిస్తుంది. కఫ, వాత రోగాలకు, కీళ్ల సంబంధిత వాటికి పనిచేస్తుంది. కుష్టు, బొల్లి, ఇతర చర్మ రోగాలకు దివ్యంగా పనిచేస్తుంది. పేగులలో నులి పురుగులు, గుండె బలహీనత, బహిష్టు నిలిచి పోవడం, అజీర్ణం, పిల్లల పొత్తి కడుపు సంబంధిత వ్యాధులకు, అన్ని రకాల విషపురుగులు, జంతువులు కరిచినా దివ్యంగా పనిచేస్తుంది. వీటి ఆకులను కలరా నివారణకు ఉపయోగిస్తారు. పెద్ద ప్రేవులలోని బాధలకు, చిన్న పిల్లలకు తరచుగా వచ్చే జ్వరాలకు ఉపయోగపడుతుంది. ఆకులను నూరి శరీర మంటలతో బాధపడుతున్న చోట పూసిన వెంటనే ఉపశమనం కలుగుతుంది. విత్తనాలు శరీరమంటలు, పొడి దగ్గు, కాళ్ల నొప్పులు, పిల్లల శ్వాస రోగాలకు పనిచేస్తున్నాయి. మంత్ర, తంత్రశాస్త్రంలో కూడా ఈ మొక్కను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ ఆకు తమలపాకు వాసనలా ఉంటుంది. దానిని బట్టి ఇది ఈశ్వరి మొక్కని గుర్తించవచ్చు. ★


---

❋ తాత్వి'కత' ❋

# పరిపూర్ణమైన సంతోషం

కాళీమాత ఆలయంలో ఓ రోజు ప్రసాదంగా ఇవ్వడానికి లడ్డూలు తయారు చేస్తున్నారు. అయితే ఎక్కడి నుంచి వచ్చాయో తెలీదు.. లడ్డూలకు చీమలు పట్టడం మొదలైంది. లడ్డూలు తయారు చేస్తున్న వారికి ఏం చేయాలో తెలీలేదు. చీమలను చంపకుండా ఎలా?" అని ఆలోచనలో పడ్డారు. వాటిని చంపకుండా ఉండడానికి ఏం చేయాలో చెప్పమని రామకృష్ణ పరమహంసను సలహా అడిగారు.

'చీమలు వస్తున్న దారిలో చక్కెర పొడి చల్లండి. వాటిని తీసుకుని చీమలు వెళ్లిపోతాయి. ఇక ఇటు రావు' ఆయన సూచించారు. పరమహంస చెప్పినట్లే చేశారు. చీమలు ఆ పొడిని చూడటంతోనే నోట కరుచుకుని కాసేపటికల్లా అక్కడి నుంచి వెళ్లిపోవడం మొదలుపెట్టాయి.



సమస్య కొలిక్కి వచ్చింది...

ఈ దృశ్యాన్ని చూసిన పరమహంస "మనుషులూ ఈ చీమల్లాంటివారే. తాము కోరుకున్న వాటిని పొందాలనుకుంటూనే తమకు తెలియకుండానే దానిని మధ్యలోనే విడిచిపెట్టి మరొకటేదైనా దారిలో కనిపిస్తే దానితో సరిపెట్టుకుంటారు తప్ప ముందనుకున్న లక్ష్యాన్ని పట్టించుకోరు..." అని చెప్పారు.

తమకు కావలసింది చక్కెర కాదు లడ్డూ పొడేనని ఒక్క చీమా ముందుకు రాలేదు.

మనం కూడా అలానే 'భగవంతుడు సర్వస్వం' అనుకొనే ధ్యాన సాధన మొదలు పెడతాం. మధ్యలో ఎవరో ఏదో చెపితే దాని వద్దకు వెళ్లి మన సాధన అంతా వృథా చేసుకొంటుంటాం.

తీయగా ఉందన్న చక్కెరతో సరిపెట్టుకుని వెళ్లిపోయాయి చీమలు. రవ్వంత చక్కెర చాలనుకుని సంతోషపడ్డాయి. లడ్డూ అంత పరిపూర్ణమైన సంతోషం పొందాలనుకునే వారు చాలా తక్కువ మందే' అని పరమహంస చెప్పారు.. ★

# వరాహమిహిర



20

ఇదివరలో పారసీక దేశంలో ఉన్నప్పుడే రోమ్ పాలకుల దుర్మార్గులని విన్నాడు వరాహమిహిరుడు. విజ్ఞానశాస్త్ర పఠనంలో మునిగి ఉన్నవానిని చంపడమా?

"ఆ తర్వాత మా తాత ముత్తాతలను అనేక రాజ్యాలకి తీసుకుపోయి బానిసలుగా అమ్మివేసినారు. దాసులుగా జీవించినప్పటికీ మా ఇంట శాస్త్ర బోధన జరుగుతూనే ఉండేది. మా తండ్రిగారే నాకు చదువు చెప్పారు. కొంతకాలం క్రితం జరిగిన వారసత్వ యుద్ధంలో వారూ, సోదరులూ మరణించినారు. నా తల్లి నా చిన్ననాటనే చనిపోయినదట. నేను ఒక ఏకాకిని. క్లియోపాత్రా ఒకప్పటి చెలికత్తెని. ప్రస్తుతం పాంపేయా పరిచారికగా మిగిలాను".

మిహిరుని కంట కన్నీరు తిరిగింది.

"పాంపేయా నన్ను రోమ్ రమ్మంటున్నది. నా పూర్వీకులందరినీ నాశనం చేసినవారి రాజ్యంలో నేను అడుగు పెట్టను. అంతకన్న మరణమే మేలు".


"పాంపేయా ఆశ్రయంలోకి ఎలా వచ్చావు?" అని వరాహమిహిరుడు ప్రశ్నించేలోగానే పాంపేయా, ఆమెకు కాబోయే భర్త వచ్చారు.

మిహిరుడామెతో తన విద్యాభ్యాసం పూర్తయినదనీ, తిరిగి వెళ్లిపోతున్నాననీ చెప్పాడు.

రోమ్ సైన్యాధికారి "త్వరలోనే వెళ్లిపోవడం మంచిది. టోలమీ సైన్యమెప్పుడైన దాడి చేయవచ్చును" అన్నాడు.

* * *

మరునాడు ఉదయమే మిహిరుడు జపతపాలను ముగించుకుని ప్రయాణానికి సన్నద్ధమవుతున్నాడు. చేసికొనవలసినంత ప్రయత్నమేమీ లేదు. నాలుగు జతల బట్టలు, తన రచనకు సంబంధించిన పేపిరస్ కాగితాలు, కొద్దిగా ఆహార పదార్థాలు. ఏ క్షణంలోనైనా శకటం రావచ్చు.



పాలంకి సత్య

ఇంతలోనే వెలుపల శబ్దాలు మిన్నంటాయి. దగ్గరగా జనుల హాహాకారాలు, దూరంగా యుద్ధ సూచనలైన ధ్వనులు వినిపించాయి. ఏం జరుగుతున్నదని అనుకునే లోపుననే సెరిలియస్ వచ్చి "పాంపేయా! టోలమీ తన నావికా దళంతో వచ్చి అలెక్సాండ్రియాను ముట్టడించాడు. సీజర్ తన రోమ్ సైన్యంతో, క్లియోపాత్రా తన అనుయాయులతో టోలమీని ఎదుర్కొంటున్నారు. నేను కూడా యుద్ధానికి వెళుతున్నాను. నీవిక్కడ ఉండడం క్షేమం కాదు. నిన్ను రహస్య స్థావరంలో ఉంచగలను. నాతో రమ్మ"ని అన్నాడు.

పాంపేయా వెంటనే లేచి నిలబడి "హెలీనా, రా" అన్నది.

"నేను రాను" హెలీనా అన్నది.

"నిన్ను ఇక్కడ ఎవరు రక్షిస్తారు?" అడిగింది పాంపేయా.

హెలినా మిహిరుని వద్దకు వెళ్లి అతని చుట్టూ చేతులు వేసి, అతని వక్ష స్థలంపై తల పెట్టుకుని "మీరు నన్ను రక్షించగలరు కదా!" అన్నది.

పాంపేయా ఆమె వైపు తిరస్కార దృష్టితో చూసి నిష్క్రమించింది.


ఈ పరిణామానికి మిహిరుడు నివ్వెరపోయాడు. ఏమిటిది! పరకాంతా స్పర్శయా? ఇట్లయినదేమిటి? దీనికి నిష్కృతి ఏమిటి?

హెలీనా మరింత దగ్గరగా జరిగి "మీరు తప్ప నాకెవరూ లేరు" అన్నది.

మిహిరుడు తనను తాను తమాయించుకుని ఆమె తలపై చేయి వేసి "హెలీనా! భయపడకు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు" అని చెప్పి ఆమె చేతులను తన నుండి వేరు చేసి, కూర్చోపెట్టాడు.



అతనిలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. అలెక్సాండ్రియాలో అడుగు పెట్టినప్పుడే ఇరువురు స్త్రీలు మాత్రమే ఉన్నచోట ఉండేందుకు సందేహించాడు. నాటి తన భయమీనాడు నిజమయిందా? రచనా వ్యాసంగ సమయములో తమ మధ్య సాన్నిహిత్యమేర్పడిన మాట వాస్తవమే. కానీ శాస్త్ర విజ్ఞానానికే పరిమితమయిన స్నేహమది. స్నేహమన్న మాట నిజం. తన ప్రియ మిత్రుడు విక్రమాదిత్యుని ఆలింగనమిచ్చిన



పురుషుడయితే తన శరీర సుఖానికి అనుకూలంగా మార్చుకుని ఉండేవాడు. అతని ప్రయత్నములకు నేనును లొంగిపోయే దాన్నేమో! నా కన్యత్వం కాపాడిన మీకు శతకోటి నమస్కారాలు" అంటూ హెలీనా ప్రణమిల్లింది.

కొంతసేపు మౌనం రాజ్యం చేసింది. ఆపైన మిహిరుడామెతో నెమ్మదిగా "నీవు నా మనసుకు దగ్గరైన మాట నాటి అనుభూతే ఇప్పుడూ కలిగింది. అంతకుమించి ఏమీ లేదు.

అతని ఆలోచనా ప్రవాహాన్ని నిలుపుతూ హెలీనా "దేవతలకే కానీ మానవులకు నమస్కరించరాదన్నది మా గ్రీకు సంప్రదాయం" అన్నది.

"అవును.. పారసీక దేశంలో నా గురువులు చెప్పినారు".

"అయినప్పటికీ నేను మీకు నమస్కరిస్తున్నాను. భయంతో మీ దగ్గరకొచ్చి, మీ చుట్టూ చేతులు వేశాను. కానీ ఆ శరీర సాన్నిహిత్యాన్ని ఇంకొక నిజమే. కానీ నీపట్ల నేను ఆకర్షితుడైనది నీ విజ్ఞాన సంపద వల్లనే. అంతకు మించిన భావమేదీ నాలో ఏనాడూ కలగలేదు. నీవు నాకు ప్రియమైన నెచ్చెలివి. నా అనుంగు మిత్రుడైన విక్రముని సాంగత్యమిచ్చిన ఆనందమే నీ వలన కలిగింది" అన్నాడు.

హెలీనా కృతజ్ఞతాభావంతో అతని వంక చూసి మాట్లాడే లోగానే యుద్ధ ధ్వనులు మరింత ముమ్మరంగా వినిపించసాగాయి. అంతలో "మంటలు, మంటలు" అంటూ కొందరు వారి ఇంట్లో ప్రవేశించారు.

"ఏమైనదీ?" అని మిహిరుడు ప్రశ్నించాడు.

టోలమీ నావికా దళాన్ని ఆపే ప్రయత్నంలో రోమ్ సైనికులు అగ్ని బాణాలు విసిరి ఓడలను అంటించారు. కొన్ని గ్రంథాలయం మీద పడి పుస్తకాలు తగలబడిపోతున్నవి. చుట్టుప్రక్కల ఇళ్లు కూడ అంటుకున్నాయి. ఇళ్లలో వారు పారిపోతున్నారు. పారిపోతున్న వారిలో కొందరు వారి ఇంట ప్రవేశించారు.

మానవ ప్రకృతి విచిత్రమైనది. ఆపత్సమయంలో పలాయితుల మధ్య వాగ్వివాదం ప్రారంభమైంది. గ్రంథాలయం ప్రమాదవశాత్తు అంటుకొనినదని కొందరనగా రోమ్ సైనికులు గ్రీకు విజ్ఞానం మీద అసూయతో అంటించారని మరి కొందరన్నారు. యుద్ధ ధ్వనులను మాటల యుద్ధ ధ్వనులు మించిపోయాయి.

మిహిరుడు నిట్టూర్చాడు. అలెక్సాండ్రియా నగరానికి శోభనిచ్చినవి రెండు. ఒకటి గ్రంథాలయం, రెండవది దీప స్తంభం. ఒకటి తగలబడిపోతున్నది. రెండవదైన మిగులుతుందా? ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు కదా!

మిహిరుని మనసులో ప్రశ్నలుదయించాయి. ఈ యుద్ధం నుండి బయటపడడం ఎలా? భరతభూమికి చేరడం ఎలా? హెలీనాను రక్షించడం ఎలా? ఇంతకూ ఎవరి బారి నుండి ఆమెను రక్షించాలి?

కొంతసేపయిన తర్వాత తమ ఇళ్ల నుండి పారిపోయి వచ్చి తలదాచుకున్నవారు వెళ్లిపోయారు. హెలీనా కొన్ని పళ్లు తెచ్చి మిహిరునికి ఆహారంగా ఇచ్చింది. ఆమె కూడా తిన్న తర్వాత మిహిరుడామె భయకారణం అడిగాడు.

"నేను క్లియోపాత్రా వద్ద పరిచారికగా ఉన్న సంగతిని మీకు ఇదివరలోనే తెలియజేశాను కదా! ఆమె తండ్రి మరణానంతరం క్లియోపాత్రాకూ, ఆమె సోదరుడు టోలమీకీ మధ్య వారసత్వ యుద్ధం జరిగింది. నా తండ్రి, సోదరులు టోలమీకి బానిసలు. అందుచేత అతని పక్షాన్నే యుద్ధం చేశారు. ఆ విషయమై కోపగించిన క్లియోపాత్రా నన్ను ఇంటి నుండి పంపివేసినది. నేను నా తండ్రి వద్దకు పోగా గమనించిన టోలమీ నన్ను గూఢచారిణిగా అనుమానించి చంపబోయాడు. నేను పారిపోయి పాంపేయా ఇంట తలదాచుకున్నాను. యుద్ధంలో నా తండ్రి, అన్నలు మరణించారు. జూలియస్ సీజర్ సోదరీ, సోదరులకు రాజీ కుదిర్చి, వివాహం జరిపించాడు. కానీ నేను పాంపేయా ఇంటనే రహస్య జీవనం గడపవలసి వచ్చింది."

"పాంపేయాకు నీపై ఆ అభిమానమెందుకు?"

"అది అభిమానం కాదు. వ్యయం లేకుండా దొరికిన బానిసను నేను. ఎక్కడ తప్పించుకొని

పోతానోనని ఆమెకు భయం. మీతో మాట్లాడడడం కూడా ఆమెకు ఇష్టం ఉండేది కాదు".

మిహిరుడు ఆలోచించసాగాడు. ఏ పురుషుడో వ్యామోహంతో హెలీనాను పీడిస్తున్నాడనుకున్నాడు కానీ పాలకుల నుంచి రక్షించవలసి వస్తుందనుకోలేదు. ఉత్తమ క్షత్రియులకు సాధ్యమైన పని తన వల్ల అయ్యేనా? కానీ మాట తప్పరాదు.

* * *

వారం గడచింది. పళ్లు, ఇంటిలో కొద్దిగా మిగిలిన పిండితో చేసిన రొట్టెలతో ఆకలి తీర్చుకుంటున్న హెలీనా, మిహిరులకు యుద్ధ ధ్వనులు తగ్గి, విజయోత్సాహపు అరపులు విన్పించాయి. విషయ సమీకరణకై మిహిరుడు హెలీనా వారిస్తున్నా వీధిలోనికి వెళ్లాడు. అతని వస్త్రధారణ వల్లనో, సాత్విక ముఖకవళిక వల్లనో కానీ ఎవరూ ఆపలేదు. కొంత సేపటికి జనుల సంభాషణను బట్టి టోలమీ జయించాడనీ, క్లియోపాత్రా, సీజర్లను బంధించాడనీ తెలిసింది.

కొంత ప్రశాంత వాతావరణ మేర్పడింది. కాబట్టి తాను తిరిగి పోవచ్చునేమో! హెలీనా సంగతి ఏమిటి?

విషయం విన్న హెలీనా తాను వరాహమిహిరుని తోనే పయనిస్తాననీ, తనను ఈజిప్టు దాటించమని కోరింది.

"ఆపైన ఏం చేస్తావు? ఎక్కడ ఉంటావు?"

"జ్యూస్ దేవుడే దిక్కు".

మిహిరునికి ఏమి తోచలేదు. ఆనాటి రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. ఆమె కోరిక సమంజసమేనా, సాధ్యమేనా?

* * *

మరునాడు ఉదయమే వారి ఇంటి ముందు రథమాగింది. హెలీనా భయంతో లోపలకు వెళ్లి దాక్కున్నది. మిహిరుడు రథసారథిని గుర్తుపట్టినాడు. శకట చోదకుడు "బాబిలాను నగరంలో దింపమన్నారు కదా! నేడు కొంత ప్రశాంతంగా ఉంది. అలెక్సాండ్రియాను వదిలిన వెనుక భయపడే పని లేదు. మీరు కాలినడకన నైలు నదీ తీరం చేరుకోండి. అక్కడనుంచి నా రథంలో రావచ్చును" అన్నాడు.

వరాహమిహిరుడు హెలీనాతో బాబిలాను నగరం చేరే సరికే యుద్ధ వార్తలు అక్కడికి చేరాయి. అలెక్సాండరు వలె విశ్వ విజేత కావలెనన్న కోరిక సీజర్‌కు ఉన్నదన్న వార్త విశ్వవిఖ్యాతమే. ఏనాడు యుద్ధమేఘాలు కమ్ముతాయోనన్న భయంతో ప్రజలున్నారు. వరాహమిహిరునికి రథం దొరకలేదు. కొంత దూరం నడచి పారసీక రాజ్యంలో ప్రవేశించిన తరువాత సులభంగా పయనించవచ్చును. హెలీనా తాను కూడా నడవగలననీ, ఈజిప్టు నుండి వీలైనంత దూరంలో తనను దింపమని కోరింది.



"నాతో పాటు ఒక యువతిని తీసికొని వెళ్లాలి" అని మిహిరుడు హెలీనాను పిలిచాడు.

రథసారథి కనుగిలుపు కానీ, పరిహాస సహిత మందహాసం కానీ వరాహమిహిరునికి నచ్చలేదు. కానీ అతడు వేరే ఊహ కలిగి ఉంటేనే మేలేమో!

నైలునదీ తీరంలో ఎక్కడ వేచి ఉండాలో నిర్ణయమైన తర్వాత రథ చోదకుడు వెళ్లిపోయాడు.

* * *

టోలమీ అలెక్సాండ్రియా నగరాన్ని ముట్టడిస్తున్న సంగతి తెలిసినప్పుడే సీజర్ తనకు మరికొంత సైన్యం పంపమని రోమ్ నగరానికి వార్త పంపించాడు. ఆ సైన్యం టోలమీతో యుద్ధానికి సిద్ధమై వచ్చింది. సీజర్ కారాగారం నుంచి తప్పించుకుని, మిగిలిన సేనతో టోలమీని ఎదుర్కొన్నాడు. రోమ్ నుంచి వచ్చిన సేన, సీజర్ సేనల మధ్య అడకత్తెరలో పోక చెక్కలా నలిగిన టోలమీ తప్పించుకుని పారిపోతూ, నైలునదిలో పడి మరణించాడు. అతని తమ్ముడైన ఇంకొక టోలమీకీ, క్లియోపాత్రాకూ రాజ్యాధికారమిచ్చి, సీజర్ ప్రేమ రాజ్యమేలుతూ ఉండిపోయాడు.

* * *

వరాహమిహిరుడు హెలీనాతో బాబిలాను నగరం చేరే సరికే యుద్ధ వార్తలు అక్కడికి చేరాయి. అలెక్సాండరు వలె విశ్వ విజేత కావలెనన్న కోరిక సీజర్‌కు ఉన్నదన్న వార్త విశ్వవిఖ్యాతమే. ఏనాడు యుద్ధమేఘాలు కమ్ముతాయోనన్న భయంతో ప్రజలున్నారు. వరాహమిహిరునికి రథం దొరకలేదు. కొంత దూరం నడచి పారసీక రాజ్యంలో ప్రవేశించిన తరువాత సులభంగా పయనించవచ్చును. హెలీనా తాను కూడా నడవగలననీ, ఈజిప్టు నుండి వీలైనంత దూరంలో తనను దింపమని కోరింది.

"అదేమిమాట, హెలీనా"

"ఆలోచించిన కొలదీ నాకు సైతం ఈ అనార్య సంస్కృతిపై విముఖత కలుగుతున్నది. మీరు రామాయణ గాథను చెప్పినారు. ప్రజా సంక్షేమం కోసం శ్రీరాముడు ప్రియ సతిని పరిత్యజించాడు. ఆయన మరియొక వివాహం మాట తలపెట్టలేదు. ఆమె ఇంకొకరిని వరించలేదు. సీజర్, పాంపేయాలను చూడండి. ఇటువంటివే ఎన్నో ఉదంతాలున్నాయి. మీకు ట్రాయ్‌కి చెందిన హెలెన్ కథ చెప్పనా?

"ఇప్పుడు కథలు వద్దు, పారసీకులు భారతీయుల వంటి వారే. నీకు అక్కడ వసతి కల్పించే ప్రయత్నం చేయగలను".

* * *

కొంతదూరం కాలినడకనా, మరికొంత దూరం బండి మీద ప్రయాణం చేసిన హెలీనా, మిహిరులు పారసీక రాజధానిని చేరుకున్నారు. హెలీనాను ఒక వసతి గృహంలో ఉంచి, వరాహమిహిరుడు తన గ్రీకు ఖగోళశాస్త్ర గురువు వద్దకు వెళ్లాడు. ఆచార్యులు సంతోషించి మిహిరుని గురించిన సమాచార మడిగారు. అలెక్సాండ్రియాలో గ్రీకు, రోమన్ జ్యోతిష శాస్త్రాలు అభ్యసించిన సంగతినీ, పంచ సిద్ధాంతికను రచించిన విషయం తెలిపిన మిహిరుడు "గురువర్యా, గ్రీకు సిద్ధాంతం మీ పేరనే పాలిశ సిద్ధాంతమని వెలయించాను" అన్నాడు.

"నేను నీకు నేర్పినది బహు స్వల్పం."

"ఆచార్య! మీ నుండి ఒక సహాయం కోరి వచ్చాను" అన్న వరాహమిహిరుడు హెలీనా విషయం చెప్పి ఆమెకు వసతి ఏ విధంగా కల్పించాలో చెప్పమని అడిగాడు.

అంతా విన్న ఆచార్యుడామెను తన వద్దకు తీసికొనిరమ్మన్నాడు. తన ఇంటికి వచ్చిన హెలీనాతో మాట్లాడి ఆమె సౌశీల్యానికీ, విజ్ఞానానికీ సంతృప్తి చెంది ఆమె తన ఇంటనే తన పుత్రిక వలెనే ఉండ వచ్చునన్నాడు. మిహిరుని నుండి ధనం స్వీకరించేందుకు ఆయన ఇష్టపడలేదు. హెలీనాకు కొంత సొమ్ము ఇచ్చిన మిహిరుడు "ఈ నగరంలోనే నా మామగారు, బావమరుదులు నివసిస్తారు. నేను త్వరలోనే ఇక్కడకు రాగలను" అని ఆమెను ఓదార్చి, రాజ దర్శనానికి వెళ్లాడు.

పారసీక రాజు మిహిరుని చూసి, చాలా సంతోషించి "వరాహమిహిరాచార్యా, మీరు మా భాషలో రచించిన పంచతంత్రం పెద్దలనూ, పిన్నలనూ అలరిస్తున్నది. అందులోని రాజనీతిని నేర్చుకున్న పక్షంలో మా రాజ్యాన్ని ఎవరూ జయించలేరు" అని గౌరవ సత్కారాలు నిర్వహించాడు.

పారసీక రాజ రథంలో, సకల రాజ లాంఛనాలతో మిహిరుడు ఉజ్జయినీ నగరానికి చేరుకుని, తన ఇంటిలో ప్రవేశించిన వెంటనే జననీజనకులకు ప్రణమిల్లాడు. ఆపైన మామగారికి నమస్కరించి, ఖనాను ప్రీతి పూర్వకంగా పలకరించాడు.

ఆ వెనువెంటనే గోత్ర ప్రవరలు చెప్పి, తన పాదములను నమస్కరించిన కుమారుని చూసి పొంగిపోయిన వరాహమిహిరుని చూసి ఖనా చిరునవ్వు నవ్వింది.

(ముగింపు వచ్చేవారం)

# హరిహరతత్త్వం

**జ్ఞాపకాలన్నీ ఒకటి కాదు. కొన్ని జ్ఞాపకాలు ఉంటాయి, వాటితో మాట్లాడుతూ ఉండాలని తరువాతి తరాలు తపించేటట్టు ఉండేవి. తుమ్మలపల్లి హరిహరశర్మ జ్ఞాపకాలు ఇలాంటివి. ఎందుకు అన్నారో మరి, ఆయన పుట్టినప్పుడు ఒక స్వాముల వారొచ్చి హరిహర అని పేరు పెట్టమన్నారట. అంటే విష్ణువు, శివుడు ఒకచోటే ఉంటారు. ఆ ఇద్దరు పురాణ పురుషుల మధ్య అభేదాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నమొకటి జరుగుతున్న కాలమది. అంతే, ఆ పేరులోని తత్త్వంతో ఆ జీవితం పెనవేసుకుంది. హరిహరశర్మగారి జీవితాన్ని పరిశీలిస్తే జ్ఞానమూ ఆయనే, జ్ఞానాన్వేషీ ఆయనే అనిపిస్తుంది. రాం మోహన్ కండ్లకుంట వెలువరించిన 'సిద్ధాంతంతో నడుస్తూ.. సిద్ధాంతం వైపు నడిపించిన... "ఓ తపస్వీ" గ్రంథం హరిహరశర్మ నిండైన, నిబద్ధతతో కూడిన జీవితం నుంచి సేకరించిన జ్ఞాపకాల సంకలనమే.**

న్యాయవ్యవస్థలో పనిచేస్తూ, తనను చేయి పట్టుకు నడిపించిన తండ్రి జ్వాలాపతి మూడోఏటనే కన్నుమూశారు. ఆస్తి దాయాదుల పాలై చిన్న పశువుల పాకను నివాసంగా మార్చుకున్నారు. తల్లి మహాలక్ష్మమ్మ దిద్దించిన ఓనమాలు జీవితాన్ని నడిపాయి. కూరలేని అన్నాన్ని పంచదార పలుకులతో తిన్న రోజులు. ఇంటర్ తరువాత ఎవరో ఉచితంగా ఇచ్చిన పుస్తకాలతో బీఏ ఇంగ్లిష్ సాహిత్యం చదివి బంగారు పతకం సాధించుకున్నారు. తరువాత ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో ఎమ్మే చేసి, టాపర్‌గా నిలిచారు. మంచి మంచి కళాశాలల్లో అధ్యాపకులయ్యారు. అప్పటిదాకా ఆర్ఎస్ఎస్ ఆయనను నడిపించింది. తరువాత సంస్థ అఖిల భారత విద్యార్థి పరిషత్ నిర్మాణం పనిని అప్పగించింది. 'శర్మగారికి 9 యేళ్ల వయసున్నప్పుడే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో పరిచయం. అది శర్మగారి 79 సంవత్సరాల జీవితానికి బాటలు వేస్తుందని, తత్ఫలితంగా వారు కొన్నివేల లక్షల మంది జీవితాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదుగుతారని ఆ రోజు వారికి కూడా తెలిసి ఉండదు.' కానీ ఇది చరిత్రగా నమోదైంది. భారతదేశంలో చాలా విద్యా సంస్థలను ఎర్ర దుమ్ము నుంచి కాపాడిన ఘనత ఏబీవీపీదే.

విద్యార్థి ఉద్యమాలలో జాతీయ భావాల స్థానాన్ని సరైన సమయంలో గుర్తించడంలో ఏబీవీపీ విజయవంతమైంది. ఆ విజయం వెనుక ఉన్నవారు హరిహరశర్మ వంటివారే. ఆయనకు అండాదండా ఎస్వీ శేషగిరిరావు, గౌరీశంకర్ (ఏబీవీపీ త్రిమూర్తులు). ఒక మార్పునకు ఉద్యమం శరీరమైతే, దానికి ఆత్మ జాతీయత అయినప్పుడు ఫలితాలు వేరుగా ఉంటాయి. 1994లో కాకతీయ విశ్వ విద్యాలయం పేరును కాస్తా కారల్‌మార్క్స్ విశ్వవిద్యాలయంగా మార్చాలని నక్సల్స్ కుట్ర పన్నుతున్నారని ఒక చర్చలో ఆందోళన వ్యక్తమైంది.



**సిద్ధాంతంతో నడుస్తూ...**
**సిద్ధాంతం వైపు నడిపించిన**
**ఓ తపస్వి**

**రచన:** రాంమోహన్ కండ్లకుంట
**ప్రతులకు:** సాహిత్య నికేతన్, 'కేశవనిలయం' బర్కత్‌పుర, హైదరాబాద్
సాహిత్య నికేతన్, ఏలూరు రోడ్, విజయవాడ.
**పేజీలు:** 136, **వెల:** రూ.100/-

దీనికి క్షణంలోనే శర్మ పరిష్కారం చూపారు. ఆ ప్రాంతాన్ని అద్భుతంగా పాలించిన కాకతీయుల సాంస్కృతిక, చారిత్రక చిహ్నాలు (తోరణం, కాకతి రుద్రమ ప్రతిమ) ప్రతిష్టించాలని చెప్పారు. ఆ సూచనకు విద్యార్థి పరిషత్ సభ్యులు ఆకృతి ఇచ్చారు. నిజంగానే నక్సల్స్ హింస వేడిలో ఆ పేరే పెట్టి ఉంటే! కమ్యూనిజం అనేది ప్రపంచంలో ఒక అంటరాని సిద్ధాంతంగా మారిన ఈ కాలంలో దానిని తలుచు కుంటే శర్మ తీసుకున్న నిర్ణయంలోని గొప్పతనం తెలుస్తుంది. నిజానికి జిల్లాకొక విశ్వవిద్యాయం వస్తుందని ఆయన ఆనాడే చెప్పారు. ఇది ఆయన దూరదృష్టికి నిదర్శనం. ఏబీవీపీ మీద దాడులు ఎన్నో, సంస్థ కోల్పోయిన వీరులు ఎందరో! వాటికి శర్మగారు ఎలా స్పందించారు? ఆ ఉద్విగ్నతలు, ఉద్రేకాలను సమన్వయం చేసి సంస్థను నిలబెట్టడంలో ఎలా పాటు పడ్డారో, ఎంత మథనపడ్డారో ఇందులో ఎన్నో ఉదంతాలను ఆయన అనుభవాల రూపంలో చదవవచ్చు. ఆఖరికి వారి అర్ధాంగి 'ఏమయ్యా...! సార్‌ను ఉంచుతారా? చంపేస్తారా? అని కార్యకర్తలను అడగవలసి వచ్చింది. ఆ ఆవేదనను అర్థం చేసుకోవలసిందే. నక్సల్ హింసకు వ్యతిరేకంగా డిసెంబర్ 14,1983 హైదరాబాద్‌లో ఏబీవీపీ నిర్వహించిన భారీ ప్రదర్శన, ఆపై రెండు వారాలకే కొండపల్లి సీతారామయ్య జైలు నుంచి తప్పించుకున్న నేపథ్యంలో ఏబీవీపీ కార్యకర్తల మీద పెరిగిన దాడులు సంస్థ సిద్ధాంతకర్త ప్రాణం గురించి ఆందోళన కలిగించక మానవు. ఈ బైఠక్‌లో ఉన్నవారు వచ్చే బైఠక్ నాటికి ఉంటారా లేదా అన్న ప్రశ్న మెదళ్లను కాల్చిన కాలం. కాబట్టి శర్మగారి అర్ధాంగి ప్రశ్నను అర్థం చేసుకోవాలి. ఆ కాలంలో కూడా ఆయన ఏబీవీపీ కార్యకర్తలను కాపాడు కుంటూనే కర్తవ్యోన్ముఖులను కూడా చేశారు. ఇదెలా సాధ్యం! ఆయన 'గృహస్తే.. కానీ మానసికంగా ప్రచారక్'.

ఇక ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో తెలుగు ప్రాంతాల ఏబీవీపీ కార్యకర్తలలో వచ్చిన మీమాంసలను కూడా శర్మ నిర్మాణాత్మక దృక్పథంతో నివృత్తి చేశారు.

ఆయన ఒక అవిశ్రాంత పథికుడు. ఒక పక్క విద్యార్థి ఉద్యమ నిర్మాణం. మరొక పక్క జాగృతి, సాందీపని, శంకరకృప వంటి పత్రికలకు రచనలు, విద్యారంగ గమనాన్ని పరిశీలించే సునిశిత బాధ్యత అహరహం నిర్వర్తించేవారు. శంకరకృప సంపాదకత్వం, సాందీపనిలో క్రీడాశీర్షక నిర్వహణ ఒక్క చేతి మీదుగానే సాగాయంటే నమ్మడానికి కొంచెం సమయం తీసుకున్నా, ఈ విన్యాసాన్ని అలవోకగా సాగించిన ఆ అమృతహస్తం శర్మగారిదే. యాభయ్ ఏళ్లు కలసి నడిచిన శర్మగారికి తాను ఇవ్వగలిగే స్మృత్యంజలి కేవలం 'నిశ్శబ్దం' అన్నారు ఆచార్య ఎస్వీ శేషగిరిరావు. కానీ ఆ నిశ్శబ్దంలో జాతీయతా భావాలను ఘోషించే నయాగారాలనూ, మాతృదేశ సేవను వినిపించే విస్ఫోటనాలనూ వినవచ్చు. అందుకే ఆయన జ్ఞాపకాల నిండా అవే ప్రతిధ్వనిస్తాయి. వినండి మరి! ★

'సిద్ధాంతంతో నడుస్తూ.. సిద్ధాంతం వైపు నడిపించిన... "ఓ తపస్వి" గ్రంథ ఆవిష్కరణ సభలో హరిహరశర్మకు దత్తాత్రేయ హోసబలె నివాళి.

# ఆయనొక గొప్ప

హరిహరశర్మగారి గురించి మనందరికి తెలిసినప్పటికీ కొత్త తరంవారికి నేరుగా వారి గురించి తెలియకపోవచ్చు. 136 పేజీల ఈ పుస్తకంతో వారి లోతైన వ్యక్తిత్వం గురించి కొన్ని అంశాలు దర్శించ వచ్చు. పరిపూర్ణంగా చెప్పలేం. అయితే ఈ పుస్తకం శర్మగారి గురించే కాక, ఆర్‌ఎస్‌ఎస్. ద్వారా ప్రేరణ పొంది వివిధ క్షేత్రాలలో పనిచేస్తున్న ముఖ్య కార్యకర్తలకు చెప్పాల్సిన అనేక విషయాలు ఉన్నాయి. వీరి వ్యక్తిత్వం వెనుక గౌరీశంకర్, రంగయ్య, నర్సయ్య, యశ్వంతరావు కేల్కర్, ఓంప్రకాశ్ వంటి వారున్నారు. ఏబీవీపీ విద్యారంగంలో పనిచేస్తూ దేశమంతా విస్తరించిన గొప్ప సంస్థ. ఇది విస్తరించడానికి పనిచేసిన అనేకమంది కార్యకర్తల మాలలో ఒకానొక సుగంధభరిత పుష్పమే హరిహర శర్మ. భారతమాత చరణాల వద్ద తన జీవితాన్ని సమర్పించి ధన్యుడయ్యాడు. వారితో పనిచేసే భాగ్యం మాకు కలిగినందుకు మా జీవితం కూడా ధన్యమైంది. శర్మ వంటి తపస్వి మార్గ దర్శనంలో సమాజం కోసం పనిచేసే అవకాశం లభించడం మాకు భగవంతుడిచ్చిన గొప్ప బహుమతిగా భావిస్తున్నాం.

శర్మగారి గురించి అనేకమంది పొందిన అనుభవాలు ఈ పుస్తకంలో పొందుపరిచారు. ప్రొఫెసర్ శేషగిరిరావు, వీరూమిత్రులు. శర్మగారు జీవితంలో మాతృభూమి అభ్యున్నతి తప్ప మరొక విషయానికి స్థానం కల్పించలేదని, వారి ఆలోచనలో సదా కేంద్ర బిందువు భారతమాతేనని అన్నారు. ఆ సభలో నేను ఉన్నాను. అదే విషయాన్ని ఈ పుస్తకంలో ప్రస్తావించారు. తేరా వైభవ్ సదా రహే మా హమ్ దిన్ చార్ రహే న రహే (మేము నాలుగు దినములు బతికినా చాలు. అమ్మా! నీ వైభవం ఎల్లప్పుడూ అమరమై ఉండుగాక!) అనేది సంఘ పాటలో ఒక పంక్తి. భారతవైభవం కోసం నా జీవితం సమర్పితమని సంఘ కార్యకర్తలం చెప్పుకుంటాం. అయితే ఇది ఎందుకు? అమరత్వం సిద్ధింప చేయవల్సింది భారతమాత వైభవానికే. నేను ఈ రోజు ఉండవచ్చు, రేపు ఉండకపోవచ్చు, మన భాగ్యం ఎంతవరకు రాసిపెట్టుంటే అంతవరకు జీవిస్తాం. అయితే భారతమాత వైభవం కోసం ఎందుకు పనిచేయాలి? స్వయంసేవక్‌గా శర్మ సంఘం ఏం చెప్పిందో దానిని జీవితాంతం తాదాత్మ్యంతో చేశారు. కార్యకర్త నుండి సంఘానుకూల జీవనాన్ని సంఘం ఆశిస్తోంది. తనువు, ధనాన్నే కాదు జీవితాన్ని సమర్పించే కార్యకర్తల మాలికలో శర్మగారికి ఒక ప్రముఖ స్థానం ఉంది. 1980లో వారు ప్రభుత్వ ఉద్యోగంలో బోధనా సిబ్బందిగా చేరి మంచి జీతం సంపాదిస్తున్నారు. ఆ సమయంలో సంఘ ఆజ్ఞానుసారం ఉద్యోగాన్ని వదిలి హైదరాబాద్‌కు వచ్చి విజయనగర కాలేజీ ఆఫ్ కామర్స్‌లో చేరారు. ఆ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న సమయంలో 2 సంవత్సరాలపాటు టెక్నికల్ కారణాలవల్ల జీతం రాలేదు. అయినప్పటికీ కాలేజీకి వెళ్లి తన విధిని నిర్వహిస్తూనే వచ్చారు. వారిని హైదరాబాద్‌కు పిలిపించింది జీతం లేకుండా పని చేయడానికి కాదు. కాని వారికి జీతం రాకపోయినా తనకు కళాశాలలో అప్పగించిన ప్రిన్సిపల్ బాధ్యతను నిర్వహిస్తూనే ఏబీవీపీ కార్యాన్ని కూడా సంపూర్ణంగా చేస్తూ వచ్చారు. వీరిది మధ్యతరగతి కుటుంబం కావడం వలన జీతం లేకుండా అనేక నెలలపాటు గడపడం కష్టమని గ్రహించారు ప్రొ. శేషగిరిరావు. సెక్రటేరియట్‌లో ఫైలు కదలడం లేదు. ఈ సమయంలో సంబంధిత వివరాలు ఇచ్చినట్లయితే బీజేపీ ఎమ్మెల్యేల ద్వారా ప్రయత్నం చేస్తానని శేషగిరిరావు సూచించారు. వివరాలు ఇవ్వకుండా అంతా ఈశ్వరేచ్ఛ అనేశారు. అలా ఎందుకు ఆలోచించారో మరి. భారతమాత వైభవం కోసం చేస్తున్న ఈ పని న్యాయం, ధర్మమార్గాల ద్వారా నిస్వార్థంగా చేస్తున్నట్లయితే ఈ రోజు కాకుంటే రేపు ఈశ్వరుడు చూసుకుంటాడు అని అన్నారు. అలాంటి ఆధ్యాత్మిక భావన, ఈశ్వరుని పట్ల విశ్వాసం, శ్రద్ధా అనేవి కార్యకర్తను వికసింపచేసి, ఆంతరంగికంగా బలాన్ని కలిగిస్తాయి.

కళాశాల పనైనా, ఏబీవీపీ పనైనా, జీవితంలో ఏదైనా సమస్యలు ఎదుర్కోవలసి వచ్చినప్పుడైనా వజ్రంవలె కఠినంగా వ్యవహరించేవారు. కార్యకర్తల ఇంటి పరిస్థితి గురించి ఆలోచించినప్పుడు ఎంతో సంవేదనతో, మృదువుగా వ్యవహరించేవారు. అందుకే వారు తపస్వి. తాను సిద్ధాంతంతో నడుస్తూ, సిద్ధాంతంవైపు కార్యకర్తలను నడిపించిన మహాను భావుడు. సిద్ధాంతం చెప్పడానికి కాదు, అలాగే పుస్తకంలో రాసుకోవడానికి కాదు, వేదికపై నుండి ఉపన్యాసం ఇవ్వడానికి కాదు. సిద్ధాంతానికి అనుకూలంగా జీవించవలసి ఉంటుంది. కార్యకర్తగా శపథం చేయడం చాలా సులభం. కానీ దానిని ఆచరించడం కష్టం. ప్రతీ రక్తపు బొట్టు అర్పిస్తూ జీవితాంతం ప్రకాశాన్నిస్తూ సాగడం కోసం సాధన చేయవలసి ఉంటుంది. ఇదంతా చేస్తున్నప్పుడు నేనూ అంత పనిచేశాను. ఇంత పనిచేశాను. అతనికి ఫలానా లభించింది. అతనికన్నా ఎక్కువ త్యాగం చేశాను. నాకు ఏమీ లభించలేదు. ఇలా




## 'ఓ తపస్వి' ఆవిష్కరణ

సామాజిక కార్యకర్త హరిహరశర్మ జీవిత విశేషాలు, ఏబీవీపీతో ఆయన అనుబంధం, జ్ఞాపకాలపై సీనియర్ జర్నలిస్ట్ రామ్మోహన్ కంద్లకుంట 'ఓ తపస్వి' అనే పుస్తకాన్ని రచించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 27న ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ కళాశాలలో జరిగింది.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ సర్ కార్యవాహ దత్తాత్రేయ హొసబలె హాజరై ప్రసంగించారు. హరిహరశర్మ కుమార్తె తుమ్మలపల్లి శైలజ, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు డా. జానారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సి. హెచ్. ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఏబీవీపీ పూర్వ, ప్రస్తుత కార్యకర్తలతో పాటు ఇతరులూ పెద్దఎత్తున తరలివచ్చారు. ★

# పరంపర

ఆలోచించడం మొదలుపెడతారు కొందరు. నాకు ఈ పదవి కావాలి. ఆ పదవి కావాలి అనే వ్యాపార ధోరణి ప్రబలుతుంది. నేను ఇంత పెట్టుబడి పెడితే ఆ మేరకు లాభమైతే పొందాలి కదా అనుకుంటారు. ఒక సత్య సిద్ధాంతంపై నిలబడిన స్వయంసేవక్, కార్యకర్త తన సమయం వెచ్చిస్తూ చేస్తున్న సమర్పణ వ్యాపారం కాదు. తనువు, మనస్సు, ధనాన్ని సమర్పించి అమ్మా! నీ వైభవాన్ని ఎల్లప్పుడూ నిలిచేటట్లు చేస్తాననే మాటలు వినసొంపుగా ఉంటాయి. ఇలాంటి వాటిని లేశమాత్రంగా కూడా తన మనస్సులో స్థానం కల్పించకుండా జీవించిన శర్మగారు మనకు ఉదాహరణగా నిలుస్తారు.

నీళ్లలాగ కార్యకర్త ఉండాలి అని చెబుతుంటాం. అంటే నీళ్లు ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర రూపం దాల్చాలి అని అర్థం. ఆ విధంగానే కార్యకర్త ఏ క్షేత్రంలోకి పంపబడితే ఆ క్షేత్రానికి అనుగుణంగా తనకు తాను రూపుదిద్దుకొని పనిచేయాలి. శర్మగారు వందశాతం ఆ విధంగా పనిచేశారు. ఏబీవీపీ రాష్ట్ర బాధ్యను మోస్తూనే మరొకవైపు జర్నలిజం కోసం రచనా కాలేజీని ప్రారంభించారు.

శర్మగారు ఇన్ని పనులను ఏలా చేయగలిగారు? అందరిలాగానే భగవంతుడు వీరికి కూడా 24 గంటలే ఇచ్చాడు. వీరు ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు, వీరిది ఇంగ్లీష్ సబ్జెక్ట్ అయినప్పటికీ ఎవరైనా లెక్చరర్ రాకపోతే సంబంధిత సబ్జెక్ట్‌ను ఆ తరగతి విద్యార్థులకు చెప్పేవారు. ఒక కార్యకర్తగా గృహస్థాశ్రమాన్ని కొనసాగిస్తూ, ఇన్ని రకాల పనులు స్వీకరించి అన్నింటికీ న్యాయం చేయడమే కాదు, అన్ని పనులను సఫలం చేయడం అంత సులభం కాదు. ఇది సాధించి చూపించారు శర్మగారు. ఇప్పుడు తెలుగు ప్రాంతాలలో పరిస్థితులు కొంతవరకు మారి ఉండవచ్చు, నక్సలైటు, మావోవాది ఉద్యమాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నప్పుడు వీరు, శేషగిరిరావు, మనోహర్‌రావు, రంగయ్య, నర్సయ్య, మురళీమనోహర్‌లు విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉద్యోగంలో ఉంటూ ఏబివిపి కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇస్తూ సమస్యలను పరిష్కరించే పనిలో నిమగ్నమై ఉండే వారు. దీనికి ధైర్యం కావాలి. ఆదర్శంతో ఎప్పుడైతే తాదాత్మ్యం చెందుతాడో అలాంటి కార్యకర్త ఇలాంటి క్లిష్ట సమయంలో కార్యాన్ని ముందుకు తీసుకెళ్లగలడు.

కార్యకర్తలు తెలుగు ప్రాంతాలలో, తమిళనాడు, కేరళ, అస్సాం లాంటి చోట పనిచేస్తూ దేశ సరిహద్దులను కాపాడే సైనికులను తలపింపచేశారు. సరిహద్దులను కాపాడే సైన్యం ముందర ఈ దేశ భూభాగంలో ప్రతి అంగుళాన్ని రక్షించాలనే ఏకైక లక్ష్యం ఉంటుంది. అవతల శత్రువులు ఉంటారు. తుపాకీ పట్టుకొని కాపాల కాస్తున్నప్పుడు తన బుల్లెట్‌తో అవతలి శత్రువు చస్తాడా లేక అతడి బుల్లెట్ తగిలి నేను మరణిస్తానా తెలియని స్థితి. ఇక్కడ ఏబీవీపీ వ్యతిరేక వర్గంవైపు బుల్లెట్లు ఉన్నాయి. మనకు ఎటువంటి ఆయుధాలు లేవు. అయితే ఒకే ఒక ఆయుధం మాత్రం ఉంది. అదే ధైర్యం. అలాంటి వారిని వికసింపచేసి సైనికులులాగా తయారుచేసే పనిని తీవ్రమైన అభిరుచితో దీప జ్వాలవలే నిరంతరం వెలిగే పనిని శర్మ వంటి వారు చేశారు. ఈ పని కోసమే తపించి తపించి పనిచేశారు. కనుక వారు తపస్వి. ఏ పనినైనా కుశలతతో భగవంతునికి అర్పించి చేస్తుంటే అదే యోగం అని భగవద్గీతలో చెప్పినట్లుగా అన్నిరకాల పనులను కౌశల్యంతో చేసిన యోగ సాధకుడు శర్మ. ప్రతి కార్యకర్త ఈ పుస్తకాన్ని చదివి ప్రేరణ పొందాలి. దానివల్ల ఇప్పటివరకు విస్తరించిన సంస్థ పని వెనుక ఇలాంటి పెద్దలు ఏ విధంగా కష్టించి పనిచేశారో అవగాహన కలుగుతుంది. శర్మగారు నేడు మన మధ్యలో లేరు. 2017వ సంవత్సరంలో స్వర్గస్తుల య్యారు. 5 సంవత్సరాల తరువాత వారి గురించి పుస్తకం వచ్చింది. చాలామంది తాము మరణించాక పుస్తకం వేస్తారో లేదో అని తాము జీవించి ఉండగానే స్పాన్సర్ చేసి తమ గురించి పుస్తకం ముద్రించుకుంటారు. అయితే శర్మగారి గురించి వచ్చిన ఈ పుస్తకం అలాంటిది కాదు. వీరితో కలిసి పనిచేసిన అనేక మంది కార్యకర్తలకు వారి నుండి కలిగిన అనుభవాల సారాంశమే ఈ పుస్తకం.

ప్రసిద్ధ ఆంగ్లకవి షేక్స్పియర్ తాను రాసిన 156 పద్యాలలో (సానెట్స్) ఒక వ్యక్తికి అమరత్వం రెండు రకాలుగా ప్రాప్తిస్తుందని వివరించారు. ఒకటి తమ వంశవృద్ధి ద్వారా, రెండవది సాహిత్యంలో తన పేరు రావడం ద్వారా. కానీ భారతీయ సంస్కృతి మరొక రకంగా వ్యాఖ్యానించింది.

*న ప్రజయ న కర్మణ న ధనేన*
*త్యాగేనైక అమృతత్వ మానశుః*

ఒక వ్యక్తికి అమరత్వం అతని వంశ వృద్ధి ద్వారా గానీ, అతను చేసిన పనుల వల్లగానీ లేదా ధనం వల్లగానీ ప్రాప్తించదు. త్యాగం ద్వారా మాత్రమే అమరత్వం లభిస్తుంది అనేది భారతీయ సిద్ధాంతం. ఈ విధంగా జీవించిన బుద్ధభగవానుని, వివేకానందుని, రాజా హరిశ్చంద్రుని వంటివారిని మన సమాజం గుర్తుపెట్టుకుంటుంది. ఇక్కడ కూడా పుస్తకంలో శర్మగారి పేరు శాశ్వతం కాదు, వారి త్యాగమే శాశ్వతం. శర్మాజీ ఎప్పుడూ ఇచ్చేదే నేర్చుకున్నారు. తన ప్రతిభను త్యాగం చేశారు. సావర్కర్ లాయర్. వారి లాయర్ డిగ్రీ కూడా ఆంగ్ల ప్రభుత్వం లాక్కున్నది. తిరిగి ఇవ్వలేదు. కాలాపాని (అండమాన్ జైల్)లో గడిపారు. ఆ విధంగా తన ప్రతిభ, ప్రతిష్ఠ, పురస్కారాలను సర్వస్వం భారతమాత చరణాలవద్ద సమర్పించిన ధన్యజీవి సావర్కర్. శర్మగారి రక్తం గ్రూప్ '0' పాజిటివ్. అంటే వారిది యూనివర్సల్ డోనర్ గ్రూపు. దానికి తగ్గట్టుగానే సమాజానికి ఇస్తూనే వారు జీవించారు. తన ప్రతిభను, రచనను, ఉపన్యాసాన్ని ఇలా అనేక రకాల వ్యక్తిగత విషయాలను సమాజానికి సమర్పించారే తప్ప తిరిగి నాకు ఏమి వస్తుందని ఆలోచించలేదు. ఇలాంటి దీపస్తంభంగా, నందా దీపంగా నిలిచిన శర్మలాంటి అనేకమంది కార్యకర్తలు తన రక్తాన్ని, చమటను ఒక్కొక్క బొట్టున సంఘము అనే చెట్టు మూలాలకు సమర్పించటం ద్వారా ఆ చెట్టు మహావృక్షమై అనేకమందికి ఫలాలనిస్తూ, వందలాది ప్రాణులకు నీడనిస్తూ, వేలాది పక్షులకు ఆశ్రయమిచ్చే స్థాయికి ఎదగాలని ఆశించారు. తపస్వి అయిన శర్మగారిని నిమిత్తం చేసుకొని సంఘకార్య పరంపరకు చెందిన వారిని స్మరించుకుంటూ, కార్యకర్త పరంపర, కార్యకర్త ప్రక్రియ, కార్యకర్త ఆదర్శం, ఆధునిక కాలంలో ఈ దేశంలో ఆర్ఎస్ఎస్, దాని ప్రేరణతో నడుస్తున్న వివిధ క్షేత్రాలలోని కార్యకర్తలకు శ్రేష్ఠమైన ఉదాహరణను, ఆదర్శాన్ని , పద్ధతిని వికసింపచేసిన గొప్ప పరంపరంకు నేను ప్రణమిల్లుతున్నాను. మరొకసారి శర్మగారికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. వీరి జీవితం మనకు ఎల్లప్పుడు ప్రేరణ కలిగించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ★



నీళ్లలాగ కార్యకర్త ఉండాలి అని చెబుతుంటాం. అంటే నీళ్లు ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర రూపం దాల్చాలి అని అర్థం. ఆ విధంగానే కార్యకర్త ఏ క్షేత్రంలోకి పంపబడితే ఆ క్షేత్రానికి అనుగుణంగా తనకు తాను రూపుదిద్దుకొని పనిచేయాలి. శర్మగారు వందశాతం ఆ విధంగా పనిచేశారు.

కలం కన్నా కత్తి గొప్పది. ఆ కత్తికి ఎదురునిలిచే స్వరం ఇంకా పదును. గొంతులో హెచ్చుతగ్గులు ఉన్నట్లే, అభిప్రాయ తారతమ్యాలూ సహజంగానే వ్యక్తమవుతుంటాయి. ప్రధానంగా ప్రసార, ప్రచార, సమాచార రంగాల్లోని గళాలూ, కళాలూ సూటిదనానికి, ధాటితత్వానికి ఉదాహరణలు. వార్తలు చెప్పినా / రాసినా, వ్యాఖ్యానాలు చేసినా / వినిపించినా, విమర్శల విశ్లేషణల హోరు కొనసాగించినా మూలాధారమంటూ ఒకటి ఉండనే ఉంటుంది. జనహితమే అభిమతమైనప్పుడు, సామాజిక ప్రయోజనమే అంతిమ లక్ష్యంగా స్పష్టమైనప్పుడు అదురూ బెదురూ ఇంకెందుకు? నిజాయతీ నిబద్ధతలే స్వభావాలుగా ఉన్న ఒక గళ యోధురాలు ఆ విధంగానే వ్యవహరించారు. తనవైన అనుభవాలను, అభిప్రాయాలను సంఘ స్థితిగతులకు సమన్వయించి ఓ బాధ్యతతో ప్రవర్తించారు. అందునా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భాన వెలువడిందా వనితావాణి. తనకు నచ్చిన, తాను మెచ్చిన ప్రజా కార్యక్రమంలో ఆమె భాగస్వామ్యం కావడం సర్వసాధారణమే. అందులో వింతా విశేషం ఏమీ లేవు. ఉండాల్సిన అగత్యమూ లేదు. ఆ సీనియర్ జర్నలిస్టు పనిచేస్తున్న న్యూస్ ఛానెల్ మాత్రం – ఏదో నేరం జరిగినట్లు భావించింది, ఎంతో ఘోరం చోటు చేసుకుందని చలించిపోయింది.



# తలొంచని 'మలయా'

ఊరికే ఊరుకుంటే ఊరా, పేరా? యాజమాన్యమంటే మాటలా! కంటగింపు పెచ్చు పెరిగిన దర్పం. అసలే మందమైన తన జూలును పదేపదే విదిల్చింది. అంతటి విదిలింపు, అదలింపుల పర్యవసానంగానే ఆ పాత్రికేయురాలి మీద సస్పెన్షన్ వేటు పడింది. అదీ చాలదన్నట్లు ద్రోహబుద్ధినీ ఆమెకు అంటగట్టి, వరస వేధింపులకు తెరతీసిందా పెత్తందారీ తత్వం? వీటన్నింటి విజృంభణతో, కేరళలో మరీ ముఖ్యంగా వృత్తి జర్నలిజం మీద అణచివేత పతాకస్థాయికి చేరినట్లయింది. అదేమని ఎవరైనా నిలదీస్తే 'అవునా? మేమా? చర్య తీసుకున్నామా? అదే నిజమైతే... తప్పనిసరి కాబట్టే తీసుకున్నట్లున్నాం' అని ఆ భారతీయత వ్యతిరేక వర్గం చెబుతుంది. ఆగ్రహించిన జర్నలిస్టు సంఘాలు, జనజాగృత సంస్థలు మరింతగా నిరసన భేరి మోగించడంతో ఆ రాష్ట్రంలో ఏమైందంటే...

ఒక్క సిరాచుక్క లక్షలాది మెదళ్లకు కదలిక. నీతి నిండిన ఒక్క మాటైనా నోటినుంచి దూసుకొస్తే, ఆ పటిమకు ఎదురేలేదిక. కేరళ జర్నలిస్టు సుజయ పార్వతికి మొదటి నుంచే శషభిషలు నచ్చవు. మొహమాటం వంటి అలవాట్లు ఏనాడూ లేవు. విధి నిర్వహణ ఒక్కటే తనకు తెలుసు. తన పనీ తాను అన్నట్లు ఒద్దికగా ఉండే ఆమెను ఇంటాబయటా అందరూ ఎంతో ఆదరణగా 'డాలీ' అని పిలుస్తుంటారు. నాలుగు పదులు వయసుదాటిన ఆ మహిళామణి స్వస్థలం కొచ్చి. ప్రజాసంబంధాల రంగంలో పోస్టుగ్రాడ్యుయేట్. తల్లిదండ్రులకు ఏకైక సంతానం. తాను కర్తవ్యం నిర్వహించే / నిర్వహించిన సంస్థకు సమ ప్రాధాన్యం. అది ఇరవై నాలుగు గంటలూ (రోజంతా) వార్తల ప్రసార వ్యవస్థ. అక్కడి సంపాదక బృందంలోనే తనది కీలక భూమిక. విశ్లేషణలు రాసినా, చేసినా, వ్యక్తీకరించినా తనదే ప్రశస్థ పాత్ర. విధి నిర్వహణలో ఎవరి నుంచీ మాట పడరు. అనవసరంగా ఎవరినీ ఏ మాటా అనరు. విధేయత ఉంటుందే కానీ– వ్యక్తిగతంగా కాదు, సంస్థాపరంగా. అటువంటి

# కలం... నిలయ

మనస్తత్వమున్న ఆమె వనితా దినోత్సవాన భారతీయ మజ్దూర్ సంఘ్ ఏర్పాటుచేసిన సదస్సుకు వెళ్లి మాట్లాడారు. జాతీయ అంశాలను ప్రస్తావిస్తూ, అందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పాలన రీతిని మెచ్చుకున్నారు. ఈ మెచ్చుకోలులో వాస్తవిక పరిశీలనే తప్ప, మరి ఏ విధమైన ఇతర ప్రమేయమూ లేదని, ఉండదని అందరికీ తెలుసు. తెలియంది, తెలుసుకోవాలని అనుకోనిదీ తాను పనిచేస్తున్న వార్తా సంస్థ మాత్రమే! అందునా కార్యనిర్వహణ అధికారం చలాయించే వ్యక్తికి జాతీయత అంటే పడదు, భారతీయత అనే పదమే నచ్చదు. ఉద్యోగం నుంచి సస్పెన్షన్ పేరిట ఆమెపైన ఆయుధ ప్రయోగం చేశాడు. అదే అతగాడి మెడకు చుట్టుకుంది.

**చెక్కు చెదరని ధీరత**

నిబద్ధురాలి పిడికిలి బిగిసింది. 'ప్రజలకు మేలుచేసే అంశాన్ని నేను మాట్లాడకూడదా' అని అనిష్టుల్ని నిలదీశారామె. బానిసత్వం కాదు కావాల్సింది, ప్రతి ఒక్కరు భావవ్యక్తీకరణ శక్తినే కోరుకోవాలంటూ పిలుపునిచ్చారు. సుజయ పార్వతికి ఎందరెందరో మద్దతు పలికి అండ నిలవడంతో, అనిష్టులు దిగివచ్చారు. ఆ మేర ఆమె తిరిగి ఉద్యోగబాధ్యతలు స్వీకరించి 24 గంటలైనా కాకుండానే రాజీనామా చేసేశారు! 'ఉద్యమ ఉత్తేజం పెల్లుబికిన వేళ, నా వెంట నిలిచిన సహృదయులందరికీ అభివాదం' అని ప్రకటించారు. ఎంతో ఉద్యమిస్తేనే ఇంత మధుర విజయం లభించిందని ఆ పడతి ఆనందంలో కృతనిశ్చయం, ఆత్మవిశ్వాసం జోడుగా ప్రతిఫలించాయి. కాషాయం అంటేనే కాళ్లు వణికేవారికి దడ, గడబిడ గుండెల దాకా పాకేలా చేసింది తన ధీరోదాత్తత. ఉపాధి, ఉద్యోగం అనేవి అన్ని విధాలా ఎదగనివ్వాలి. మంచిచెడులను ఎంచి చూసే వివేచనను పెంచాలి. అలా కానప్పుడు తనదైన పంథా తనకు ఎప్పుడూ ఉంటుందని నిరూపించారామె. ఈ నిరూపణ మరెవరి పొగడ్తకోసమో కాదు, తను పుట్టి పెరిగి ఎదుగుతున్న సమాజం పట్ల కృతజ్ఞత కోసం. అందువల్లనే తన పేరు ఒక్క కేరళలోనే కాదు, దేశమంతటా ఇప్పుడు ఇంకా మారుమోగుతోంది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఉంటున్న మలయాళీలతో పాటు ఇతర ప్రాంతీయ భాషలవారికీ తానిప్పుడు ఆదర్శ నాయిక.

**అన్నిటికీ ఒక్కటే సమాధానం**

ప్రాంతాలతో పాటే దేశీయ, అంతర్జాతీయ సమాచార సాధనాలన్నీ సుజయ పార్వతివైపే చూపుసారించాయి. ఎంత బాగా రాస్తారో అంతే ధాటిగా మాట్లాడే ఆమె ప్రత్యేకించి మూడు ప్రశ్నల్ని మీడియా యాజమాన్యాల ముందు ఉంచుతున్నారు. అవి:

1. ప్రభావం చూపే రంగాల్లోనివారు, ప్రధానంగా గళం/ కలం వీరులు వాటిని సర్వకాల సర్వావస్థల్లోనూ యాజమాన్యాల ఎదుట ఉంచి మోకరిల్లుతూ ఉండాలా?

2. విద్యాభ్యాసాన్ని తిరువనంతపురంలో కొనసాగించిన వ్యక్తి ఆమె. ఆంగ్లభాష, సాహిత్య అంశాల పట్టభద్రురాలు, మీడియా స్టడీస్‌లో కేరళ వర్సిటీకి తలమానికంగా నిలిచినవారు. రిపోర్టర్ / వ్యాఖ్యాత / విశ్లేషకురాలిగా అనేకచోట్ల చక్కని గుర్తింపు, గౌరవం అందుకున్న దక్షురాలు. ప్రయాణాలు చేయాలన్నా, చూసిన వాటిని పౌరులందరితో వివరాలు పంచుకోవాలన్నా ఎనలేని మక్కువ. దేశ రాజధాని నగరంలోనూ మునుపు కొన్నేళ్లు రిపోర్టింగ్ బ్యూరో చీఫ్‌గా పని చేసిన వారు. ఇంతటి విశేష నేపథ్యమున్న సుజయ ఒక అంతర్జాతీయ దినోత్సవ సమావేశంలో మాట్లాడటం అనేది ఏకంగా ఉద్యోగం నుంచే సస్పెండ్ చేసేటంత నేరమా? రాజకీయాలతో అంటకాగుతున్న ఛానెళ్ల యాజమాన్యాలు తమ సంస్థల్లోకి ఎవరిని కోరుకుంటున్నాయి. వివేచన శీలత గలవారినా, పైవాళ్లు ఏది చెబితేదాన్ని తలాడిస్తూ పాటించినట్లు కనిపించే మరమనుషులనా?

3. పొట్టకూటికోసమే అయితే, చేసేందుకు వ్యాపారాలూ, ఉద్యోగాలూ చాలా ఉన్నాయి. తన ఆలోచన, పని ఇతరులకు ఉపకరించాలనే వారికి జర్నలిజం మాత్రమే ఆధారప్రాయం. అంతటి విశిష్ట రంగంలో పనిచేస్తూ, సమయాన్నీ శక్తినీ జీవితమంతటినీ అంకితం చేసే జర్నలిస్టులకు యాజమాన్యాలిచ్చే నజరానాలూ సస్పెన్షన్లూ తొలగింపులేనా?




**జంధ్యాల శరత్‌బాబు**

సీనియర్ జర్నలిస్ట్


**నిబద్ధతతో ఘన సాధన**

వీటికి వరస సమాధానాలను ఆచరణ రూపంలో ఇచ్చిన ఘనత సుజయ పార్వతిది. ఆమె ఇప్పుడు, ఇకముందు కూడా కొనసాగేది వార్తా ఛానెళ్లలోనే. కొత్తగా ఎందులో చేరినా, తనదైన వృత్తిగత అనుభవాన్ని ఏ సంస్థకు పంచి ఇవ్వాలనుకున్నా నిర్ణయం ఆమెదే. భావాలు అనుభవాలను బట్టి ఎప్పుడూ గళానికీ, కలానికీ స్వతంత్రనే కోరు కుంటున్నారు. ఉద్యోగాలు మారడమన్నది జర్నలిస్టులకు పరిపాటి. సంస్థలు మారవచ్చేమో కానీ, స్వతంత్రతా భావాలైతే మారవు. ఆ స్వతంత్ర స్వభావం భారతీయతతో ముడిపడి ఉంటే, అంతకుమించి దేశానికి కావాల్సిందీ ఇంకేం ఉంటుంది? ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు మన జీవితాల్లో భాగాలు. వాటిని కాదని, కూడదని దర్పం చూపించడమే యాజమాన్య అధికారమైతే, ఏ జర్నలిస్టూ తలొగ్గారు. సుజయ పార్వతి వంటి అభిమానధనులు కొందరైనా నేడు మనముందు ఉంటున్నారు. వికృత పోకడల నియంతృత్వాన్ని పాఠక/వీక్షక జన అండదండలతో నిలువరిస్తున్నారు. ప్రసార సమాచార సాధనాల నిర్వహణ రంగంలో ఉంటూనే సహచర జర్నలిస్టులపైన నానారకాల సతాయింపులకు దిగేవాళ్లకి సుజయ ఆత్మవిశ్వాస తేజం నిరంతర చెంప పెట్టు. స్ఫూర్తి ఇచ్చేవారు, తెచ్చేవారు ఇంకెక్కడో ఉండరు.. మనలోనే మనతోనే మన మధ్యనే ఉండి విజయగీతిక ఆలాపిస్తారు. నిదర్శనం సుజయ పార్వతి. ఆ ధీరతకే జాతీయవాదుల, దేశాభిమానుల అభివాద హారతి. ★


నిబద్ధురాలి పిడికిలి బిగిసింది. 'ప్రజలకు మేలుచేసే అంశాన్ని నేను మాట్లాడ కూడదా' అని అనిష్టుల్ని నిలదీశారామె. బానిసత్వం కాదు కావాల్సింది, ప్రతి ఒక్కరు భావ వ్యక్తీకరణ శక్తినే కోరుకోవాలంటూ పిలుపునిచ్చారు. సుజయ పార్వతికి ఎందరెందరో మద్దతు పలికి అండ నిలవడంతో, అనిష్టులు దిగివచ్చారు. ఆమేర ఆమె తిరిగి ఉద్యోగబాధ్యతలు స్వీకరించి 24 గంటలైనా కాకుండానే రాజీనామా చేసేశారు! 'ఉద్యమ ఉత్తేజం పెల్లుబికిన వేళ, నా వెంట నిలిచిన సహృదయు లందరికీ అభివాదం' అని ప్రకటించారు.

# 'సాహిత్యం దేశభక్తిని పెంపొందించాలి!'






సాహిత్యం ద్వారా సమాజంలో నైతిక, మానవీయ విలువలను పెంచాలని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సుశీల్‌చంద్ర త్రివేది (లక్నో) అన్నారు. సాహితీ సమితి స్వర్ణోత్సవాల సందర్భంగా జాతీయ సాహిత్య పరిషత్ 19వ ప్రాంత మహాసభలు ఏప్రిల్ 30న వికారాబాద్‌లో జరిగాయి. ఈ సందర్భంగా త్రివేది మాట్లాడుతూ రచనల ద్వారా దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించాలని సూచించారు. దేశ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడే రచనలు చేయాలని కోరారు. జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు, చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యే విధంగా రచనలు చేయాలన్నారు.

'భారతీయ సాహిత్యం వక్రీకరణ–వాస్తవాలు' అన్న అంశంపై డాక్టర్ పి. భాస్కరయోగి, సూర్య నారాయణమూర్తి ప్రసంగించారు. మాతృభాషలో విద్యాబోధన చేయాలని, పిల్లల్లో దేశభక్తి నిర్మాణం చేసే పాఠ్యాంశాలు ఉండాలని, సాహిత్యం ద్వారా, సంస్కృతి ద్వారా ఏకాత్మ భావన నిర్మాణం కావాలని, భారతదేశ వాస్తవ చరిత్ర నిర్మాణాన్ని చేయాలని సమావేశంలో తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో ముళ్లపూడి జాతీయ సాహిత్య పురస్కారం, ఓలేటి సాంస్కృతిక సాహిత్య పురస్కారం, వెంకట్రావు పంతులు ధార్మిక సాహిత్య పురస్కారాలను 11 మంది రచయితలకు అందజేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన రచయితలు వారు రచించిన 15 పుస్తకాలను ఆవిష్కరించారు.

అఖిల భారతీయ సాహిత్య పరిషత్ సంయుక్త కార్యదర్శి డా. పవన్‌పుత్ర బాదల్, జాతీయ సాహిత్య పరిషత్ ప్రధాన కార్యదర్శి వడ్లూరి ఆంజనేయరాజు, డాక్టర్ మసన చెన్నప్ప, విజయ గోపాల్, లక్ష్మీనాథాచార్యులు, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్, సాహితీ సమితి సంఘటన అధ్యక్షుడు వీరకాంతం, కార్యదర్శి జి.కృష్ణాగౌడ్, సి.రాములు, సాంబశివశర్మ, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. రచయితలు, కవులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

# కర్నూలులో ఆరోగ్య భారతి ఉచిత వైద్యశిబిరం

కర్నూలు జిల్లా కేంద్రంలోని వివేకానంద బాల విద్యామందిర్, ఎస్‌వీఎస్ ప్రైమరీ స్కూల్‌లో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఏప్రిల్ 29న ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు.




ఈ శిబిరంలో 48 మందిని పరీక్షించి ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదం–న్యూఢిల్లీ అందించిన ఇమ్యునో బూస్టర్స్‌గా పిలిచే 'బాలరక్ష' ఔషధాల కిట్స్‌ను అవసరమైన విద్యార్థులకు ఆరోగ్య భారతి తరపున అందజేశారు. ఆరోగ్య అవగాహనలో భాగంగా వడదెబ్బ తగులకుండా ఉండేందుకు శరీరానికి సరిపడా నీరు, మజ్జిగ, నిమ్మ రసం, చెరకు రసం, తాటిముంజలు వంటివి తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఇంటివైద్యం గురించి వివరించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యాన్ని కూడా తెలియ జేశారు. ఈ కార్య క్రమంలో సీనియర్ వైద్యాధికారి (ఆయు ర్వేదం), ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ద్వారం పభాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానా చార్యులు టి. కల్యాణ్ కుమార్, ఎస్‌వీఎస్ ప్రైమరీ స్కూల్ ప్రధానాచార్యులు ఎస్‌వీఎస్ ప్రకాష్, ఆరోగ్య భారతి నగర కార్యదర్శి కుంపటి కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ★

**ఈ సంవత్సరం ఏప్రిల్ 21న కర్ణాటక రాష్ట్రంలో సెకెండ్ పీయూసీ పరీక్షా ఫలితాలు వెలువడినాయి. ఆ ఫలితాలలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న కొద్దిమంది విద్యార్థులలో తబస్సుమ్ షేక్ ఒకరు. మొత్తం 600 మార్కులకు గాను ఆమె 593 మార్కులు సాధించింది. అంతేకాదు, ఆర్ట్స్ విభాగంలో ఆమే రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. సైకాలజీ, సోషియాలజీ, హిందీ పరీక్షలలో ఆమెకు నూటికి నూరు మార్కులు వచ్చాయి. ఈ విజయం గురించి విలేకరులు వెళ్లి అడిగినప్పుడు ఆమె చాలా మాటలు చెప్పింది. అందులో ఒకటి మాత్రం అందరినీ ఆకర్షిస్తుంది. అది- 'నేను హిజాబ్ కంటే చదువు ముఖ్యమని అనుకున్నాను.'**



తల్లితండ్రులతో తబస్సుమ్

# చదువు.. హిజాబ్.. తబస్సుమ్

తబస్సుమ్ షేక్, నిరుడు కర్ణాటకలో చెలరేగిన హిజాబ్ గొడవలో మొదట ఈ విద్యార్థిని కూడా ఉంది. తరువాత విజ్ఞతతో, ఈ నేలనీ, ఇక్కడి చట్టాలను మన్నించి, పరీక్షలు రాసింది. బెంగళూరు నగరంలోని నాగరత్నమ్మ మేడా కస్తూరిరంగశెట్టి రాష్ట్రీయ విద్యాలయంలో చదువుకుంది.

జనవరి 2022న కర్ణాటక ప్రభుత్వం హిజాబ్ ధారణను విద్యా సంస్థలలో నిషేధించింది. కొన్ని నెలల పాటు కర్ణాటక రాష్ట్రాన్నీ, దేశంలోని ఇంకొన్ని ప్రాంతాలనీ హిజాబ్ వివాదం చికాకు పరచింది. గడచిన ఏడాది కర్ణాటక హైకోర్టు కీలకమైన తీర్పు ఇచ్చింది. విద్యాసంస్థలలో హిజాబ్ లేదా బుర్ఖా వంటి మత పరమైన వస్త్రధారణతో ప్రవేశించరాదు, అక్కడ అమలు పరుస్తున్న ఏకరూప దుస్తులతోనే చదువుకు వెళ్లాలి అన్నదే ఆ తీర్పు సారాంశం. ఇది కోర్టు నిర్ణయమే అయినప్పటికీ చాలామంది మతోన్మాదులు దీనికి వ్యతిరేకంగా, అదేదో హిందూ సంస్థల, బీజేపీ ప్రభుత్వాల నిర్ణయమన్నట్టు రోడ్డెక్కి అలజడి సృష్టించే ప్రయత్నం చేశాయి. అయినా తీర్పును ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు గట్టిగా అమలు చేశాయి. దీనితో హిజాబ్, స్కల్ క్యాప్ ధరించడమే ప్రధానమని భావించిన ఎందరో ముస్లిం విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలను బహిష్కరించారు. అంటే చదువు కంటే మత చిహ్నాలే ముఖ్యమని భావించారని చెప్పాలి. అలాంటి ఒక క్లిష్ట వాతావరణంలో ఆమె మతోన్మాదుల హెచ్చరికలను పక్కన పెట్టి తనకు చదువు ముఖ్యమని నిర్ణయించుకుంది. రాష్ట్రం ఆందోళనలతో అట్టుడుకుతున్నట్టు ఉడుకుతున్నా ఆమె పట్టించుకోలేదు. అలా అని ఆమె మతాచారాన్ని విడిచిపెట్ట లేదు. "కళాశాల వరకు హిజాబ్ ధారణ సంగతి మరచిపోవాలనే నిర్ణయించుకున్నాను. చదువును కొనసాగించాలని అనుకున్నాను. చదువు కోసం మనం కొన్ని త్యాగాలు చేయాలి" అని ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రికకు చెప్పింది తబస్సుమ్.

నిజానికి తబస్సుమ్ కోర్టు తీర్పు వచ్చే వరకు హిజాబ్‌తోనే తరగతులకు హాజరైంది. తరువాత హిజాబ్ సంగతి పట్టించుకోలేదు. ఆపై కళాశాల నియమాలనూ, కోర్టు నిర్ణయాలను గౌరవించదలిచానని ఆమె చెప్పింది. కన్నవారు కూడా ఆమె నిర్ణయాన్ని మనసారా స్వాగతించారు. ఆమె తండ్రి అబ్దుల్ ఖువామ్ షేక్ కూడా విశాల దృక్పథంతో ఆలోచించారు. 'ఈ మట్టినీ, ఇక్కడి చట్టాన్ని గౌరవించాలి. పిల్లలకి చదువు ఎంతో ముఖ్యం' అని చెప్పారు. ఆమె కళాశాల వరకు హిజాబ్‌తోనే వెళ్లేది. అక్కడ దానిని తీసివేసి తరగతులకు హాజరయ్యేది. ఇంతకీ ఇంత విజయం సాధించిన తరువాత కళాశాల ప్రిన్సిపాల్‌ను కలుసుకోవడానికి వెళ్లినప్పుడు ఆమె హిజాబ్‌తోనే వెళ్లింది. ఎవరూ అభ్యంతరం చెప్పలేదు.

నిరుడు జనవరి మొదటివారం నుంచి కర్ణాటకలో హిజాబ్ వివాదం చెలరేగింది. హిజాబ్ ధరించిన వచ్చిన ఎనిమిది మంది బాలికలను ఉడిపీ కళాశాల యాజమాన్యం అనుమతించకపోవడంతో ఈ రగడ ఆరంభమైందని చెప్పవచ్చు. హిజాబ్ కళాశాల ఏకరూప దుస్తులలో భాగం కాదు కాబట్టి తాను అనుమతించడం లేదని వివరణ ఇచ్చింది. నిజానికి ఈ హిజాబ్ ధారణ ముందునుంచీ ఉన్నది కాదు. హఠాత్తుగా కొన్ని శక్తులు ఆ బాలికలను ఆ విధంగా ప్రేరేపించాయి. ఇది తరువాత రుజువయింది. కానీ ఆ ముస్లిం బాలికలు పట్టిన పట్టు విడవబోమని హఠం చేశారు. తరువాత హిజాబ్‌తోనే తమను తరగతులకు అనుమతించేటట్టు ఆదేశించవలసిందిగా హైకోర్టును ఆశ్రయించారు. హిజాబ్ ధారణ తమ ప్రాథమిక హక్కని వారి వాదన. ఈ హక్కును రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 25 ఇచ్చాయని కూడా వాదించారు.

ఈ వివాదం అనతికాలంలోనే విద్యార్థుల మధ్య మత రగడకు దారి తీసింది. హిందువులు మెడలలో కాషాయ కండువాలను ధరించి రావడం ఆరంభించారు. హిజాబ్‌లతో వచ్చే బాలికలకు నిరసన తెలియ చేయడం కూడా మొదలయింది. ఈ అల్లర్లు క్రమంగా ఉడిపి నుంచి శివమొగ్గ, బాగల్‌కోట్ వంటి ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. రాళ్లు రువ్వు కోవడం, విధ్వంసం, హింసాత్మక ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. హిజాబ్ గొడవకు బీజం వేసినది కేంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అనే విద్యార్థి సంఘం. ఈ సంస్థ సంపర్కంలో వెళ్లిన తరువాతే అప్పటివరకు లేని హిజాబ్ అలవాటును బాలికలు ప్రారంభించారు. కేంపస్ ఫ్రంట్ అంటే పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా విద్యార్థి విభాగమే. హిజాబ్‌ను ధరించమని వాళ్లు చెబితేనే ఆరంభించామని తరువాత బాలికలు కూడా అంగీకరించారు.

తబస్సుమ్ చదువు వైపు మొగ్గడం హక్కు అనే పరిధి నుంచి జరగలేదు. పరిస్థితులను బట్టి జరిగింది. హిజాబ్ నిషేధం అనేది ఆమెను చదువా లేదా మత చిహ్నమా ఏది? అన్న ఎంపిక వైపు నెట్టింది. ఆమె చదువునే ఎంపిక చేసుకుంది. ఇందులో మతపరమైన త్యాగం కూడా ఉంది. అది హిజాబ్‌ను వదిలివేయడం. అలా అని ఆమె ఇరాన్ మహిళల వలె హిజాబ్‌ను గాలిలోకి విసిరి పారేయ లేదు. కళాశాల వరకు హిజాబ్‌తోనే వెళ్లి, ద్వారం దగ్గర దానిని తీసివేసి తరగతులకు వెళ్లింది. చదువు కాదు హిజాబ్ ప్రధానమని అనుకున్న చాలామంది విద్యార్థినులు, స్కల్‌క్యాప్‌ల బాలురు ప్రభుత్వ సంస్థలను విడిచి ప్రైవేటు సంస్థలలో చేరితే సమస్య ఉండదని అనుకున్నారు. కానీ పీయూసీ పరీక్షలు మాత్రం ప్రభుత్వ కళాశాలలోనే రాయవలసి ఉంటుంది. అక్కడ హిజాబ్‌ను నిషేధించారు. దీనితో చాలామంది పరీక్షలకు హాజరు కాలేదు. ★





# సహనం నశిస్తే తిరుగుబాటు అనివార్యం


రామానందతీర్థ

**సహనానికీ ఒక హద్దు ఉంటుందని అంటారు. సహనం నశిస్తే తిరుగుబాటు అనివార్యం. అలాంటప్పుడు ఎంతటి శాంతమూర్తులకైనా ఆగ్రహం కలుగుతుందనేందుకు గాంధీజీ స్పందనే ఉదాహరణ. స్వామి రామానందతీర్థ, హైదరాబాద్‌లో నిజాం పరిపాలన తీరును, ప్రజల ఇక్కట్లను గాంధీజీకి వివరించినప్పుడు, 'రజాకారులను చూసి పిరికి వారుగా పారిపోవడం కంటే ఆయుధాలు తీసుకు పోరాడండి. అన్ని సమస్యలకు సత్యాగ్రహమే పరిష్కారం కాదు. అవసరమైతే ఆయుధాలు ధరించండి, రక్షించుకోండి. వీరులుగా మిగలండి'అని గాంధీజీ కూడా ఉద్బోధించారు.**

నిజాం పాలనలో తెలంగాణ జిల్లాల్లో ప్రజలు 'నీ బాంచను దొర (నీ బానిసను). నీ కాలు మొక్కుతా దొర' అని అన్న తరువాతే విషయం చెప్పాలి. ఇది అక్కడ సర్వ సాధారణం. గ్రామాల్లో వివిధ వృత్తుల వారు 'వెట్టిచాకిరీ' చేసే పరిస్థితులు నెలకొన్నాయి. దొరల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు గ్రామంలోని ఇతర కులాలవారు ఉచితంగా సంభారాలు సమకూర్చడం వంటివి జరిగేవి. గ్రామానికి వచ్చే అధికారులకు విందులు వినోదాలకు ధాన్యం, మాంసం, కూరగాయలు వంటివి అందచేసే బాధ్యతను ఊరందరికి అప్పగించేవారు. దొరల గడీల్లో వెట్టి పనిచేసి దయనీయంగా జీవితాన్ని గడప వలసి వచ్చేది.



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

స్వాతంత్ర్యం వచ్చిందని దేశవ్యాప్తంగా వేడుకలు చేసుకుంటూంటే తెలంగాణా ప్రజలు మాత్రం భయం గుప్పెట్లో క్షణమొక యుగంగా బతుకుతున్నారు. రజాకార్లు తపంచాలతో ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తారోనన్న భయం ఒకవైపు, ప్రజల భయాన్ని ఆసరాగా చేసుకొని ప్రభుత్వాన్ని కూల్చాలనే తలంపుతో కమ్యునిష్టుల దాష్టీకం మరొకవైపు. వీరిద్దరిని అదుపు చేయడానికి ప్రభుత్వం చేపట్టిన పోలీసుచర్య. ఎటుచూసినా తపంచాల మయం, భయం గుప్పెట్లో ప్రజలు.

రైతుకు భూమి పట్ల ఉండే ఆశను వారు పూర్తిగా వినియోగించుకున్నారు. "నెహ్రూ ప్రభుత్వం పేద ప్రజల దురవస్థలన్నిటికీ కారణం. ఈనాడు లభించిన స్వాతంత్ర్యం నిజమైన స్వాతంత్ర్యం కాదు. అందుచేత మనం ఆ పరిపాలకులతో గట్టి పోరాటం జరిపి, భూస్వాముల నుండి విముక్తి సాధించాలి. అందు కోసం వీలైన మార్గాలన్నిటినీ అనుసరించాలి" అని ఆలోచించి జమీందార్ల గడీలను, మేడలను నేల మట్టం చేశారు. తిండిగింజలను నిల్వ చేసే వారి గాదెలను, పశువులను, గడ్డిమేట్లను తగులబెట్టారు. ఈ కార్యక్రమాలను సమర్థించని వారిని క్రూరంగా ఖూనీ చేశారు. పట్టపగలు మిలిటరీ వారి జులుం భయం, రాత్రిళ్లు కమ్యూనిష్టుల దాడి భయం. రజాకార్ల భయం ఎలానూ ఉండనే ఉంది. పరిస్థితి ఎంతో విషాదకరంగా ఉందని స్వామి రామానంద తీర్థ వాపోయారు.

ఆ రోజుల్లో ఖాసింరజ్వీ బాధ్యతా రాహిత్యంగా ఉపన్యాసాలు ఇచ్చాడు. 'మా ప్రభువు పాదాల్ని బంగాళాఖాతం (తూర్పు సముద్రం) జలాలు క్షాళనం చేసే రోజు అనతి కాలంలోనే వస్తుంది' అని వ్యాఖ్యానించాడు. అంతటితో అతని ఆవేశం ఆగలేదు "అసఫ్‌జాహీ నవాబుల పతాకం ఢిల్లీలోని ఎర్రకోటపై రెపరెప లాడుతుంది" అనే వరకు విజృంభించింది. మీనన్ వెల్లడించిన అభిప్రాయం ప్రకారం "ఖాసిం రజ్వీ కత్తి ఝుళిపింపులు ఎక్కువగా చేస్తూ, సర్వ స్వతంత్ర ఇస్లామిక్ రాజ్యం ఏర్పడే వరకూ హైదరాబాద్ ముస్లింలు దూసిన కత్తులను వరలో పెట్టవద్దని రెచ్చగొట్టాడు.


ఒక చేతిలో ఖురాన్, మరో చేతిలో కత్తి ధరించి శత్రువులను వేటాడవలసిందని రజ్వీ ఉద్బోధించాడు. వీటికన్నా అత్యంత ప్రమాదకర ప్రకటన ఒకటి చేశాడు. ఇండియన్ యూనియన్‌లో ఉన్న 45 మిలియన్ల (నాల్గున్నర కోట్ల) ముస్లింలు హైదరాబాద్ – ఇండియన్ యూనియన్ల మధ్య జరిగే ప్రత్యక్ష పోరాటంలో హైదరాబాద్ పక్షాన గూఢచారులుగా, అంతర్ శత్రువులుగా పని చేస్తారనేదే ఆ ప్రకటన సారాంశం.

యథాతథపు ఒడంబడిక ప్రకారం, భారత ప్రభుత్వం హైదరాబాదులో తన ఏజెంట్ జనరల్ ఒకరిని నియమించవచ్చు, కె.ఎం.మున్షీని ఆ పదవిలో నియమించడానికి నిర్ణయం జరిగింది. ఈలోగా హైదరాబాద్‌లో పరిస్థితులు త్వరితంగా విషమిస్తున్నాయని, సత్యాగ్రహోద్యమం ఆపి మీ శక్తి సామర్థ్యాలను ఉపయోగించి ఆత్మరక్షణ చేసుకోవాలని, మీ ధన, ప్రాణాలను మీరే రక్షించు కోవలసిన క్లిష్ట పరిస్థితి వచ్చిందని ప్రజలకు చెప్పడం భావ్యంగా గుర్తించామని రామానందతీర్థ ఆ సందర్భంలో గాంధీజీని కలసి ఈ విషయాన్ని వివరించగా, "మీకు ఎట్లా సాధ్యమైతే అట్లా ఆత్మరక్షణ చేసుకొనండ'ని హైదరాబాదు ప్రజలకు సూచించి నట్లు చెప్పారు, ఈ మాటల్లో ఆయుధాలు వాడవచ్చు ననే సలహా ఇమిడి ఉంది. అవును..! పిరికితనంతో పారిపోవడం కంటే ఆ పరిస్థితుల్లో అదే మంచిది.


దౌర్జన్యమార్గం చేపట్టి నప్పటికీ సాహసీకులు, వీరులూ అనిపించుకుంటారు. వారి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు" అన్నారు గాంధీజీ.

1947లో రజాకార్లకు వ్యతిరేకంగా పి.వి. నరసింహారావు (అనంతర కాలంలో దేశ ప్రధాని) యువ స్వాతంత్ర్య సమరయోధుడుగా తన స్వగ్రామం వంగర నుండి 20 మంది యువకుల బృందానికి నాయకత్వం వహించారు. ఆ ప్రాంతంలో రజాకర్లు పట్టు సాధించకుండా అడ్డుకోగలిగారు.

విద్య, ఉద్యోగాల విషయంలోనూ ఉర్దూ భాషకు ప్రోత్సాహం లభిస్తూ, ఆ భాష నేర్చుకున్న వారికే ఆ అవకాశాలు దక్కేవి. తెలుగుభాష అణచివేతకు గురైంది. భాషా సంస్కృతుల అణచివేతను వ్యతిరేకిస్తూ



గాంధీజీ



పటేల్

ప్రారంభమైన వివిధ సంస్థలు... భాషోద్యమం, గ్రంథాలయోద్యమాలలో కొంతవరకూ విజయాన్ని సాధించాయి. తెలుగు పత్రికలను చదవడాన్ని కూడా ఒప్పుకోని జాగీరీదారులు ఉండేవారని దాశరథి రంగాచార్య రాసిన "మోదుగుపూలు" వంటి రచనలు పేర్కొంటున్నాయి.

తెలుగుభాషా సంస్కృతులను పరిరక్షించే లక్ష్యంతో 1921 నవంబరు 12న హైదరాబాదులో టేక్‌మాల్ రంగారావు ఇంట్లో "ఆంధ్రజన సంఘం" ఏర్పడింది. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణా రావు, ముందుముల నరసింహారావు, ఆదిరాజు వీరభద్రరావు, రామస్వామి నాయుడు, టేకుమాల్ రంగారావులతో ఏర్పాటైన ఈ సంఘం, ప్రజలపై అమలు అవుతున్న ఆంక్షలను వ్యతిరేకించడం ప్రారంభించింది. వెట్టిచాకిరికి వ్యతి రేకంగా ప్రజలను చైతన్యపరచి 1930 నాటికి ఆంధ్ర మహాసభగా రూపుదిద్దుకుంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంగ్లోపన్యాసకుడు అబ్దుల్ లతీఫ్ 'జనాభా మార్పిడి' (ఎక్స్ఛేంజ్ ఆఫ్ పాపులేషన్) అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దీని ప్రకారం హిందువులు హింసకు బలికాకుండా ఉండాలంటే ఈ ప్రాంతాన్ని వదిలిపోవాలి. ఈ ప్రాంతాన్ని ముస్లిం జనాభాతో నింపివేయాలి. ఈ సిద్ధాంత ప్రభావం వలన 1948 నాటికి 8 లక్షల ముస్లిం జనాభా వచ్చి చేరారు. అంటే ఆ సందర్భంలో హిందువులు ఎంతటి హింసకు గురైనారో తెలుస్తుంది. 'అంజుమనే తబ్లిగ్ ఇస్లామ్' అనే సంస్థ మతమార్పిళ్లు చేసేది. దీనికి విరుగుడుగా ఆర్యసమాజం మతం మారిన వారిని 'శుద్ధి ఉద్యమం' ద్వారా తిరిగి హిందూ మతంలోనికి పునరాగమనం చేయించేది.

రైతులపై పన్నులు పెంచడం, కట్టలేకపోతే వారి వద్ద గల ఆహార నిల్వలను ధ్వంసం చేయడం, లేదా దొంగిలించడం వంటివి చర్యలకు పాల్పడేవారు. బైరాన్‌పల్లి సంఘటన దీనికి ఉదాహరణ. నిజాం పర్యటనకు వెళ్లినప్పుడు మార్గమధ్యలో పెళ్లిళ్లు జరుగుతుంటే, తనకు పెళ్లికూతుళ్లు నచ్చితే తీసుకెళ్లి పోయేవాడు. 50 వేలమంది దాకా గల రజాకారు, నైజాం ప్రయివేటు సైన్యం, దానికి పూర్తి మద్దతుగా ఉండేది. ప్రైవేటు సైన్యానికి విసునూరి దేశ్‌ముఖ్ రాంచందర్ రెడ్డి డిప్యూటీ కమాండర్‌గా ఉండేవాడు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ కాటన్ వద్ద ఆయు ధాలు ఖరీదు చేశారు. వాటితో అనేక ఘాతుకాలకు పాల్పడ్డారు.

1. తాటికొండ పోరాటంలో మిట్టా యాదవరెడ్డి సహా 30 మంది యువకులను హింసించి చంపారు.

2. జోడేఘాట్‌లో కొమరం భీం సహా 12 మంది గిరిజనులను హత్య చేశారు.

3. సలావుద్దీన్ (మొగల్ మియా) అకృత్యాలకు అంతేలేదు. స్త్రీలు కనిపిస్తే చాలు. వారి కుటుంబ సభ్యుల ముందే బలాత్కారం చేసేవారు. ఎదిరిస్తే ఇళ్లు గడ్డివాములు తగలబెట్టేవారు.

4. గాంధ్లాపూర్‌లో స్త్రీలతో నగ్నంగా బతకమ్మ ఆడించి పైశాచిక ఆనందం పొందారు.

5. నేరడ గ్రామంలో 70 మంది స్త్రీలకు పైజమాలు తొడిగించి అందులో తొండలను వదిలారు.

6. పాలమూర్ జిల్లా బోర్‌పల్లిపై దాడి చేసి దళిత యువకుల పురుషాంగాలకు కిరోసిన్‌తో తడిపిన గుడ్డలు చుట్టి నిప్పంటించారు. వారు ఆహాకారాలు చేస్తుంటే వారి భార్యలను మానభంగం చేశారు. ఈ ఘోరాన్ని తట్టుకోలేక వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

7. స్త్రీ రొమ్ములను పట్టుకారుతో లాగడం, పిరుదులపై గిల్లడం, తల్లుల ఎదుటే పిల్లలను మానభంగం చేయడం సర్వ సాధారణం.

8. భువనగిరి తాలూకా నారిగూడెంలో పచ్చి బాలింతపై అత్యాచారం చేశారు.

9. ఎనుపాదులో నిండు గర్భిణీపై అత్యాచారం చేశారు.

10. 1948లో వందలమంది సైనికులు బైరాన్‌పల్లిపై దాడిచేసి వారిని వరుసగా నిలబెట్టి 118 మందిని కాల్చిచంపారు. ఈ దాడిని నల్గొండ జిల్లా కలెక్టర్ మొహజ్జిం హుస్సేన్, డిప్యూటీ కలెక్టరు ఇక్బాల్ హసీం స్వయంగా పర్యవేక్షించారు.

11. ప్రజల శరీర భాగాలను నరికి బాధితుల తోనే తినిపించడం రజాకార్లకు ఆనందాన్నిచ్చే ఓ 'పైశాచిక క్రీడ'.

12. గర్భవతులను భర్తలు చూస్తూ ఉండగా కత్తులతో కడుపులు కోసి శిశువులను బయటకు లాగేవారు (ఈ ఘాతుకాలు మచ్చుకు కొన్ని మాత్రమే. ఈ అంశాలపై పెద్ద ఎత్తున పరిశోధన చేయాల్సిన అవసరం వుంది). ఈ ఘోర కలి, అకృత్యాలకు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సెప్టెంబరు 17, 1948న చరమగీతం పాడారు. ఆపరేషన్ పోలోతో నిజాం ఆరోజున లొంగిపోయాడు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ స్వాతంత్ర్యం తరువాత రాజ ప్రముఖ్ అయ్యారు.

'కాశీ యాత్రా చరిత్ర' కర్త ఏనుగుల వీరాస్వామి 1820–30 మధ్య కాలంలో రెండుసార్లు హైదరా బాద్ నగరాన్ని దర్శించారు. 'హైదరాబాద్ నగరంలో సాయుధులైన వ్యక్తులు మెత్తని వారిని (బలహీను లను) కొట్టి నరికే పరిస్థితి ఉంది. సుంకాలు వసూలు చేసేవారు, సరిగా చెల్లించని వారిని చంపినా అడిగే దిక్కులేదు'అని పేర్కొన్నారు.

రజాకార ఉద్యమంలో బలైన వారిపై కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన చరిత్రకారుడు సునీల్ పురుషోత్తం పరిశోధనలు జరిపారు. దీనికి పండిట్ సుందర్‌లాల్ నాయకత్వం వహించాడు. వారి నివేదక ప్రకారం 27 వేల నుంచి 40 వేల మంది దాకా మరణించినట్లు అంచనా. మరికొందరి పరిశీలన ప్రకారం మరణాలు 2 లక్షలు అంతకంటే ఎక్కువనే తెలుస్తోంది. ★

# సైనిక కుట్రల సుడిగుండం

అక్షరాలా అంతర్యుద్ధం కోరలలో చిక్కుకుంది సూడాన్. ఒక కోర సూడాన్ సైన్యం. మరొక కోర పారా మిలటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్. ఈ రెండూ దేశం మీద ఆధిపత్యం కోసం అంతర్యుద్ధానికి దిగాయి. ఈ సంవత్సరం ఏప్రిల్ 15న మొదలయిన ఈ అంతర్యుద్ధం పరిపాలనను ప్రజా ప్రభుత్వానికి అప్పగించే క్రమంలో ఆరంభం కావడమే వింత. అంటే ప్రజాపాలనను ప్రతిష్ఠించడానికి సైన్యం, పారా మిలటరీ అంతర్యుద్ధానికి దిగి అల్లకల్లోలం చేస్తున్నాయి. ఎడతెగని సంక్షోభాల సూడాన్ చరిత్రలో శాంతికి పెద్దగా చోటు లేదు. విదేశీయులు తమ తమ దేశాలకు వెళ్లడానికి ఆస్కారం కల్పిస్తూ వైరిపక్షాలు ఇచ్చిన 72 గంటల కాల్పుల విరమణ కూడా సరిగ్గా అమలు జరగలేదు. అంత తీవ్రస్థాయిలో యుద్ధం జరుగుతున్నది. రెండు వారాల యుద్ధాన్ని కూడా ఆ పేద దేశం భరించలేకపోతున్నది. ఇప్పటికే దేశంలోని ఆహార నిల్వలు, త్రాగునీరు, ఔషధాలు, ఇంధనం అన్నీ నిండుకుంటున్నాయి. సూడాన్ ప్రజలు కూడా దేశం వదిలి ఈజిప్ట్ సరిహద్దులలోకి పారిపోతున్నారు.

సూడాన్‌కు యుద్ధాలు, అంతర్యుద్ధాలు, తిరుగుబాట్లు కొత్తకాదు. అలాగే విదేశీ దురాక్రమణలు కూడా ఆ దేశాన్ని చిరకాలం చిందరవందర చేశాయి. తెగల మధ్య ఘర్షణలు, మత కల్లోలాలు వీటికి అదనం. సూడాన్ నిరంతరం సంక్షోభంలో ఉన్నట్టు కనిపిస్తుంది. ఇటీవలి చరిత్రలోనే దక్షిణ ప్రాంతానికీ, కేంద్రానికీ మధ్య రెండుసార్లు అంతర్యుద్ధాలు జరిగాయి. దక్షిణ సూడాన్‌లో పదిహేను లక్షల మంది చనిపోయారు. ఉత్తర ప్రాంతంలోని దర్ఫర్ కూడా రక్తంతో తడిసిపోయింది. ఇక్కడ ఈ ఘర్షణల మూలంగా రెండు లక్షల మంది చనిపోయారు. 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. 1956లో స్వాతంత్ర్యం సాధించుకున్న ఈ పేద దేశంలో 15 సైనిక తిరుగుబాట్లు జరిగాయంటేనే ఇక్కడి అనిశ్చిత స్థితిని అర్థం చేసుకోవచ్చు.

తాజా సాయుధ సంఘర్షణ ఇద్దరి అధికార దాహం ఫలితమే. సూడాన్ సైనిక పాలకుడు, సర్వ సైన్యాధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ బుర్హన్, జనరల్ మహమ్మద్ హమ్దాన్ దాగాలో (ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అధిపతి, పాలక వ్యవస్థలో రెండో స్థానంలో ఉన్నవాడు. ఇతడినే హెమెద్టి అని కూడా అంటారు) అధికారం కోసం ఇంత విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఈ ఇద్దరు





ఫతా అల్ బుర్హన్



హమ్దాన్ దాగాలో

ఇటీవలనే సూడాన్‌లో జరిగిన ప్రభుత్వ కూల్చివేతలో కలసి పనిచేసినవారే. 2019లో అధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్‌ను ఆ ఇద్దరూ కలసి పదవీచ్యుతుడిని చేశారు. బషీర్‌ను పదవీచ్యుతుడిని చేయడం వెనుక అంతుపట్టని కారణాలే ఉన్నాయి. అతడు మూడు దశాబ్దాలుగా సూడాన్‌ను పాలిస్తున్నాడు. కానీ ఇటీవల కాలంలో పెరిగిన ఆహారోత్పత్తుల ధరలు, తరువాత జరిగిన అలజడులు అతడి మీద తిరుగుబాటుకు కారణమైనాయి. కానీ బషీర్‌ను పదవి నుంచి దించడానికి అదొక్కటే కారణంగా చెప్పడానికి అంత అవకాశం లేదు. ప్రస్తుతం అంతర్యుద్ధం పాలబడిన దక్షిణ సూడాన్ బషీర్ కాలంలోనే ఉత్తర సూడాన్ నుంచి వేరుపడింది. వేర్పాటువాదం తీవ్రంగా ఉన్న దర్ఫర్‌లో జరిగిన యుద్ధనేరాల గురించి బషీర్‌కు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారెంట్ జారీ చేసింది. ఎట్టకేలకు బషీర్‌ను దింపేశారు. తరువాత సమస్య మొదలయింది. ప్రజా ప్రతినిధులతో, సైనికాధికారులతో ప్రభుత్వం ఏర్పడింది. ఆ భాగస్వాముల మధ్య పొంతన కుదరలేదు. అంతిమంగా 2021లో జరిగిన సైనిక తిరుగుబాటులో సైనిక పాలకుడు ఫతా అల్‌బుర్హన్, జనరల్ మహమ్మద్ హమ్దాన్ దాగాలో, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ అధిపతి హెమెద్టి కీలకంగా వ్యవహరించారు. తరువాత ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్‌ను సైన్యంలో విలీనం చేసే అంశంలో ఉద్రిక్తతలు తలెత్తాయి. దేశంలో ప్రజాపాలనను పునరుద్ధరించడంలో ఆ విలీనం కూడా భాగంగా మొదట భావించారు. ప్రజాపాలనను ప్రతిష్టించిన తరువాత ఎవరి కింద ఎవరు పనిచేయాలన్న అంశమే కీలకంగా

మారి, అంతిమంగా అంతర్యుద్ధానికి దారి తీసింది. బషీర్ ప్రస్తుతం సూడాన్ సాయుధ దళాల అదుపులో కార్తూమ్ జైలులో ఉన్నాడని వార్తలు వచ్చాయి.

నిజానికి ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్, దాని ప్రస్తుత నేత దాగాలో గతం వివాదాస్పదమైనదే. దాగాలో ఇంతవరకు తిరుగులేని అధికారాన్ని చెలాయిస్తున్నాడు. దర్ఫర్ ఘర్షణ సమయంలో ఇతడు జన్జావీద్ దళాలకు నాయకునిగా ఉన్నాడు. ఇది స్థానికుల మీద హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్టు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఇక అరాచకాలు సరేసరి. నిజానికి సైన్యం ఉండగానే పదవీచ్యుతుడైన బషీర్ దీనిని ఏర్పాటు (2013) చేశాడు. దీనినే బోర్డర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అని పిలిచారు. ఆరేళ్లకే బషీర్‌కు ఎదురుతిరిగిన దాగాలో కార్తూమ్‌లో జరిగిన ప్రజా ప్రదర్శన మీద కాల్పులు జరిపాడు. అందులో 118 మంది చనిపోయారు. బషీర్ దిగిపోయిన తరువాత అధికార మార్పిడి కోసం ఏర్పడిన ట్రాన్సిషనల్ సోవరిన్ కౌన్సిల్‌కు దాగాలో ఉపాధ్యక్షుడయ్యాడు. ఈ అంతర్యుద్ధాన్ని ఆరంభించింది కూడా ఇదే. పలు ప్రభుత్వ వ్యవస్థ కార్యాలయాల మీద సాయుధ దాడికి దిగడంతో యుద్ధం మొదలయింది. దీనికే రష్యా మద్దతు ఇస్తున్నది. ★

# ఆపరేషన్ కావేరి

**రాజేశ్వర్**



ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో స్థిరపడిన భారతీయులు అక్కడ అంతర్గత సంక్షోభ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. అంతర్యుద్ధం, లేదా ఇతర కారణాల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయి ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతుంటారు. అక్కడి పాలకులు పట్టించుకోక, స్వదేశానికి వచ్చేదారి లేక నానా అగచాట్లు పడుతుంటారు. ఎప్పుడు ఎటువైపు నుంచి తూటా వచ్చిపడుతుందో తెలియక, ఎటువైపునుంచి బాంబు పేలుడు సంభవిస్తుందో తెలియక బతుకు జీవుడా అంటూ దేవుడిపై భారం వేసి కాలం వెళ్లదీస్తుంటారు. స్వదేశీ పాలకుల నుంచి సరైన స్పందన కొరవడి చేసేదేమీ లేక ఆకలిదప్పులతో అలమటిస్తుంటారు. అంతా బాగుంటే అయినవాళ్ల దగ్గరకు రాగలుగుతారు. లేనట్లయితే ఇంతే సంగతులు.

ఇదంతా చరిత్ర. ఇప్పుడా పరిస్థితి ఎంతమాత్రం లేదు. నరేంద్ర దామోదర్ దాస్ మోదీ నాయకత్వంలో నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ కేంద్రంలో కొలువు దీరాక ఈ పరిస్థితిలో గణనీయ మార్పు వచ్చింది. ప్రవాస భారతీయులకు ఏ చిన్నపాటి ఇబ్బంది వచ్చిన వారిని ఆదుకునేందుకు, సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు, తాత్కాలికంగా పునరావాస, ఉపాధి సౌకర్యాలు కల్పించేందుకు ఢిల్లీ సర్కారు క్షణాల్లో సమాయత్తమవుతోంది. విదేశాంగ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారులను, ఇతర మంత్రులను రంగంలోకి దించుతోంది. సంబంధిత దేశాల అధినేతలు, మంత్రులు, ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతూ ప్రవాస భారతీయులను స్వదేశానికి తరలించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వాయు, జల, రహదారి... ఏది అందుబాటులో ఉంటే ఆ మార్గాల ద్వారా తరలిస్తున్నారు. ఖర్చు విషయంలో వెనకాడటం లేదు. అంతర్గత సంక్షోభం వల్ల అల్లాడుతున్న ప్రవాస భారతీయులను క్షేమంగా స్వదేశానికి తరలించడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తోంది. దీనికి ముందు అంతర్యుద్ధం, అంతర్గత సంక్షోభవం వల్ల భారతీయ సంతతికి చెందిన వారి ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఆయా దేశాల అధినేతలు, దౌత్యవేత్తలతో మాట్లాడుతోంది. తాత్కాలికంగా వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

అంతర్యుద్ధం కారణంగా సూడాన్ కొద్ది రోజులుగా అట్టుడుకుతోంది. ఆఫ్రికా ఖండంలోని ఈశాన్య ప్రాంతంలో విస్తరించిన సూడాన్ నిరుపేద దేశం. అయితే సహజ వనరులకు లోటులేదు. 4.57 కోట్ల జనాభాతో ఆఫ్రికాలోని అతి పెద్ద దేశాల్లో ఒకటి. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చాద్, ఈజిప్టు, ఎరిట్రియా, ఇథియోపియా, లిబియా సరిహద్దులు కలిగి ఉంది. రాజధాని నగరం కార్తూమ్. సూడాన్ సైన్యం, ర్యాపిడ్ సపోర్టు ఫోర్సెస్ మధ్య గత మూడువారాలుగా అంతర్యుద్ధం జరుగుతోంది. ఈ పోరులో 500 మందికి మరణించినట్లు అంచనా. 4200 మంది గాయపడినట్లు చెబుతున్నారు. కాల్పుల విరమణకు సంబంధించి ఇరువైపులా ప్రకటన వెలువడినప్పటికీ ఆచరణలో ఒట్టిమాటగానే మిగిలింది. సూడాన్ లో సుమారు 3000 మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిని స్వదేశం తరలించడానికి 'ఆపరేషన్ కావేరి' పేరుతో భారత్ ఒక కార్యక్రమం చేపట్టింది. వాయు, జలమార్గాల ద్వారా ఇప్పటి వరకు సుమారు 1725 మందిని భారత్‌కు తరలించారు. సూడాన్ పోర్టు ప్రాంతంలోని ఒక భారతీయ పాఠశాలను తాత్కాలికంగా పునరావాస కేంద్రంగా మార్చారు. సూడాన్‌లోని వివిధ సమస్యాత్మక ప్రాంతాల నుంచి

బస్సుల ద్వారా సూడాన్ పోర్టుకు అక్కడి నుంచి విమానాల్లో, ఐఎన్ఎస్ సుమేధ తదితర నౌకల ద్వారా సౌదీ అరేబియా లోని జెడ్డా నగరానికి తరలించారు. అక్కడి నుంచి విమానాల్లో ముంబయి, బెంగళూరు, చండీగఢ్, ఢిల్లీకి తరలిం చారు. ముందు జాగ్రత్త చర్యగా వీరికి టీకాలు వేస్తున్నారు. అంతేకాక క్వారం టైన్‌లో ఉంచుతున్నారు. వివిధ రాష్ట్రాల్లోని ఆస్పత్రులు, ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో క్వారం టైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచిత భోజనవసతి సదుపాయాలు కల్పించారు. తాజాగా మూడో విమానం 360మంది ప్రయాణికులతో బెంగళూరుకు చేరుకుంది. నాలుగో విమానం 231 మంది ప్రయాణికులతో ఢిల్లీ చేరుకుంది. 367 మంది ప్రయాణికులతో అయిదో విమానం ఢిల్లీ వచ్చింది. 320 మంది ప్రయాణికులతో మరో విమానం బెంగళూరు వచ్చింది. గతనెల 24 ఆపరేషన్ కావేరిని కేంద్రం ప్రారంభించింది. ఇందుకోసం సూడాన్ పోర్టులో, జెడ్డా నగరంలో కేంద్రం సమన్వయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. భారతీయుల తరలింపులో ఎయిరిండియా విమానాలతో పాటు, ఇండిగో విమానాలు కూడా పాలుపంచుకుంటు న్నాయి. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, సహాయ మంత్రి వి.మురళీధరన్, విదేశాంగ కార్యదర్శి వినయ్ మోహన్ క్వత్రా తదితర ఉన్నతాధికారులు భారతీ యుల తరలింపు, పునరావాస, సహాయ కార్యక్రమా లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎప్పటికప్పుడు వారికి మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు. ఇతర అధికారిక కార్యక్రమాల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ సూడాన్ నుంచి ప్రవాస భారతీయుల తరలింపు, వారికి వసతి, పునరావాస కార్యక్రమాల్లో ఖర్చుకు వెనకాడవద్దని అధికారులకు నిర్దేశించారు. చివరి భారతీయుడిని క్షేమంగా తరలించే వరకు విశ్రమించవద్దని వారికి సూచించారు. సంక్షోభంలో చిక్కుకున్న సోదరులను రక్షించుకోవడం కన్నా గొప్ప కార్యక్రమం ఏదీ ఉండబోదని వారిని ఉత్తేజ పరుస్తున్నారు.

**పేర్ల వెనక ఉద్దేశమిదీ....**

సూడాన్ లో చిక్కుకున్న వారి తరలింపు కోసం ఆపరేషన్ కావేరీ... పేరును ప్రకటించినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. ఈ పేరుకు, తరలింపునకు సంబంధం ఏమిటని పలువురు ప్రశ్నించారు. కానీ ఈ పేరు ప్రకటించడం వెనక మోదీ అంతరంగం మరో విధంగా ఉంది. మోదీ నూటికి నూరుశాతం నికార్సైన భారతీయుడు. ఆయన మనసంతా భారతీయతతో నిండి ఉంటుంది. సూడాన్‌లో చిక్కుకున్న వారిలో కర్ణాటక వాసులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. జీవనది కావేరీ జలాలు కర్ణాటకతో పాటు పొరుగున్న ఉన్న తమిళనాడు, కేరళను సస్యశ్యామలం చేస్తున్నాయి. మూడు రాష్ట్రాల ప్రజలకు కావేరీ నదితో భావోద్వేగమైన సంబంధం ఉంది. ఈ నది పేరు చెప్పగానే అక్కడి ప్రజల మనస్సులు పులకించిపోతాయి. అందుకనే సూడాన్‌లో చిక్కుకుపోయిన ప్రవాస భారతీయుల తరలింపు కార్యక్రమానికి ఆపరేషన్ కావేరీ అని పేరు పెట్టారు. గతంలోనూ వివిధ దేశాల్లో సంక్షోభాల కారణంగా చిక్కుకుపోయిన ప్రవాస భారతీయుల





తరలింపు కోసం ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ఇలాంటి పేర్లే పెట్టారు. అఫ్గాన్ ప్రభుత్వాన్ని తాలిబన్ ఉగ్రవాదులు స్వాధీనం చేసుకున్న సందర్భంగా సంక్షోభ పరిస్థితులు నెలకొన్నప్పుడు 'ఆపరేషన్ దేవీశక్తి' కార్యక్రమాన్ని ప్రారంభించి వందల మంది ప్రవాస భారతీయులను తరలించారు. కాబుల్, కాందహార్ విమానాశ్రయాల నుంచి ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి తీసుకువచ్చారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా సంక్షుభిత ఉక్రెయిన్‌లో చిక్కుకుపోయిన ప్రవాస భారతీయుల తరలింపు కోసం 'ఆపరేషన్ గంగ' అనే కార్యక్రమం చేపట్టారు. ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో భాగమైన ఉక్రెయిన్‌లో పెద్దయెత్తున భారతీయులు నివసిస్తు న్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వెళ్లారు. ముఖ్యంగా వైద్య విద్య కోసం భారతీయ విద్యార్థులు పెద్దయెత్తున ఆ దేశానికి వెళ్లారు. వీరిలో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల సంఖ్య కూడా తక్కువేమీ కాదు. వీరిని తరలించడానికి భారతీయతతో ముడి పడిన ఆపరేషన్ గంగ అనే పేరు పెట్టారు. గంగా నదికి, ఇక్కడి ప్రజలకు గల అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. 2022 ఫిబ్రవరి నెలాఖరులో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా సుమారు 20వేల మందిని తరలించారు. రుమేనియా, హంగరీ, పోలండ్, స్లోవేకియా తదితర ఉక్రెయిన్ సరిహద్దు దేశాల నుంచి తరలించారు. మంత్రులు జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, జ్యోతిరాదిత్య సింధియా, కిరణ్ రిజిజు, వీకే సింగ్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. కొవిడ్ సమయంలో వందే భారత్ కార్యక్రమం ద్వారా లక్షలమంది ప్రవాస భారతీయులను ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి తీసుకువచ్చారు. సముద్ర సేతు కార్యక్రమం ద్వారా



నౌకల్లో 55 రోజుల పాటు భారతీయులను తరలించారు. జలశక్తి, ఐరావత్, శార్దూల్, మగర్ నౌకల ద్వారా వివిధ దేశాల్లో చిక్కుకుపోయిన వేలాది మంది ప్రవాస భారతీయులను తరలించారు. ఆపరేషన్ మైత్రి కార్యక్రమం ద్వారా 2015లో నేపాల్ భూకంప బాధితులకు మోదీ సర్కారు సాయ మందించింది.

అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను విమానాల ద్వారా స్వదేశానికి తరలించారు. కేవలం స్వదేశీయుల సంక్షేమమే కాకుండా ఎవరికి ఎటువంటి సాయం అవసరమైన అందించడంలో భారత్ ముందు వరుసలో ఉంటోంది. తాజాగా టర్కీ (తుర్కియే), సిరియాల్లో భూకంపం కారణంగా భారీ ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లింది. ఆ దేశాలకు సాయ పడేందుకు ఆపరేషన్ దోస్త్... కార్యక్రమం చేపట్టింది. భారత్‌కు చెందిన నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్సు (ఎన్‌డీఆర్ఎఫ్) దళాలను ఆయా దేశాలకు పంపిం చింది. మందులు, ఆహారంతో వెళ్లిన ఈ దళాలు సహాయ, పునరావాస కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అంతర్జాతీయంగా మన్ననలు అందు కున్నాయి. వాస్తవానికి అంతర్జాతీయ రాజకీయాల పరంగా చూస్తే టర్కీ మనకేమీ మిత్రదేశం కాదు. కాకపోగా కశ్మీర్ విషయంలో పాకిస్తాన్‌కు అదేపనిగా అంతర్జాతీయ వేదికలపై వంత పాడుతుంది. అయినప్పటికీ మానవతా దృష్టితో ఆ దేశానికి సాయమందించి తన పెద్ద మనసు చాటుకుంది. కష్టకాలంలో విదేశాలకు ఆపన్న హస్తం అందించే మోదీ సర్కారు భారతీయుల విషయంలో ఎంత శ్రద్ధాసక్తులు చూపుతుందో చెప్పడానికి చేపట్టిన వివిధ కార్యక్రమాలే నిదర్శనం.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



# జర్నలిస్ట్‌లు సమాజ హితం కోసమే పనిచేయాలి!


ప్రఫుల్ల కేత్కర్

**భా**గ్యనగరంలోని రెడ్‌హిల్స్‌లో గల ఎఫ్‌టీసీసీఐ ఆడిటోరియంలో ఏప్రిల్ 30న సమాచార భారతి ఆధ్వర్యంలో నారద జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్ట్‌లకు ప్రతిభా పురస్కారాలు అందించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయవాద వారపత్రిక 'ఆర్గనైజర్' సంపాదకుడు ప్రఫుల్ల కేత్కర్ మాట్లాడుతూ.. పత్రికా రంగానికి నారద మహర్షే ఆద్యుడని కొనియాడారు. కానీ కొందరు ఆయన గురించి అసత్యాలు ప్రచారం చేశారని గుర్తుచేశారు. 30 మే 1826న కలకత్తాలో ప్రారంభమైన ఉద్దండ్ మార్తాండ్ పత్రిక నారద మహర్షి ముఖచిత్రంతోనే ప్రచురితమైందని తెలిపారు. లోకకల్యాణమే ధ్యేయంగా జర్నలిస్ట్‌లు పనిచేయాలని పిలుపునిచ్చారు.

సమాచార భారతి అధ్యక్షుడు డాక్టర్ జి. గోపాలరెడ్డి మాట్లాడుతూ జాతీయ భావ ఆలోచనా స్రవంతిని నిలబెట్టాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందన్నారు. సమాచార భారతి ఆధ్వర్యంలో యువ జర్నలిస్ట్‌లకు విలువలతో కూడిన జర్నలిజంపై శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ క్రాంతిదేవ్ మిత్ర నారద జయంతి విశిష్టతను గురించి తెలియజేశారు.

ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు పురస్కారాలు, నగదు బహుమతి అందజేశారు. సీనియర్ జర్నలిస్ట్ రమావిశ్వనాథ్‌కు 'వడ్లమూడి స్మారక పురస్కారం' అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయవాద జర్నలిస్ట్‌లు దేనికీ భయపడకుండా సమాజాభివృద్ధికి దోహదం చేస్తున్నారన్నారు. సీనియర్ జర్నలిస్ట్ సామవేదం జానకీ రామశర్మ 'భండారు సదాశివరావు స్మారక' పురస్కారాన్ని అందుకున్నారు. శ్యామసుందర్ వరయోగి 'సమాచారభారతి కాలమిస్ట్' పురస్కారం అందుకున్నారు. కొంటు మల్లేశం 'సమాచార భారతి యువపురస్కారం' అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో సమాచార భారతి కార్యదర్శి ఆయుష్ నడింపల్లి పాల్గొన్నారు. సభ్యులు వేదుల నరసింహం, రాంపల్లి మల్లికార్జున్, దుర్గారెడ్డి, రాజగోపాల్ కార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకున్నారు. 125 మందికి పైగా జర్నలిస్ట్‌లు ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా మహతి వ్యవహరించారు. ★





# ఇదో దౌర్భాగ్యం

**అమెరికా వారిలో ఈ మధ్యకాలంలో ఒక వింత మాట వినిపిస్తు న్నదట. మా అబ్బాయి పెళ్లి చేసుకున్నాడు అంటే, అవతలి వారు, ఆడపిల్లనేనా అని సందేహ నివృత్తి చేసుకునేవారట. అలాగే అమ్మాయిల విషయం కూడా అంతేనని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఇప్పుడు పాశ్చాత్య సమాజం నుంచి సంప్రదాయా లకు నెలవైన భారతీయ సమాజంలోకి ఆ తంతును తేవాలని కొందరు ఆరాట పడుతున్నారు. కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినా.. మగవాడితో మగవాడి పెళ్లి... స్త్రీని స్త్రీ పెళ్లి చేసుకోవడం.. ఇందుకు ఉద్యమం..ఈ విషయమై సుప్రీంకోర్టులో పెద్ద చర్చ! ఇదో దౌర్భాగ్యం!**

సుప్రీంకోర్టులో సుప్రియో వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా వ్యాజ్యం మీద వాదోపవాదాలు జరుగుతున్నాయి. విషయం అదే–సేమ్‌సెక్స్ మ్యారేజీ. అసలు పెళ్లి అంటే ఏమిటంటా! అదేమిటో అన్నీ మతాలూ ఒక్కటే చెబుతాయి. స్త్రీ పురుషుల మధ్య పవిత్ర బంధం.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 19, 21, 25 అధికరణాల మేరకు పెళ్లిని లింగ భేదాన్ని బట్టి కాకుండా, ప్రాథమిక హక్కుగా పరిగణించమని ఈ కేసులో వాదిస్తున్నారు. అంటే పురుషులు కావాలంటే పురుషుడిని చేసుకునే హక్కు ఉండాలి. అలాగే స్త్రీ విషయంలో కూడా. అందుకు మార్గాన్ని సుగమం చేస్తూ స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1954, హిందూ వివాహ చట్టం 1955, వివాహ చట్టం, 1969లలోని అంశాలను సవరించ వలసినదిగా కోరుతున్నారు. ఈ కేసు విచారణకు ఏర్పాటు చేసిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎస్.కె. పాల్, జస్టిస్ రవీంద్రభట్, జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ పి.ఎస్.నరసింహ సభ్యులు. ఢిల్లీలోని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రభుత్వం, Commissioner for protect of chois of rights.కేసుకు అనుకూలంగా ఉన్నారు. ఇండియన్ సైక్రియాట్రిక్ సొసైటి కూడా మద్దతు ప్రకటించింది.



**ఎం. సుందరరామిరెడ్డి**
అడ్వకేట్

బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముస్లిం సంస్థలు దీనిని పూర్తిగా వ్యతిరేకించాయి. “ప్రజలు దీనినొక వింతగా చూస్తున్నారు. వివాహం అంటే అన్ని మతాలవారు ఒకే అభిప్రాయం కలిగి ఉన్నారు. పెండ్లి అంటే స్త్రీ, పురుషులు మధ్య పవిత్రబంధం. హిందువులకైతే అదొక విడదీయరాని బంధం. ఏ మత గ్రంథాలలోను సేమ్‌సెక్స్ మధ్య పెండ్లి గురించి ప్రస్తావించలేదు. ఇది ఊహాకు అందని విషయం.

అయినా, ఈ విషయం మీద అత్యున్నత న్యాయస్థానం స్పందించి ఈ విద్దూరమైన వాదనలు, అవి చేస్తున్న సంఘాలతో ఎందుకు కాలయాపన చేస్తున్నదో తెలియదు. ఇది కుట్రపూరితమైన వ్యాజ్యం. ఇలాంటి వాటితో అత్యున్నత న్యాయస్థానం, న్యాయవాదుల విలువైన సమయం వృధా అవుతోంది. దేశంలో పరిష్కారం కోసం ఎన్నో కేసులు ఎదురు చూస్తున్నప్పటికీ ఇలాంటి కేసులను ఇంత వేగంగా విచారించడం అంటే ఎవరికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు? సుప్రీంకోర్టులో 20–30 సంవత్సరాలుగా చాలా కేసులు నానుతున్నాయి. ఆ కాలయాపనతో న్యాయ వ్యవస్థపైనే నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడుతున్నది.

మెకాలే ఇంగ్లిష్ న్యాయవ్యవస్థనే ఇప్పటికీ మనవారు అనుసరిస్తున్నారు. ఆ వ్యవహారంలో నిజ నిర్ధారణకు తావులేదు. ఆ వ్యవస్థలో తీర్పు వచ్చాక కూడా అది నిజమో అబద్ధమో చెప్పలేం. ఏదైనా కావచ్చు. అలాంటి పాశ్చాత్య భావాలను నమ్ముకుంటే అది ఇలాంటి వికృత రూపాలకు దారితీస్తుంది.

భారతదేశం, సంస్కృతి పురాతనమైనవి. అందులోని వివాహ వ్యవస్థను పటిష్టమైనదిగా, పవిత్రమైనదిగా భావిస్తారు. అదేవిధంగా ఇతర మతస్థులు కూడా భావిస్తున్నారు. అలాంటి వ్యవస్థలో ఇలాంటి వక్రబుద్ధి జనిత విచిత్ర వాదనలు ఏమిటని, వాటిలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడమేమిటని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మరొక వింత పోకడ కూడా వినిపిస్తున్నది. భారతదేశ సంస్కృతి ఎక్కడి నుంచి వచ్చినా, ఎవరు చేసిన వాదనలనైనా ఆలకించే సహనం కలిగి ఉందంటారు కదా అంటున్నారు కొందరు. ఇదొక విపరీత అభిప్రాయం. ఒకటి నిజం, లింగభేదం లేకుండా వివాహం చేసుకోవడం గురించి పురాతన భారతీయులు ఊహించి ఉండరు.

లింగభేదం లేని పెళ్లి గురించి న్యాయస్థానాలు



నిర్ణయాలు తీసుకొనగలవా? అసలు చట్ట నిర్మాణం అనేది పార్లమెంటు పరిధిలోనిది కదా అని ఇంకొందరు చెబుతున్నారు. నిజానికి ఈ అంశం అటు న్యాయవ్యవస్థ పరిధిలోకి గానీ, ఇటు పార్లమెంటు పరిధిలోగానీ కచ్చితంగా రాదు. మన రాజ్యాంగం అన్ని విషయాలను వివరించలేదు. చాలా అంశాల మీద అది మౌనంగానే ఉండిపోయింది.

స్త్రీని స్త్రీ అనే అంటాం. పురుషుడిని, పురుషుడనే అంటాం. ఈ విభజనను తెలియచేయడానికి ఒక చట్టమంటూ ఏదీ అవసరంలేదు. కానీ దీని మీద సర్వోన్నత న్యాయస్థానం వాదోపవాదాలు వింటున్నది. అందుకే అత్యున్నత న్యాయస్థానం ఈ మధ్యకాలంలో పరిధులను మించి వ్యవహ రిస్తున్నదన్న అభిప్రాయం వచ్చింది. రాజ్యాంగం ప్రకారం మన జాతీయ భాష హిందీ. ఐతే హిందీలో

ప్రసంగించడానికీ, వాదోపవాదాలు జరపడానికీ అత్యున్నత న్యాయస్థానం అంగీకరించడం లేదు. ఇది ఎంతవరకు రాజ్యాంగబద్ధం?

సేమ్‌సెక్స్.. పదే, పదే దీనిని సంబోధించడమే అసభ్యంగా ఉంది. ఆ పదానికి భారతీయ భాషలలో సందర్భోచితంగా అనేక పదాలు, పర్యాయపదాలు కూడా ఉన్నాయి. సంభోగం, లైంగిక సంబంధం, సహవాసం, సాంగత్యం అలాంటి పదాలే. ఆంగ్లభాషలో అన్నింటికి కలిపి ఒకే పదం. ఆంగ్లం ఇపుడిపుడే పరిణితి చెందుతోంది.

ఈ అంశంలో ఆర్‌ఎస్‌ఎస్ తన అభిప్రాయం నిక్కచ్చిగా చెప్పింది. పెండ్లి అనేది స్త్రీ- పురుషుల మధ్య జరిగేదేనని ఆ సంస్థ వెల్లడించింది. అది హిందూ సంస్కృతిలో ఒక సంస్కారం. కుటుంబ వ్యవస్థకు సంబంధించినది. ఒక విధంగా చెప్పాలంటే ఇది హోమో సెక్సువల్ గారడిలా కనిపిస్తున్నది. ఆస్తి వ్యవహారం కూడా ఉన్నది. ఒక పురుషుడు మరొక పురుషునికి ఆస్తి సంక్రమింపచేయాలని అనుకుంటే, ఇప్పటి చట్టం ప్రకారం – అమ్మకం, దానం వగైరాలు రాత పూర్వకంగా రిజిష్టరు చేయాలి. అయితే దీనిని వివాహంగా పరిగణిస్తే అలాంటి రాత పూర్వక పత్రాలు అవసరంలేదు. అది వారసత్వ రీత్యా సంక్రమిస్తుంది. ఈ సౌకర్యం కోసమే ఈ వాదనను తెరపైకి తెస్తున్నారు. ఏది ఏమైనా అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి వివాదాన్ని మొదటనే త్రుంచివేసి ఉండవలసింది. ★


## స్వేచ్ఛ పేరుతో విశృంఖలత్వమే

# సేమ్ సెక్స్ వివాహాలు

**గత కొన్ని రోజులుగా సుప్రీంకోర్టులో ఓ అంశంపై సాగుతున్న వాదోపవాదాలను యావత్ సమాజం ఆసక్తిగా గమనిస్తోంది. దీనిపై వచ్చే తీర్పు సెక్సువాలిటీ పట్ల సభ్యసమాజానికి ఉన్న అభిప్రాయంలో మార్పు తెస్తుందని ఓ వర్గం ఆశపడుతోంది. ఇంతకీ ఏమిటా అంశం? అందులో ఆసక్తి రేపే అంశం ఏమిటి?**



సేమ్‌సెక్స్ మ్యారేజ్ లేదా స్వలింగ సంపర్కుల పెళ్లిళ్లకు చట్టబద్ధత గురించిన చర్చ చిరకాలంగా జరుగుతోంది. సమాజంలో తమకూ సమానమైన గౌరవం లభించాలని ఈ వర్గాలు కోరుకుంటు న్నాయి. తమ వివాహాలకు చట్టబద్ధత కల్పించి ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు అందుకోవచ్చన్న ఆశ వారిలో కలుగుతోంది. ఈ అంశంపైన పౌరసమాజం, కేంద్ర ప్రభుత్వం, చట్టాలు కూడా భిన్నాభి ప్రాయాలతో ఉన్నాయి. ప్రస్తుతం సుప్రీంకోర్టు వేదికగా దీనిపైన సాగుతున్న వాదోపవాదాలు చివరకు ఈ అంశాన్ని ఒక తార్కికమైన ముగింపును ఇస్తాయన్న అభిప్రాయంలో ఉన్నారు. మొత్తం సమాజంపై ప్రభావంచూపే ఇలాంటి అంశాలపై పార్లమెంటులో చర్చ జరగాలని సుప్రీంకోర్టు భావిస్తోంది.



స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని దాఖలైన పిటీషన్లపై సుప్రీంకోర్టు తుదివాదనలను వింటోంది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దానిని ప్రత్యక్షప్రసారాలను కూడా చేస్తున్నారు. తీర్పు తమకు అనుకూలంగా వస్తుందని స్వలింగ సంపర్కులు, ఎల్జీబీటీక్యూ కమ్యూనిటీ వారు ఆశాభావంతో ఉన్నారు. ప్రభుత్వంతో పాటు మతనాయకులు కూడా స్వలింగ సంపర్కుల వివాహాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

భారత్‌లో స్వలింగ సంపర్కుల వివాహాలను అనుమతించాలని 15కు పైగా జంటలు సుప్రీం కోర్టులో పిటీషన్లు దాఖలు చేశారు. కలిసి పిల్లలను పెంచుతున్న జంటలుకూడా మూడుకు పైగా పిటీషన్లు దాఖలు చేశారు. ఇది ప్రాధాన్యత గల అంశమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. చట్టపరమైన సవాళ్లను అన్నింటిని పర్యవేక్షించి ఈ అంశంపై తీర్పు నివ్వటానికి ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఆయన ఏర్పాటు చేశారు.

భారత్‌లో ఎల్జీబీటీక్యూ ప్లస్ జనాభా కోట్లల్లో ఉంటుందని ఒక అంచనా. 2012లో వీరి సంఖ్య 25 లక్షలు ఉన్నట్లు ప్రభుత్వం భావించింది. ఇప్పటి జనాభా ప్రకారం అంచనా వేస్తే వీరి జనాభా దాదాపు 10 శాతం లేదా 13.5 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ‘మా డిమాండ్లను పార్లమెంటుకు పంపకుండా, సుప్రీంకోర్టు దానికదే ఈ సమస్యను పరిష్కరించాలి. ప్రభుత్వంపైన మాకెలాంటి నమ్మకం లేదు. ఆర్టికల్ 377 విషయంలో కూడా



మా పక్షాన నిలబడి, మా బాధలను విన్నది' లెస్బియన్, బైసెక్సువల్ ట్రాన్స్ పర్సన్ నెట్ వర్క్ ఇన్ స్టిట్యూట్‌కు చెందిన రితిక వ్యాఖ్యానించారు.


ఆర్టికల్ 377కి ఆమోదం ఇచ్చినప్పుడు పెళ్లికి ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నిస్తున్నారు. సింగిల్ పేరెంట్స్ పిల్లలు దత్తత తీసుకుని వారికి ప్రేమను, సంరక్షణను అందిస్తున్నప్పుడు, స్వలింగ సంపర్కులు పెళ్లి చేసుకుని ఎందుకు అందించలేరు అని అడుగుతున్నారు. అలాంటి వాళ్లకు ఇద్దరు తల్లులు లేదా ఇద్దరు ఉంటారు అందులో తప్పేం ఉంది? అని నిలదీస్తున్నారు.

స్వలింగ సంపర్కులు ఏకం కావటాన్ని భారత్‌లో అన్ని మతాలు.. హిందూ, ముస్లిం, జైనులు, సిక్కులు, క్రిస్టియన్లు నాయకులు మూకుమ్మడిగా వ్యతిరేకించారు. వివాహం అనేది సంతానం కోసం తప్ప వినోదం కోసం కాదని వారు అభిప్రాయ పడుతున్నారు.

స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత అనేది సమాజం, కుటుంబం, పిల్లలపై ప్రమాద కరమైన ప్రభావాలను చూపుతుందని 21 మంది రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తులు అభిప్రాయ పడ్డారు. స్వలింగ వివాహాల వల్ల భారత్ లో ఎయిడ్స్ కేసులు పెరగొచ్చని, ఇలాంటి జంటల దగ్గర పెరిగే పిల్లల మానసిక, ఉద్వేగాల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి భిన్నమైన వాదనను ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ (ఐపీఎస్) పైకి తెచ్చింది. 'స్వలింగ సంపర్కం అనేది ఒక వ్యాధి కాదు. ఎల్జీబీటీక్యూ ప్రజల పట్ల చూపే వివక్ష వారిలో మానసిక సమస్యలకు దారి తీస్తుంది' అని ఈ సొసైటీ పేర్కొంది.

గే సెక్స్‌ను నేరంగా పరిగణించకూడదని ఐపీఎస్ చేసిన అభిప్రాయాన్ని 2018లో సుప్రీంకోర్టు కూడా ప్రస్తావించింది.

మరో వైపు స్వలింగ సంపర్కుల వివాహాలకు సంబంధించిన పిటీషన్లను తిరస్కరించాలని సుప్రీంకోర్టును భారత ప్రభుత్వం కోరింది. భారత్‌లో వివాహాలు ఆడ, మగ మధ్య మాత్రమే జరుగుతాయని కోర్టుకు చెప్పింది. స్వలింగ సంపర్కులు ఒకరితో మరొకరు భాగస్వాములుగా, లైంగిక సంబంధాలను ఏర్పరచుకుంటూ కలిసి జీవించటం అనేది భారత కుటుంబ వ్యవస్థ అయిన భార్య, భర్త, పిల్లలు అనే అంశంతో పోల్చలేమని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌లో భారత న్యాయవ్యవస్థ ఆదేశించింది. మత, సామాజిక కట్టుబాట్లతో లోతుగా మమేకమైన దేశ శాసన విధానాన్ని కోర్టులు మార్చకూడదని, ఈ అంశాన్ని పార్లమెంటుకు వదిలేయాలని కోర్టుకు విన్నవించింది.



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**
సీనియర్ జర్నలిస్ట్

స్వలింగ జంటలకు సామాజికపరమైన హక్కుల్ని కల్పించేందుకు కేంద్రం ఏదో ఒక మార్గాన్ని కనుగొనాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. అలాంటి జంటలకు ఉమ్మడి బ్యాంకు ఖాతాలను ఇవ్వటం, బీమా పాలసీల్లో భాగస్వామిని నామినేట్ చేయటం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని సూచించింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించే విషయంలో పార్లమెంట్ తీర్మానమే కీలకం. ఆ విషయం సుప్రీంకోర్టు అంగీకరిస్తోంది. స్వలింగ వివాహాన్ని ప్రభుత్వం గుర్తించినా గుర్తించకపోయినా దానికొక లేబుల్ అవసరం అని అభిప్రాయపడింది. ఈ పెళ్లిళ్లకు చట్టబద్ధత కల్పించకుండా వారి సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. ప్రేమించటం, సహజీవనం చేయటం, జీవితభాగస్వామిని ఎన్నుకోవటం వంటివి ప్రాథమిక హక్కులే అయినా, స్వలింగ వివాహాన్ని చట్టబద్ధంగా గుర్తించాలని కోరటం ప్రాథమిక హక్కుకాదని తుషార్ తేల్చిచెప్పారు.

చాలా మంది ఎల్జీబీటీక్యూ ప్లస్ వ్యక్తులు బయటకు రావటం లేదని, కనీసం తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా తమ గుర్తింపును వెల్లడించలేదు. కొన్నిసార్లు సమాజం నుంచి అవమానాలను, దాడులను ఎదుర్కొంటున్నారు. తమ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే, సామాజిక ప్రయోజనాలు కూడా పొందవచ్చని ఆశపడు తున్నారు. ఒకవేళ ప్రభుత్వం వారికి అనుకూలంగా తీర్పుఇస్తే ప్రపంచంలో స్వలింగ సంపర్కుల వివాహాలకు చట్టబద్ధత కల్పించిన 35వ దేశంగా భారత్ నిలుస్తుంది. సమాజంలో ముఖ్యమైన మార్పులకు దారి తీస్తుంది. దీని ప్రకారం దత్తత, విడాకులు, వారసత్వం తదితర చట్టాల్లో సవరణ చేయవలసి ఉంటుంది.

ఈ జంటలు భారతదేశంలో ఎలాంటి అనుభవా లను ఎదుర్కొంటున్నారో చూద్దాం? ఇవన్నీ వారు చేస్తున్న వాదనలుగానే పరిగణించాలి. ప్రస్తుతానికి మాత్రం ఇలాంటి వారికి సంఘంలో గౌరవనీయమైన స్థానం లేదు. దానిని గమనిస్తూనే వీరి అనుభవాలు ఏమిటో గమనించాలి. ఈ అనుభవాలు, అభిప్రాయాలు మీడియా ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా సమాజంలోకి వెల్లువెత్తుతు న్నాయి. కాబట్టి వీటిలోని వాస్తవికత గురించి తెలుసుకోవడం అవసరం. ఇలాంటివి ప్రచురిస్తున్నా, ప్రసారం చేస్తున్నా అలా సమాచారం తెలుసు కోవడానికే.

అంకిత, కవిత.. ఇద్దరూ సహోద్యోగులు.

అంకిత థెరపిస్టు. కవిత సైక్రియాటిస్టు. ఇద్దరూ కలిసి వైకల్యాలతో బాధపడే చిన్నపిల్లల కోసం ఒక క్లినిక్ నడుపుతున్నారు. వాళ్లు కలుసుకుని 17 ఏళ్లయ్యింది. కలిసి జీవించటం మొదలుపెట్టి పదేళ్లు దాటింది. తామిద్దరం పెళ్లి చేసుకుంటామని సెప్టెంబరు 23, 2020 న దరఖాస్తు చేసుకున్నారు. ఈ సమయంలో అంకిత తల్లికి అత్యవసరంగా శస్త్రచికిత్స చేయవలసి వచ్చింది. 'అప్పుడు అంకితతోపాటు ఆస్పత్రికి వెళ్ళిన తను కన్సెంట్ పత్రంలో సంతకం చేయలేకపోయాను. ఎందుకంటే తాను అంకిత అమ్మకు కూతుర్ని కాదు. కోడలుగా

కూడా పరిగణించరు’ అని తన అనుభవాన్ని కవిత వివరించారు. దానితో సెప్టెంబరు 30న తన వివాహానికి చట్టబద్ధత కల్పించాలని స్థానిక మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. కాని వారికి నిరాశ ఎదురైంది. స్వలింగ సంపర్కుల పెళ్లికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు. తమ వివాహానికి అధికారిక గుర్తింపు ఇవ్వాలని అధికారులకు సూచించాలని కోర్టును కోరారు.

సుప్రీంకోర్టుతో పాటు దేశంలోని వివిధ హైకోర్టులో స్వలింగ సంపర్కుల వివాహాలకు సంబంధించిన అనేక పిటీషన్లు దాఖలయ్యాయి. జనవరిలో ఈ పిటీషన్లంటినీ ఒక చోటకు చేర్చిన సుప్రీంకోర్టు ఈ ముఖ్యమైన అంశంపై విచారిస్తామని ప్రకటించింది. “మమ్మల్ని ఒంటరిగా వదిలేయమని మేం కోరటల్లేదు. మమ్మల్ని కూడా అందరితో సమానులుగా గుర్తించే హక్కును మేం అడుగుతున్నాం” అని ఆ ఇద్దరు చెప్పుకొచ్చారు. వారిద్దరి తరపున సీనియర్ న్యాయవాది మేనక గురుస్వామి ఈ పిటీషన్ దాఖలు చేశారు. ఆరు స్వలింగ సంపర్కుల కేసులను మేనక టీం వాదిస్తోంది. లైంగిక ధోరణి ఆధారంగా పౌరులపై వివక్షను రాజ్యాంగం నిషేధిస్తోంది. సామాజిక నైతికత కంటే రాజ్యాంగ నైతికత ఎక్కువ కాబట్టి తమ పిటీషన్‌ను అనుమతించాలని ఆమె వాదిస్తున్నారు. ఈ కేసును ఎంచుకోవటంతో ఆమెను సామాజికంగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు.

మౌసమి బెనర్జీ. వయసు 35. లెస్బియన్ ఒక ఎంఎన్సీలో అసిస్టెంటు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత ఫిబ్రవరిలో కుటుంబం,స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు.

“మా పెళ్లికి చట్టబద్ధత లేకపోవటంతో ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు పొందలేకపోతున్నాం సాధారణంగా పెళ్లయిన జంటలకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలను మేం కూడా పొందాలి” అని కోరారు.

సాత్విక్.. వయసు 37. గే. 2007లో యూకె వెళ్లి మాస్టర్స్ చేశారు. తర్వాత లండన్ లో కొంత కాలం పనిచేసి వచ్చిన తర్వాత భారత్ కు వచ్చారు. తన పార్ట్‌నర్ తో ఎనిమిదేళ్లుగా కలిసి ఉన్న సాత్విక్‌కి ఇక్కడ వాతావరణం సహకరించలేదు. ఇంటి అద్దె కూడా పొందటం కష్టమైంది. అనేక చేదు అనుభవాల తర్వాత చివరకి ఆగస్టు 2020లో దేశం విడిచి వెళ్లారు. తనకు భారతదేశం అంటే ఇష్టమని.. ఇక్కడే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని ఆయన చెబుతున్నారు. స్వలింగ సంపర్కుల వివాహానికి అనుమతి ఇస్తేనే ఇది సాధ్యమవుతుందని అన్నారు. మన దేశంలో దీనికి చట్టబద్ధత లేకపోవటంతో అనేక జంటలు దేశం విడిచి పోతున్నాయి.

సుబోధ్.. వయసు 30. ఫ్యాషన్ డిజైనర్. హోమో సెక్సువల్. ముందుగా తన విషయాన్ని తల్లితో



**ఈ తీర్పు కచ్చితంగా చారిత్రాత్మకం అవుతుంది. సమాజంలో ముఖ్యమైన మార్పులకు అది దారి తీస్తుంది. అయితే స్వలింగ సంపర్కుల వివాహానికి చట్టపరంగా ఆమోదం లభించినా, ప్రజల ఆలోచనలో మార్పులు వస్తాయని అనుకోలేం.అదే సమయంలో ఈ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే ఆ తర్వాత దత్తత, విడాకులు, వారసత్వం తదితర చట్టాల్లో సవరణ చేయవలసి ఉంటుంది. ఇదంతా పూర్తికావటానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది.**


పంచుకుని కుటుంబ ఆమోదాన్ని పొందారు. ఆర్టికల్ 377కి ఆమోదం ఇచ్చినప్పుడు పెళ్లికి ఎందుకు ఇవ్వరు అని సుబోధ్ ప్రశ్నిస్తున్నారు. సింగిల్ పేరెంట్స్ పిల్లలు దత్తత తీసుకుని వారికి ప్రేమను, సంరక్షణను అందిస్తున్నప్పుడు, స్వలింగ సంపర్కులు పెళ్లి చేసుకుని మేమెందుకు అందించలేం అని అడుగుతున్నారు? ఇద్దరు తల్లులు లేదా ఇద్దరు ఉంటారు అందులో తప్పేం ఉంది? అని ప్రశ్ని స్తున్నారు?

అభిషేక్.. వయసు 28. గే. ఐఐటీ విద్యార్థిగా ఉన్న అభిషేక్ డేటింగ్ యాప్ ద్వారా 28 ఏళ్ల సూరజ్ తోమర్‌ని కలిశారు. ఆ తర్వాత వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. మూడేళ్లుగా కలిసి ఉంటున్నారు. న్యాయపరమైన ఇబ్బందుల వల్ల ఇంకా పెళ్లి చేసుకోలేదని చెబుతున్నారు. సుప్రీంకోర్టు స్వలింగ సంపర్కుల వివాహాన్ని గుర్తిస్తుందనే ఆశాభావంలో ఉన్నారు. ఈ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే, తాము కూడా విద్య, వైద్యం వంటి ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతామని చెబుతున్నారు.

ఈ జంటలన్నీ సుప్రీంకోర్టు ఏం తేలుస్తుందనే అంశంపై ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఈ తీర్పు కచ్చితంగా చారిత్రాత్మకం అవుతుంది. సమాజంలో ముఖ్యమైన మార్పులకు అది దారి తీస్తుంది. అయితే స్వలింగ సంపర్కుల వివాహానికి చట్టపరంగా ఆమోదం లభించినా, ప్రజల ఆలోచనలో మార్పులు వస్తాయని అనుకోలేం. అదే సమయంలో ఈ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే ఆ తర్వాత దత్తత, విడాకులు, వారసత్వం తదితర చట్టాల్లో సవరణ చేయవలసి ఉంటుంది. ఇదంతా పూర్తికావటానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది.

2018 సెప్టెంబరులో స్వలింగ సంపర్కం నేరం కాదని సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పుఇచ్చింది. దీన్ని నేరంగా పరగణించే బ్రిటిష్ కాలం నాటి సెక్షన్‌ను కోర్టు కొట్టేసింది.

సెక్షన్ 377... బ్రిటిష్ వారు స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించారు. క్రైస్తవానికి, స్వలింగ సంపర్కానికి సరిపడదని బ్రిటిష్ వారు ఆ నిబంధనను తెచ్చారనే ప్రచారం ఉంది. ★



**కథ**

బస్ ఏదో గ్రామీణ పాయింట్‌లో ఆగింది.

ఆలోచనలలో మునిగిన నేను వాటి నుంచి వెలుపలపడి తలెత్తి చూశాను.

ఎవరో ఒకే ఒక వ్యక్తి బస్ ఎక్కాడు.

కండక్టర్ వద్ద టికెట్ తీసుకుని ముందుకు వచ్చాడు ఆ మనిషి. అంతదాకా డబుల్ సీట్లో దర్జాగా కూర్చుని ఉండిన నేను కొద్దిగా కిటికీ పక్కకు జరిగి ఆ మనిషి కూర్చోవడానికి అవకాశం ఇచ్చాను.

అతడు వచ్చి నావద్ద ఆగాడు కానీ, నా పక్కన కూర్చోకుండా వెనుక వైపునకు వెళ్లిపోయాడు.

అదయితే నాకు తరచు ఎదురయ్యే అనుభవమే!

నిండయిన నా విగ్రహం, క్రమశిక్షణతో నాకలవడిన నా డ్రెస్‌మ్యానర్, నిగనిగలాడే నా కాలిబూట్లు, తాహతుకు మించిన ఖరీదైన నా చేతి వాచీ, కళ్లద్దాలు... ఇవన్నీ కొంతమందిని నా పక్కన కూర్చోవడానికి సంశయించేలా చేస్తాయి!

బస్ కొంత దూరం వెళ్లాక ఎందుకో వెనుతిరిగి చూశాను. మరెక్కడా సీట్లు ఖాళీ లేనందున అతడు నిలబడే కన్పించాడు.

వచ్చి నా పక్కన కూర్చోమన్నట్లుగా చేయి ఊపాను.

కానీ అతడు తను నుంచున్న చోటు నుంచి కదలలేదు!

అయినా నా మనసు ఊరుకోలేదు.

నేనే లేచి అతని వద్దకు వెళ్లి "అలా పద, నా పక్క సీటు ఖాళీగా ఉంది కదా? కూర్చుందాము" అన్నాను.

"ఒద్దులేయ్యా!" అన్నాడతను.

"ఏం? ఎందుకని?" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించాను.



"మీరు పెద్దోళ్లయ్యా!" అన్నాడు.

అతనలా అనగానే నేనతనికేసి పరీక్షగా చూశాను...

అతడు నా సమ వయస్కుడే! దిగువ మధ్యతరగతి రైతో, రైతు కూలీనో అయి ఉంటాడు.

కష్టంతో అరిగి కరిగిన శరీరం... ముతక దుస్తులు!

"టికెట్ కొన్నావు కదా! మరి ఈ బస్‌లోని ఆ సీటులో సగం మీద నాకెంత హక్కుందో మిగతా సగం మీద అంతే అధికారం నీకూ ఉందికద? పద వెళ్లి ఇద్దరం కూర్చుందాము" అన్నాను.

పక్క సీట్లవాళ్లు ఆశ్చర్యంగా చూస్తున్నారు మాకేసి.

"ఒద్దులేవయ్యా, మీరు గొప్పోళ్లు" అన్నాడు.

పాట పాతదే... రాగం కొత్తగా విన్పించింది... అంతే....

ఇంతలో ఇంకో స్టాపులో బస్సు ఆగడమూ, బిలబిలమంటూ కొందరు మనుషులు బస్ ఎక్కడమూ, వారిలో ఇద్దరు చప్పున ముందుకు వచ్చేసి నేను కూర్చుని ఉండిన సీటును ఆక్రమించుకోవడమూ జరిగిపోయాయి.

నా పని కాస్తా పుణ్యానికిపోతే పాపం ఎదురైనట్లయింది. అయితే మాత్రమేం?...నేను యుద్ధరంగంలో పనిచేసి వచ్చినవాడిని. అతడేమో కాయకష్టం చేసే మనిషిలా ఉన్నాడు. నిలబడి ప్రయాణం చేయడం మాకేం కష్టం కాదు నిజానికి.

"అడ్డు తీయండయ్యా, నేను పోయి ఒకరిని లేపించేస్తాను" అన్నాడతడు... తన వల్ల నా సీటు పోయిందన్న బాధ కన్పించింది అతని కళ్లలో.

"ఒద్దు, ఒద్దు... ఆ సీటు మీద ఇప్పుడైతే వారికి అధికారం ఉందిలే... ఇంతకూ నీవు ఎందాకా వెళ్తున్నావు?" అని ప్రశ్నించాను.

"అంకిపాడు మిట్టవరకే బాబూ!"

"ఏం పనిమీద?" అంటూ మళ్లీ ప్రశ్నించాను.

"మా నాయన ఆస్పత్రిలో ఉన్నాడయ్యా!"

అతని జవాబు విని ఆశ్చర్యపోతూ అతనికేసి పరీక్షగా చూశాను. తను నా సమవయస్కుడే! కాబట్టి తప్పక డెబ్బయి అయిదేళ్లు దాటిపోయి ఉంటాయి అతనికీ!!

"మీ నాయన వయసెంతుంటుంది?" ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ ప్రశ్నించాను.

"మా నాయన లెక్కల ప్రకారం వందకు ఓ సంవత్సరం అటూ ఇటూ ఉంటాయయ్యా!"

"ఇప్పుడేమిటి జబ్బు?"

"జ్వరమయ్యా! నలభై రోజులు కాద్నించి, ఒకటే జ్వరమయ్యా... మా ఊరి పక్కనే రామన్నపేట ధర్మాసుపత్రిలో పదైదురోజులున్నాడయ్యా. ఏమీ గుణం కాలా! ఆనక పెద్ద గోవిందప్ప ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాము. వాళ్లు పదైదు

దినాలుంచుకుని బాగానే చూశారయ్యా. అయితే వాళ్లకాడ కూడా ఏమీ గుణం కన్పించలా. దాంతో అంకిపాడుమిట్ట సూపర్ ఆస్పత్రికి తీసుకుపొమ్మని జాబు రాసిచ్చిరయ్యా. పదిరోజుల కాడ్నించీ ఆ ఆస్పత్రిలోనే ఉన్నాడు" అన్నాడతడు.

"ఖర్చు చాల అయ్యుంటుందే?"


"అవునయ్యా! రామన్నపేట ధర్మాసుపత్రిలో ఖర్చేం కాలేదు కానీ పెద్ద గోవిందప్ప ఆస్పత్రి ఖర్చు తట్టుకోలేకే ఇరవయి జీవాలను అమ్ముకోవాల్సి వచ్చిందయ్యా!" అన్నాడు.

"జీవాలంటే?" ప్రశ్నించాడు అర్థం కాక.

"గొర్రెలు, మేకలయ్యా" అన్నాడతడు స్వచ్ఛంగా

# జవాన్ - జై కిసాన్

టిఎస్ఎ కృష్ణమూర్తి



నవ్వేసి ఏ మాత్రం కల్తీలేని నవ్వది!

ఈ మధ్యకాలంలో అలాంటి స్వచ్ఛమైన నవ్వులు చాల తక్కువగా కన్పిస్తున్నాయి.

"అంకిపాడు మిట్ట సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా చాల డబ్బు ఖర్చయి ఉంటుందే?"

"అబ్బో దాని మాటెందుకులేయ్యా! మా ఇంటిదానికున్న కొంచెం బంగారం, మా కోడలి బంగారం పూర్తిగా కరిగిపాయె!"

"మీ కోడలు బాధపడలేదా?"

"అయ్యో రామ.... ఆ బంగారు బిడ్డ నవ్వుతూ బంగారమంతా తీసి నా చేతుల్లో పెట్టేసె గద... "పెద్దాయప్పకు బాగయి వచ్చి కండ్లముందు కదలాడ్తూ ఉంటే... అదే నాకు పెద్ద బంగారు" అంటుంది ఆ బిడ్డ. ఆ బిడ్డకు మామీద ప్రాణమయ్యా..."

పై మాటలంటున్నప్పుడు అతని కళ్లలో ప్రశాంతతతో కూడిన తృప్తి కన్పించింది.

"మొత్తానికి నీవు అదృష్టవంతుడివి" అన్నాను.

"అవునయ్యా, శానా జీవాలూ, బంగారూ పోతే పోయాయి...మంచి కాలమొస్తే మళ్లీ కూడగట్టుకోవచ్చు... మా నాయన కోలుకుంటున్నాడయ్యా, అదే సాలు మాకు. ఆయన ఇంటి ముంగిటుంటే సాలు మా ఇంటిల్లుపాదికీ కొండంత ధైర్యమయ్యా!" అన్నాడు.

అప్పుడతని స్వరంలో ఆనందం, కళ్లలో గొప్ప జీవంతో కూడిన వెలుగు కన్పించింది.

అతన్ని చూస్తుంటే నాకు తెలియని జీవిత పరమార్థమేదో అర్థమవుతున్నట్లుగా అన్పించింది నిమిషం పాటు.

వృద్ధులను అనాథ శరణాలయాలలో చేర్చేవారు కొందరు, మాయమాటలు చెప్పి వందలాది మైళ్ల అవతలకి తీసుకువెళ్లి వదిలిపెట్టి వచ్చేసేవారు కొందరు కన్పిస్తున్న కాలంలో తన వృద్ధ తండ్రిని బతికించుకోవడానికి ఈ వృద్ధుడు చేస్తున్న కృషి అద్భుతం అన్పించింది.

'ఈ ప్రపంచాన్ని ప్రశాంతంగా జీవింపచేసుకోవచ్చు!' అని కూడా అన్పించింది.

"నెమ్మదించిందన్నావు కద? ఎప్పుడు డిశ్చార్జి చేస్తామన్నారు?" అని ప్రశ్నించాను..." ఈ బక్క మనిషిని ఆ ఆస్పత్రివారు మరెంత పీల్చి పిప్పి చేస్తారో?" అని మనసులో అనుకుంటూ.

"మర్నాడు ఇంటికి పంపిస్తామని చెప్పారయ్యా... ఏదో ఒక బాధ పడి బాకీ లెక్క ఆస్పత్రిలో కట్టి మా నాయనను ఇంటికి పిలుచుకుని పోవాలి. ఇన్నాళ్లూ నా ఇంటిది మా నాయన్ను కనిపెట్టుకుని ఆస్పత్రి కాడే ఉండిపోయింది. నా కొడుకుకు మిగిలివున్న జీవాలను కొండకు తోలుకుపోనూ, వాటికి ఆకూ అలమూ కొట్టుకు రానూ, ఇంటికాడున్న గొడ్లకు గడ్డీ, గాదమూ చూసుకోనూ సరిపోతుంది.

మా కోడలికయితే పసిబిడ్డల్ని సమాలించుకుంటూ అన్నం వండనూ, ఆస్పత్రికి గంజి కాసివ్వనూ, గొడ్లకు కుడితిపోయనూ, గానుగపిండీ, తవుడూ ఉడికించి పెట్టనూ... ఇంకా ఇంటిపనులూ సరిపోయాయి. ఇంగ నాకయితే లెక్క సర్దుబాటు చెయ్యనూ, మా నాయనకు గంజి, అమ్మకు అన్నమూ తీసుకు పోయి మంచీ, చెడ్డా చూడడానికి అంకిపాడు మిట్టకూ, మా ఊరికీ తిరగను సరిపోయె.

ఊర్లో కాసింత మడీ, సేనూ ఉన్నాయయ్యా. వాటి ముకం సూసి నెల రోజులు దాటిపాయె. పక్కమడి సీతప్ప మంచోడు గాబట్టి అడపాదడపా నామడీ జూసి నీళ్లు గట్టాడు'' అంటూ తన సాధకబాధకాలు చెప్పుకొచ్చాడు అతడు. బహుశా మనసులోని బరువలాదించుకున్నాడేమో! అవన్నీ అటుంచితే ఆస్పత్రులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చిన అతని దుస్థితికి జాలి కలిగింది.

ఆ సమయంలో నేను కళ్లారా చూసిన, కొద్దో గొప్పో అనుభవించిన రెండు విషయాలు కళ్లముందు కదలాడాయి.

ఒకటి... చిన్నతనంలో నేను చూసిన మావూరి డాక్టర్లు..

డాక్టర్ కృష్ణమూర్తి అనే ఓ మహానుభావుడు ఆజాద్ క్లినిక్ అని ఓ చిన్న ఆస్పత్రిని నడిపేవాడు. పేదలకు, ధనికులకు ఒకటే వైద్యం! ఎవరు ఏమిచ్చినా చూడకుండానే తీసుకుని జేబులోనో, టేబులు సొరుగులోనో వేసుకునేవాడు. రోగి పల్సు చూసి పరీక్షించి, చిన్న కాగితంమీద మందులు రాస్తే కాంపౌండర్ చకచకా వాటర్ మిక్చర్లు కలిపి రోగి తెచ్చుకున్న సీసాలలో వేసి ఇచ్చి ఎలా వాడాలో చెప్పేవాడు. రోగి మరో రోజు ఆస్పత్రికి రావాల్సిన అవసరం లేకుండా ఆ మందులు పనిచేసేవి. వైద్య సేవలన్నీ పేదవారికి ఉచితంగానే లభ్యమయ్యేవి అక్కడ.

ఉదయం ఒక గంట, సాయంకాలం ఒక గంట సైకిలు మీద ఊరిలో రౌండ్లు తిరిగి పెద్దగా జబ్బుపడ్డ వారిని జాగ్రతత్త పరీక్షించి తగు సూచనలు ఇచ్చివచ్చేవాడు. ఊరు పెరిగి, ఆయనకు వయసు మళ్లాక సువేగా మోపెడ్ మీద రౌండ్లు తిరిగి వచ్చేవాడు.

ఆయనకు కనీవినీ ఎరుగని రీతిలో పౌర సన్మానం జరిగింది. తరువాత కొద్దిరోజులకే జీవన యానం ముగించుకుని వెళ్లిపోయాడు.

ఆయనలాంటి వారే ఆల్ఫ్రెడ్ నర్సింగ్ హోం డాక్టర్లు ఆల్ఫ్రెడ్ దంపతులు. అలాగే తక్కువ ఖర్చుతో సేవలందిస్తుండిన షోషా ఆస్పత్రి అందులోని డాక్టర్ వ్యాన్స్టాడ్ మొదలైన డాక్టర్లు, హోమియో వైద్యులు డాక్టర్ ఎం.ఎర్రమరెడ్డి, ఓంశాంతి క్లినిక్ డాక్టర్ అమరనాథ్, కస్తూరి క్లినిక్ డాక్టర్ తంగరాజు లెక్చరర్ ఇంకా హోమియో డాక్టర్ కదం కృష్ణాజీరావ్ డాక్టర్

లక్ష్మీబాయి దంపతులు... ఇలా కొందరి ద్వారా సేవాధర్మంతో ప్రజలకు వైద్యసేవలు అందుతుండేవి.

వాస్తవానికి అవి చాలామంచి రోజులు.... జబ్బులూ తక్కువ... రోగులూ తక్కువే!

రెండవది...నా సర్వీస్ చివరి దశకంలో... కార్గిల్ యుద్ధ సమయంలో నేను చూసిన దేవదూతల లాంటి డాక్టర్లూ వారి సహాయకులు.

యుద్ధ రంగంలో చనిపోయిన వారిని తరలించడం నిజానికి పెద్ద సమస్య కాదు. మృతదేహాలను సగౌరవంగా, త్వరతగతిన వెనక్కి తరలిస్తారు.

కానీ గాయపడిన వారినయితే చాలచాల వేగంగా, అతి జాగ్రత్తగా బార్డర్ కేర్ ఆస్పత్రికి తరలించాలి. కార్గిల్‌వార్ సమయంలో అక్కడి ఆపరేషన్ థియేటర్లు, ఐసీయులు, స్పెషల జనరల్ వార్డులలోని మంచాలు... చివరికి... వరండాలలోని నేలకూడా గాయపడ్డవారితో నిండిపోయాయి. ఆపరేషన్లను థియేటర్లలోనే కాక మంచాలమీద, బల్లలమీద, అరుగులమీద చివరికి నేల మీద కూడా జరపాల్సి వచ్చింది. నిజానికి విధిలేని అత్యయిక పరిస్థితులు అవి.

గాయపడ్డవారి ప్రాణాలు నిలపడమే ధ్యేయంగా మరో యుద్ధంలా డాక్టర్లూ, వారి సహాయకులూ క్షతగాత్రులకు ప్లాస్టిక్ పట్టాల మీదే ఆపరేషన్లు జరుపుకుంటూ పోయారు. వారికి రోజుల తరబడి సరిగా తిండి తినడానికి, నిద్రపోవడానికి వ్యవధి లేదు. వారసలు వ్యవధి కావాలనుకోలేదు! వారికా ధ్యాసే లేదు!!

శరీరంలోకి దూసుకుపోయిన బుల్లెట్లను తొలగించడం, సెప్టిక్ అయిన భాగాలను, అవసరమైతే అవయవాలను తొలగించడం, అత్యవసర ఆపరేషన్లు ఎక్కడ వీలయితే అక్కడ అలాగే చేసెయ్యడం, అక్కడి ఎమెర్జెన్సీ కేర్ ముగియగానే అత్యవసరం ఉన్నవారిని హెలికాప్టర్లలో, తతిమ్మా వారిని అంబులెన్సులలో, మిలిటరీ స్పెషల్ వాహనాలలో తరలించడం ఒక పక్క జరిగిపోతూంటే ఖాళీ అయిన స్థానాలలోకి మరో పక్క కొత్తగా యుద్ధ క్షతగాత్రులు వచ్చి చేరుకుంటుండడం. ఆ తంతు మొత్తం సిస్టమాటిక్‌గా, నిరవధికంగా జరిగిపోయింది యుద్ధం పూర్తయ్యే వరకూ కూడా!

విసుగులేదు, విరామంలేదు, తిండి తిప్పలమీద ధ్యాసలేదు. అంకిత భావంతో కర్తృత్వమే కనపడిందక్కడ! దేవదూతలు కాదు ఆ డాక్టర్లూ, సహాయకులూ... నిజంగా దేవతలే!

నిజానికి వారి ఆ సేవలు ప్రపంచానికి తెలిసే అవకాశాలుండవు!!

రెండు దశలలో నేను చూసిన అలాంటి వైద్యులు, సహాయకులూ, వైద్యశాలలూ ప్రపంచమంతా ఉంటే ఎంత బావుండును? అని అన్పించింది. ఇలాంటి సామాన్యులకు వైద్య, ఆర్థిక సమస్యలనేవి ఉండేవి కాదు కదా? అని కూడా అన్పించింది.

అతనితోపాటు నిలబడి నా ఆలోచనలలో నేనుండగానే బస్సు అంకిపాడు మిట్ట బస్‌స్టేషను చేరుకుంది. టిఫిన్ బాక్సులున్న చేతి సంచితో బస్ దిగి వెళ్లిపోయాడతను.

బస్‌లో చాల సీట్లు ఖాళీ అయ్యాయి.

నేనూ వెళ్లి ఓ ఖాళీ సీట్లో కూర్చున్నాను.

*    *    *

చాలా నెలల తరువాత ఓ రోజు పనిమీద అంకిపాడు మిట్టకు వెళ్తే బజార్లో కన్పించాడతడు. తను నన్ను గుర్తుపట్టకుండా వెళ్లిపోతోంటే నేనే ఆపి పలకరించాను.

"ఎరువుల అంగడికి వచ్చానయ్యా" అన్నాడు.

"అది సరే మీ నాయన ఎలా వున్నాడు?" అని ప్రశ్నించాను ఆసక్తిగా.

"దేవుని దయవలన బాగా కుదురుకున్నాడయ్యా. ముందుటి కన్నా కూడా ఉషారుగా ఉన్నాడు. తెల్లారకట్టే అందరి కన్నా ముందే లేచి గొడ్లకాడ పాలు పిండేసి ఎత్తుకుపోయి పాలడెయిరీ వ్యానుకాడ ఇచ్చేసి వస్తాడు. అన్నం తినగానే జీవాలను కొండకల్ల తోలకపోయి సందేల దాకా మేపు కొస్తున్నాడయ్యా. సేద్యం పనులు చేసుకోను బాగా సులువుగా ఉందయ్యా మాకిప్పుడు" అన్నాడతడు.

అతని స్వరంలోని తృప్తిని ఆస్వాదిస్తూ మౌనం వహించాను.



రక్షణరంగ ఉద్యోగంలోని కష్టాలూ, సుఖాలూ ఓపికగా అనుభవించినందుకే కడుపులో చల్లకదల కుండా మంచి పెన్షన్ పొందుతున్నాను. ఇంకా కొన్ని సౌకర్యాలూ లభ్యమవుతున్నాయి. సమాజంలో కాస్త మంచిపేరు, సంఘంలో ఒకరకమయిన హోదా. అంత మాత్రాన నేను గొప్పవాడినా? నిరంతర జీవన సంగ్రామంలో విరామమెరుగక పోరాడుతూ వంద సంవత్సరాల తండ్రిని జీవింపచేసుకున్న అతడు గొప్పవాడా? ఎవరు గొప్పవారు?..

"మీరు గొప్పోళ్లయినా నన్ను పలకరించారయ్యా! చాన సంతోసమయ్యా.... వస్తానయ్యా..." అంటూ బయల్దేరాడతడు.

"నేను గొప్పవాణ్ణా?" అన్న ప్రశ్న ఉదయించింది నా మనసులో...

నేనూ అతనిలాంటి రైతు కుటుంబానికి చెందినవాణ్ణే!

దాదాపు అరవయియేళ్లకు క్రిందటిమాట... కరువు దెబ్బకు కుటుంబం కుదేలై పోతుండగా, మిలటరీ సెలక్షన్లు జరుగుతోంటే ధైర్యం తెచ్చుకుని వెళ్లాను. అదృష్టవశాత్తు ఎంపికయ్యాను. చదువు మానుకుని వెళ్లిపోయి అప్పుడలా ఆ రోజులలో సిపాయినయ్యాను.

ఎక్కడ ఎలా పనిచేసినా నాకయితే పెద్దగా ఖర్చంటూ ఉండేది కాదు... అందువల్ల జీతం డబ్బులు ఇంటికి పంపేస్తూ కుటుంబానికి బాసటగా నిలిచాను. అదృష్టవశాత్తు సర్వీసులో మంచి అధికారులు ఇచ్చిన సూచనలతో ప్రయివేటుగా చదువుకొనసాగించాను. అది నాకెంతో మేలు చేసింది. డైరెక్టు హవాల్దార్ అయి ఆపై హవాల్దార్ మేజర్ అయ్యాను. చదువుతోపాటు అంచెలంచెలుగా ఎదిగి జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ అయ్యాను. గర్వపడకుండా కష్టాన్ని భరించి పనిచేస్తూ రావడం వల్ల, యుద్ధరంగంలోనే కాక ఆపరేషన్ పరాక్రమ్‌లో సైతం ప్రతిభ కనపరచడం వల్ల మరింత ఎదిగి లెఫ్టినెంట్ కల్నల్‌గా పదవీ విరమణ చెందాను.

రక్షణరంగ ఉద్యోగంలోని కష్టాలూ, సుఖాలూ ఓపికగా అనుభవించినందుకే కడుపులో చల్లకదల కుండా మంచి పెన్షన్ పొందుతున్నాను. ఇంకా కొన్ని సౌకర్యాలూ లభ్యమవుతున్నాయి. సమాజంలో కాస్త మంచిపేరు, సంఘంలో ఒకరకమయిన హోదా.

అంత మాత్రాన నేను గొప్పవాడినా? నిరంతర జీవన సంగ్రామంలో విరామమెరుగక పోరాడుతూ వంద సంవత్సరాల తండ్రిని జీవింపచేసుకున్న అతడు గొప్పవాడా? ఎవరు గొప్పవారు?.. అని ఆలోచిస్తూ నడుస్తూంటే అతడు తన తండ్రిని బ్రతికించుకోవడంలో అతనికి ఎంతో సహకరించిన అతని భార్య, అతని కుమారుడు, కోడలు కూడా గొప్పవారనిపించింది.

అందరికన్నా... వంద సంవత్సరాల వయసులో పెందలాడే పాలు పితికి, డెయిరీ వ్యానుకు అందించి, తిండి తినడం ఆలస్యం... గొర్రెలను, మేకలనూ మేపడానికి తోలుకుపోయి వస్తూ నిండు కుటుంబానికి సహకరిస్తున్న అతని వృద్ధ తండ్రి చాలాచాల గొప్పవాడనిపించింది.

వంద సంవత్సరాల ఆ రైతు కుటుంబీకుడూ, సైనిక దళంలోకి వెళ్లి ఓ స్థాయికి వచ్చిన నేనూ సరిసమానమే కావచ్చు బహుశా. అందుకే అన్నారేమో 'జై జవాన్, జై కిసాన్' అని. ★



# 58 ఏళ్ల కల సాకారం!

**ఆసియా బ్యాడ్మింటన్‌లో బంగారు పతకం సాధించాలన్న 58 సంవత్సరాల భారత కలను యువజోడి సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి సాకారం చేశారు. దుబాయ్ వేదికగా ముగిసిన 2023 టోర్నీ పురుషుల డబుల్స్‌లో స్వర్ణ విజేతలుగా నిలిచారు...**

భారత బ్యాడ్మింటన్ చరిత్రలోకి సంచలన విజయాలు ఒక్కొక్కటిగా వచ్చి చేరుతున్నాయి. ఇప్పటి వరకూ మహిళల సింగిల్స్‌లో భారత పతాకాన్ని సైనా, సింధు తమ అసాధారణ విజయాలతో రెపరెప లాడిస్తూ వస్తే.. ఆ బాధ్యతను పురుషుల డబుల్స్‌లో యువజోడి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తీసు కొన్నారు. ఇప్పటికే థామస్ కప్, కామన్వెల్త్ గేమ్స్, ప్రపంచ బ్యాడ్మింటన్ టోర్నీలలో భారత్‌కు అరుదైన పతకాలు అందించిన ఈ డబుల్స్ జోడి, దుబాయ్ వేదికగా జరిగిన 2023 ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో విశ్వరూపమే ప్రదర్శించారు.

**ఎన్నో ఏళ్లకు బంగారు పతకం...**

అత్యున్నత ప్రమాణాలకు మరో పేరైన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియ న్ షిప్‌లో భారత్ చివరిసారిగా 1971లో కాంస్య పతకం సాధించింది. ఆ తర్వాత ఐదు దశాబ్దాల కాలంలో కనీసం ఒక్క పతకానికీ నోచుకోలేకపోయింది. ప్రపంచ బ్యాడ్మింటన్ దిగ్గ జాలు ఇండోనేషియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, చైనీస్ తైపీ, హాంకాంగ్, థాయ్ లాండ్, చైనా దేశాలకు చెందిన క్రీడాకారులతో ఆసియా బ్యాడ్మిం టన్ పోటీలు ఒలింపిక్స్‌నే తలదన్నేలా ఉంటాయి. ప్రపంచ, ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడం కంటే ఆసియా టోర్నీలలో పతకాలు పండించడమే కష్టమని బ్యాడ్మింటన్ పండితులు చెబుతూ ఉంటారు.

**1965లో దినేశ్ ఖన్నాకు స్వర్ణం...**

లక్నో వేదికగా 1965లో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత దిగ్గజ ఆటగాడు దినేశ్ ఖన్నా బంగారు పతకం సాధించారు. ఫైనల్లో థాయ్ లాండ్ ప్లేయర్ సాంగోబ్ రత్తానుసోర్న్‌ను ఓడించడం ద్వారా విజేతగా నిలిచారు. ఆ తర్వాత 1971 ఆసియాటోర్నీ పురుషుల డబుల్స్‌లో భారత జోడి దీపు ఘోష్- రామన్ ఘోష్ కాంస్య పతకం సాధించారు. 1971 నుంచి 2022 వరకూ ఆసియా బ్యాడ్మింటన్ పోటీలలో భారత్‌కు మరే పతకమూ దక్కలేదు.

ప్రకాశ్ పదుకోన్, పుల్లెల గోపీచంద్, విమల్ కుమార్, సయ్యద్ మోడీ, సైనా నెహ్వాల్, పీవీ సింధు లాంటి హేమాహేమీలే ఆసియా బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించడంలో విఫలమయ్యారు. భారత క్రీడాకారులు ప్రపంచ, ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్ లాంటి క్రీడల్లో పతకాలు సాధిస్తూ వచ్చినా, ఆసియా బ్యాడ్మింటన్ పోటీలలో మాత్రం విఫలమవుతూ వచ్చారు. అయితే.. ఆ లోటును పూడ్చుకోవడానికి 2023 దుబాయ్-ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీ వరకూ వేచిచూడాల్సి వచ్చింది.

**సాత్విక్- చిరాగ్ సరికొత్త చరిత్ర...**

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్‌లో తెలుగుతేజం సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జోడీ గత రెండేళ్లుగా సంచలన విజయాలతో ఆకాశమే హద్దుగా సాగిపోతోంది. ప్రపంచ పురుషుల టీమ్ చాంపియన్‌ల కోసం నిర్వహించే థామస్ కప్ (2022 )ను భారత్ తొలిసారిగా గెలుచుకోవడంలో సాత్విక్- చిరాగ్ జోడి ప్రధానపాత్ర వహించింది. ఆ తర్వాత జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం సాధించడం ద్వారా ఈ ఘనత సాధించిన భారత పురుషుల తొలిజోడీగా చరిత్ర సృష్టించారు.

ఇక.. బర్మింగ్ హామ్ వేదికగా ముగిసిన కామన్వెల్త్ గేమ్స్ పురుషుల డబుల్స్‌లో సైతం అలవోకగా బంగారు పతకం గెలుచుకోడం ద్వారా ప్రపంచ 6వ ర్యాంక్ జోడిగా నిలిచారు. దుబాయ్ లోని అల్ నాసర్ క్లబ్‌లోని షేక్ రషీద్ బిన్ హమ్ దాన్ ఇన్ డోర్ వేదికగా జరిగిన 2023 ఆసియా బ్యాడ్మింటన్ టోర్నీలో 6వ సీడ్ జోడిగా టైటిల్ వేటకు దిగారు. తొలిరౌండ్ నుంచి నిలకడగా రాణిస్తూ క్వార్టర్ ఫైనల్లో... తమకంటే అపార అనుభవం ఉన్న ఇండోనేషియా జోడి హెంద్రా-అహ్ సాన్‌లను రెండు గేమ్‌ల పోరులోనే చిత్తు చేశారు. 21-11, 21-12తో విజేతలుగా నిలవడం ద్వారా మెడల్ రౌండ్లో అడుగుపెట్టారు. ఫైనల్లో చోటు కోసం జరిగిన సెమీస్ పోరులో చైనీస్ తైపీ జోడి లీ యాంగ్- వాంగ్ చీ- లిన్‌ల నుంచి వాకోవర్ లభించడంతో బంగారు పతకం పోరులో నిలిచారు.

**ఫైనల్లో పోరాడినెగ్గిన భారతజోడీ...**

బంగారు పతకం కోసం మలేసియాకు చెందిన 8వ ర్యాంక్ జోడి వన్ యూ సిన్-టే ఈ లతో నువ్వా? నేనా? అన్నట్లుగా గంటా 7 నిమిషాల పాటు సాగిన సమరంలో సంచలన విజయం సాధించారు. తొలిగేమ్‌ను 16-21తో చేజార్చుకొన్న సాత్విక్- చిరాగ్ జోడీ కీలక రెండోగేమ్‌ను 21-17తో నెగ్గడం ద్వారా 1-1తో సమఉజ్జీలుగా నిలిచారు. విజేతను నిర్ణయించే ఆఖరి గేమ్ నువ్వా? నేనా? అన్నరీతిలో సాగింది. చివరకు భారతజోడినే 21-19తో నెగ్గి బంగారు పతకంతో సరికొత్త చరిత్ర సృష్టించింది. పురుషుల డబుల్స్‌లో ఓ భారత జోడి సాధించిన అత్యుత్తమ, అతిపెద్ద విజయం ఇదే కావటం విశేషం.

2011 ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో భారత జోడి గుత్తా జ్వాల- అశ్విని పొన్నప్ప కాంస్య పతకం సాధించిన తర్వాత, మరో భారత జోడి సాధించిన అపూర్వ విజయం ఇదే.

ఆసియా బ్యాడ్మింటన్లో 58 సంవత్సరాల విరామం తర్వాత భారత్‌కు బంగారు పతకం సాధించిన డబుల్స్ జోడి సాత్విక్- చిరాగ్‌లకు 20 లక్షల రూపాయలు నజరానాగా ఇస్తున్నట్లు భారత బ్యాడ్మింటన్ సంఘం ప్రకటించింది. పారిస్ వేదికగా వచ్చే ఏడాది జరిగే ఒలింపిక్స్‌తో పాటు రానున్న పలు అంతర్జాతీయ టోర్నీలలో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి మరిన్ని పతకాలు, సంచలన విజయాలు సాధించినా ఆశ్చర్యం లేదు. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్





# శాంతి, సుస్థిరతలకు

**భిన్న ధ్రువాలుగా మారుతూ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న కాలంలో జి-20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ భారతదేశం, ప్రపంచ ఎజెండా రూపుదిద్దే అవకాశం దక్కించు కుంది. విద్య, ఆర్థిక, ఆరోగ్య రంగాలతో బాటు సుస్థిర ఆర్థిక వనరులు, పర్యా వరణం, వాతావరణ మార్పు, వర్తకం, పెట్టుబడులు, మౌలిక వసతులు, వ్యవసాయం, అంకుర సంస్థలపై ఈ ఏడాది మార్చి రెండో పక్షంలో దేశంలోని పలు ప్రాంతాలలో వర్కింగ్ గ్రూపుల మేధోమథన సదస్సులు జరిగాయి. రకరకాలుగా విడిపోయిన ప్రపంచంలో శాంతి, స్థిరత్వం, సంపద పంపిణీలో ముందడుగు వేయటానికి ఈ సదస్సులు కృషి చేశాయి. సమావేశాలు జరిగిన నగరాలలో సుసంపన్నమైన సంస్కృతి, వారసత్వ సంపదలను కూడా ప్రతినిధులు చూడగలిగారు.**

అంతర్జాతీయ పరిశోధన, నవకల్పనలో నాయకత్వం భారత్ అధ్యక్షతన జి-20 కార్యక్రమా లలో భాగంగా దేశ వ్యాప్తంగా వివిధ వర్కింగ్ గ్రూపుల సమావేశాలు జరుగుతున్నాయి. మార్చి 15-17 మధ్య పంజాబ్‌లోని అమృత్ సర్‌లో విద్యపై జరిగిన వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశానికి విద్యా మంత్రిత్వ శాఖ ఆతిథ్యమిచ్చింది. జి-20 సభ్య దేశాలకు చెందిన 28 మంది ప్రతినిధులు, అతిథి దేశాల, యునెస్కో, యునిసెఫ్ లాంటి సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పరిశోధనను, నవకల్పనను, అధ్యయనాన్ని ప్రోత్స హించాల్సిన అవసరాన్ని ఈ సమావేశం ప్రధానంగా చర్చించింది. సామర్థ్య నిర్మాణానికి, భవిష్యత్తులో అంతర్జాతీయంగా పని చేయటానికి మధ్య అనుసంధానం కలిగించడంలో నూతన విద్యా విధానం పాత్రను కూడా చర్చిం చింది.

ఐఐటి రోపార్‌లో జరిగిన సెమినార్లు, సదస్సులతో బాటు నవకల్పనలను ప్రోత్సహించ టానికి, మల్టీమీడియా ప్రదర్శన ఏర్పాటు చేయడం ద్వారా పరిశోధనకు భారతదేశంలో గల అంతర్జా తీయ అవకాశాలను వివరించారు. విశ్వవిద్యాల యాల మధ్య పెరిగిన సహకారం ఫలితంగా ఆచరణాత్మక పరిష్కార మార్గాలు రూపొందించటం సులభమవుతుంది. చర్చలో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు కనీస ప్రాథమిక అభ్యసనంలోనూ, అంకగణిత పరిజ్ఞానంలోనూ టెక్నాలజీ వినియోగం చూసి ఆశ్చర్యపోయారు. ఈ ప్రతినిధులు స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు.



### సుస్థిర ఆర్థిక వనరుల వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం

మార్చి 21-23 తేదీలలో సుస్థిర ఆర్థిక వనరుల వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం రాజస్థాన్‌లో జరిగింది. ఈ సమావేశం 2023కు కార్యాచరణను, ప్రాధాన్యతా అంశాలను చర్చించింది. కార్యాచరణ ప్రణాళికలో సూచన ప్రాయంగా నిర్దేశించిన అంశా లలో సగం పూర్తయినట్టు ప్రకటించారు. వాతావరణ సంబంధమైన కార్యాచరణకు, జి-20 సుస్థిర ఆర్థిక సాంకేతిక సహాయ కార్యాచరణ ప్రణాళిక అమలుకు ఆర్థిక వనరుల సమీకరణ సహా తగిన చర్యలు తీసుకోవటానికి సభ్యులు అంగీకరించారు. ఈ గ్రూప్ మొదటి సమావేశం ఫిబ్రవరి 2,3 తేదీలలో అస్సాం లోని గువాహటిలో జరిగింది. వాతావరణ అంశాలను మించి చర్చించాలని మొదటిసారిగా ఈ గ్రూప్ అంగీకరించింది. ఆ విధంగా డేటాతో ప్రకృతి, సామాజిక ప్రభావం మీద నివేదికతో నిర్దిష్టమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు మరింత నిధుల సమీకరణ జరగాలని అభిప్రాయపడింది.

> అంతర్జాతీయ వర్తకాన్ని, పెట్టుబడులను వేగవంతం చేయటం పురోగతికి, సుసంపన్న తకు వర్తకం దోహదపడేట్టు చూడటం అంతర్జా తీయ పరిస్థితి కోలుకునే దిశలో కదలటం మీద ప్రధానంగా దృష్టి పెట్టారు. అదే సమయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల దిశలో పురోగతి సాధించటం. పారదర్శకతను వ్యవస్థలో సమీకృతం చేయటం, ప్రపంచ వ్యాప్తంగా ప్రామాణీకరణ సంస్థల మధ్య సహకారం మీద మార్చి 30 సమావేశంలో చర్చించారు.

మార్చి 24, 25 తేదీలలో జరిగిన వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశంలో జి-20 సభ్యదేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కలుపుకొని మొత్తం 87 మంది పాల్గొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ప్రమాదాలు, ఆహార, ఇంధన అభద్రత, వాతావరణ మార్పులు, విధాన మార్పుల వలన కలిగే స్థూల ఆర్థిక ప్రభావం వంటి అంశాలు ఎజెండాలో ఉన్నాయి. ఈ అంశాల మీద ఎలా ముందుకు వెళ్లాలనే దానినిలో మొత్తం ఆర్థిక ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని అంశాలను నిర్ణయించారు. వాతావరణ మార్పుపై, పరివర్తన మార్గంలో స్థూల ఆర్థిక ప్రభావంపై ఒక బృందం చర్చించింది. వాతావరణ మార్పు వలన కలిగే సవాళ్ల మీద ఉమ్మడి అవగాహనను రూపొందించేందుకు యుఎఈ సహకారంతో ఈ సదస్సు జరిగింది. కాప్-28 కు యుఎఇ అధ్యక్షత వహించటం తెలిసిందే.

### పర్యావరణ, వాతావరణ వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం

**పర్యావరణం, వాతావరణ మార్పులో మెరుగైన ఆచరణ విధానాల మీద చర్చ**

పర్యావరణం, వాతావరణ స్థిరత్వ వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో మార్చి 27 నంచి మూడు రోజుల పాటు జరిగింది. సభ్య దేశాల ప్రతినిధులతోబాటు 11 ఆహ్వానిత దేశాల ప్రతినిధులు, 14 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కలిసి మొత్తం 130 మందికిపైగా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భూసారం క్షీణత, పర్యావరణ పునరుద్ధరణ వేగవంతం చేయటం, జీవవైవిధ్య సుసంపన్నత, వనరుల సామర్థ్యాన్ని




# బాటలు వేస్తున్న జి-20

ప్రోత్సహించటం, సుస్థిర, వాతావరణ అనుకూల నీలి ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించటంపై సమావేశం దృష్టి సారించింది. ప్రతినిధులకు నమామి గాంగే, వాతావరణ పునరుద్ధారక మౌలిక వసతులు, భూగర్భ జలాల నిర్వహణలో ప్రజల ప్రాతినిధ్యం, జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ లాంటి అంశాలమీద ప్రతినిధులకు ప్రజెంటేషన్ ఇచ్చారు.

### అంతర్జాతీయ వర్తకం, పెట్టుబడులను పెంచే దిశలో జి-20

వర్తక, పెట్టుబడుల వర్కింగ్ గ్రూప్ మొదటి సమావేశం మార్చి 28-30 తేదీల మధ్య ముంబయిలో జరిగింది. అంతర్జాతీయ వర్తకాన్ని, పెట్టబడులను వేగవంతం చేయటం పురోగతికి, సుసంపన్నతకు వర్తకం దోహదపడేట్టు చూడటం అంతర్జాతీయ పరిస్థితి కోలుకునే దిశలో కదలటం మీద ప్రధానంగా దృష్టి పెట్టారు. అదే సమయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల దిశలో పురోగతి సాధించటం. పారదర్శకతను వ్యవస్థలో సమీకృతం చేయటం, ప్రపంచ వ్యాప్తంగా ప్రామాణీకరణ సంస్థల మధ్య సహకారం మీద మార్చి 30 సమావేశంలో చర్చించారు. ఎంఎస్ఎంఇ సమాచారం, ఆర్థిక వనరులు సులభంగా అందుబాటులో ఉంచటంలో కలిగే ప్రయోజనాల మీద కూడా సుదీర్ఘంగా చర్చ జరిగింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ మాట్లాడుతూ, క్లిష్టమైన భౌగోళిక రాజకీయ పరిస్థితులు, అంతర్జాతీయంగా నెలకొన్న పెళుసుదనపు ఆర్థిక పరిస్థితుల మధ్య భారతదేశం జి-20 అధ్యక్ష బాధ్యత స్వీకరించాల్సి వచ్చిందన్నారు. భారతదేశం తన ప్రాచీన మేధస్సును మిగిలిన ప్రపంచంతో పంచుకొని విశ్వమంతటా అంగీకరించే మార్గం కనుక్కునే బాధ్యత చేపట్టే అవకాశం సరైన సమయంలో వచ్చిందని తెలిపారు.

### వ్యవసాయ సంబంధిత సమావేశం

వ్యవసాయ ప్రతినిధులతో వ్యవసాయ వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం మార్చి 29-31 మధ్య చండీగఢ్‌లో జరిగింది. ఆహార మార్కెట్ పరిస్థితిని అర్థం చేసుకోవటానికి, సామర్థ్య నిర్మాణ అవసరాలను గుర్తించటానికి ఇదొక కీలక చొరవ, సమావేశంలో పాల్గొన్న సభ్య దేశాలు ఆహార భద్రత, పోషకాహారం వాతావరణం-తెలివైన సేద్యం సమ్మిళిత వ్యవసాయం, ఆహార వ్యవస్థలు, వ్యవసాయ రంగంలో మార్పులకోసం డిజిటైజేషన్ ద్వారా అవసరాలను తీర్చటం, సమస్యలు పరిష్కరించటం మీద సిఫార్సులను చర్చించింది. జి-20 చీఫ్ సైన్స్ అడ్వైజరీ రౌండ్ టేబుల్ మొదటి సమావేశం ఉత్తరాఖండ్‌లోని రామ్‌నగర్‌లో జరిగింది. ఇందులో అంతర్జాతీయ శాస్త్ర సాంకేతిక సమస్యలను కూలంకషంగా చర్చించారు. భారత ప్రభుత్వ ప్రిన్సిపాల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయ సారథ్యంలో జి-20 సీఎస్ఏఆర్ సాగింది. ఈ ఒక రోజు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నవారు రోగ నియంత్రణ, అంటురోగాల వ్యాప్తిని ఎదుర్కొనే సంసిద్ధతకు 'ఒకే ఆరోగ్యం' భావనలో ఉన్న అవకాశాల గురించి చర్చించారు. అదే విధంగా నిర్దిష్టమైన శాస్త్రీయ పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చేందుకు అంతర్జాతీయ కృషిని సమన్వయం చేయటం మీద, వైవిధ్యానికి అవకాశం కల్పించటం, సమ్మిళితి, శాస్త్ర సాంకేతికత అందు బాటుతోపాటు కార్యాచరణతో కూడిన అంతర్జాతీయ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విధానం మీద చర్చ జరిగింది.

### స్టార్ట్-అప్ సంబంధిత సమావేశం

స్టార్ట్-అప్ 20 ఎంగేజ్ మెంట్ గ్రూప్ రెండో సమావేశం మార్చి 18, 19 తేదీలలో సిక్కింలోని గాంగ్ టక్‌లో జరిగింది. మొదటి సమావేశం హైదరాబాద్ లోజరిగింది. 20కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ సమావేశంలో ప్రతినిధులు లేవనెత్తిన అంశాల మీద సిక్కిం సమావేశం చర్చించింది. ప్రపంచంలో మూడవ అతిపెద్ద అంకుర సంస్థల పర్యావరణం ఉన్న భారతదేశం, ఈ విషయంలో ఒక అంతర్జాతీయ వాహికను స్థాపించటానికి ఈ గ్రూప్ సహాయపడుతుంది. స్టార్ట్-అప్ 20 ఎంగేజ్ మెంట్ గ్రూప్ తుది సమావేశం జులైలో గురుగావ్‌లో జరుగుతుంది. ఆ తరువాత జి-20 దేశాలకు వ్యాపార దక్షత, నవకల్పన మీద విధానపరమైన సిఫార్సుల రూపకల్పన జరుగుతుంది. ఈ సిఫార్సుల ఆధారంగా విధాన రూపకల్పన జరుగుతుంది.

'న్యూ ఇండియా సమాచార్' నుంచి



# బాల జాగృతి



## తెలుసుకుందాం

## వేంకటేశ్వరస్వామి దేవాలయం - కోనాయిపల్లి



తెలంగాణలోని సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామంలో ఈ ఆలయం కొలువుదీరింది. ఆలయ ముఖద్వారం దక్షిణం వైపు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. రూ.3.50 కోట్లతో దీనిని పునర్నిర్మించారు. స్వామివారి మూలవిరాట్, ప్రధాన ఆలయం, కల్యాణ మండపం, రాజగోపురం, ధ్వజస్తంభం, ఆంజనేయుడి విగ్రహం, నాగమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్తర ద్వారాన్ని కూడా నిర్మించారు. సీఎం కేసీఆర్‌కు ఈ ఆలయం సెంటిమెంట్. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఇక్కడ పూజలు చేసిన తర్వాతే నామినేషన్ వేస్తారని చెబుతారు.

## కథ | ఏది దానం?



ఒకరాజు తన గురువు గొప్పతనానికి ముగ్ధుడై పట్టుబట్టల్ని బహుమతిగా ఇచ్చాడు.

గురువు ఎంతో సంతోషంగా వాటిని స్వీకరించి ఇంటికి వెళ్తుండగా దారి పక్కన ఒక బిచ్చగాడు చలికి వణుకుతూ కనిపించాడు. అతడి అవస్థకు జాలిపడి తన చేతిలో ఉన్న పట్టుబట్టల్ని ఇచ్చేశాడు.

మర్నాడు రాజు అటుగా వెళ్లినపుడు తాను బహూకరించిన పట్టుబట్టల్ని బిచ్చగాడు కట్టుకోకపోవడం చూసి చాలా కోపగించుకున్నాడు.

కొద్దిరోజుల తర్వాత గురువుకి బంగారు కడియం బహుమతిగా ఇచ్చాడు రాజు.

ఆ కడియాన్ని కూతురు పెళ్లి చేయడానికి కష్టపడుతున్న ఓ రాజోద్యోగికి బహూకరించాడు గురువు.

ఆ విషయం రాజుకు తెలిసి వెంటనే గురువుని పిలిచి... 'మీ మీద గౌరవంతో నేను బహుమతులు ఇస్తుంటే, వాటిని మీకు నచ్చినవారికి పంచేయడం పద్ధతిగా

## పద్యం

**ఆజ్ఞ యొనర్చెడి వృత్తుల**
**లో జ్ఞానము గలిగి మెలఁగు లోకులు మెచ్చన్,**
**బ్రాజ్ఞతను గలిగి యున్నన్**
**బ్రాజ్ఞులలోఁబ్రాజ్ఞుడవుగ ప్రబలు కుమారా!**

భావం : ఓ కుమారా! ఇతరులకు ఉత్తర్వు చేయునట్టి పనులలో వివేకము కలిగి నడుచు కొనుము. లోకమునందలి వారెల్లరునూ మెచ్చు కొనునట్లుగా వివేకము కలిగి యుండిన యెడల నిన్ను బుద్ధిమంతులగు వారిలో బుద్ధిమంతుడవుగా ఎంచుతారు.

## శ్లోకం

'సుపుత్రః కులదీపకః'

**శర్వరీదీపక శ్చంద్రః ప్రభాతోద్దీపకో రవిః**
**త్రైలోక్యదీపకో ధర్మః సుపుత్రః కులదీపకః!!**

భావం : రాత్రిని చంద్రుడు ప్రకాశింప చేస్తాడు. పగటిని సూర్యుడు దీపింపచేస్తాడు. ముల్లోకాలను ధర్మం తేజోవంతం చేస్తుంది. సుపుత్రుడి వల్ల వంశం కీర్తి పొందుతుంది.

**గమనిక:** మే 1–7 సంచికలో శ్రీకృష్ణుడు త్రేతా యుగంలో దక్షిణ భారత యాత్రకు వచ్చారని పొరపాటున ప్రచురితమైంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| సానియా మీర్జా | క్రికెట్ |
| కోనేరు హంపి | అథ్లెటిక్స్ |
| అంబటి రాయుడు | రెజ్లింగ్ |
| నీరజ్ చోప్రా | టెన్నిస్ |
| బజరంగ్‌పూనియా | చెస్ |

సమాధానాలు : సానియా మీర్జా–టెన్నిస్; కోనేరు హంపి–చెస్; అంబటి రాయుడు–క్రికెట్; నీరజ్ చోప్రా–అథ్లెటిక్స్; బజరంగ్‌పూనియా–రెజ్లింగ్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### ఆబాదీ బానో బేగం



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. ఈమెను బీ అమ్మాన్ అని కూడా పిలుస్తారు. 1850లో ఉత్తరప్రదేశ్‌లో జన్మించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమంలో కీలక పాత్ర పోషించారు. మహిళల్లో చైతన్యం నింపి వారు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనేలా ప్రేరేపించేవారు. ఖిలాఫత్ ఉద్యమానికి నిధులు సేకరించడంలోనూ ఈమె పాత్ర కీలకం. నవంబర్ 13, 1924న తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలో వేగంగా పరుగెత్తే జంతువు ఏది?
2. సూర్యుడు ఉదయించే రాష్ట్రం అని దేనిని పిలుస్తారు?
3. సూడన్ దేశ రాజధాని ఏది?

జవాబులు : 1. చిరుత; 2. అరుణాచల్ ప్రదేశ్; 3. ఖార్టూమ్.



లేదు’ అని అన్నాడు.

దానికి బదులుగా... ‘దానం చేయడమంటే ఆ వస్తువు లేదా సొమ్ము మనది కాదని పూర్తిగా అంగీకరించినట్లు. మీరు దానం ఇచ్చిన విషయాన్ని ఇంకా గుర్తుంచుకున్నారంటే, నన్ను ప్రశ్నిస్తున్నారంటే, ఆ వస్తువు మీది అనే ఇంకా భావిస్తున్నట్లు. ఇలా అయితే దాన ఫలితం మీకు దక్కదు. అయినా మీరు అడుగుతున్నారు కాబట్టి చెబుతున్నాను... ఆ వస్తువుల అవసరం నాకంటే వారికే ఎక్కువ అనిపించింది. అందుకే వారికి ఇచ్చేశాను. అంతే తప్ప మీపైన గౌరవం లేకకాదు’ అని చెప్పాడు గురువు.

ఆ మాటలతో తన తప్పును తెలుసుకుని గురువు గారి దగ్గర క్షమాపణ కోరాడు రాజు. ★

## మెదడుకు మేత

వ్యాపారికి ముద్దు..
న్యాయానికి గుర్తు...
తల తీస్తే
పాలిస్తానంటుంది?

జవాబు : త్రాసు

## మంచిమాట

శారీరకంగానే కాదు,
ఎదుటివారిని
మాటలతో బాధించినా
అది హింసే అవుతుంది!



# వారఫలాలు

08-14 జనవరి 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ముఖ్యమైన కొన్ని కార్యక్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. ఆదాయం మెరుగుపడి కొన్ని అప్పులు తీరే అవకాశం. ఉద్యోగార్థులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఒడ్డున పడతారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు సఫలమవుతాయి. రాజకీయ, పారిశ్రామికవర్గాలకు శుభవార్తలు. క్రీడాకారులు, పరిశోధకుల యత్నాలలో పురోగతి కనిపిస్తుంది. 8,9 తేదీల్లో శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

అనుకున్నంత రాబడి దక్కి అవసరాలు తీరతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడవచ్చు. నిరుద్యోగులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కవచ్చు. ఉద్యోగులకు బాధ్యతల భారం నుంచి కొంత విముక్తి. పారిశ్రామిక, రాజకీయ వర్గాలకు కలసివస్తుంది. రచయితలు, క్రీడాకారులు లక్ష్య సాధనలో ముందడుగు వేస్తారు. 10,11 తేదీల్లో స్వల్ప శారీరక రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు శివాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ప్రముఖులతో పరిచయాలు మీలో ఉత్సాహాన్నిస్తుంది. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని సంతోషంగా గడుపుతారు. ఆదాయం గతం కంటే మెరుగ్గా ఉండి అప్పులు తీరి ఊరట చెందుతారు. వ్యాపారస్తులకు మరింతగా లాభాలు అందు తాయి. రాజకీయవేత్తలకు శుభవర్తమానాలు. రచయితలు, క్రీడాకారులకు కొత్త ఆశలు. 13,14 తేదీల్లో సన్నిహితులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొన్ని కార్యక్రమాలను శ్రమానంతరం పూర్తి చేస్తారు. దైవకార్యాలలో పాల్గొంటారు. బంధువులు, స్నేహితులతో తగాదాలు క్రమేపీ పరిష్కారమవుతాయి. ఆస్తుల ఒప్పందాలలో కొంత జాప్యం. వ్యాపారులు కొంతమేర లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో బాధ్యతలు మరింత పెరుగుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు కాస్త ఊరట లభిసుంది. 9,10 తేదీల్లో వృథా ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొన్ని ముఖ్యకార్యక్రమాలు నిదానించినా చివరికి పూర్తవుతాయి. కష్టానికి తగిన ఫలితం అంతగా కనిపించు. స్థిరాస్తి వివాదాలు గందర గోళంగా మారవచ్చు. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో మనశ్శాంతి చేకూరుతుంది. పరిశోధకులు, రచయితల కృషి కొంతమేర ఫలిస్తుంది. 8,9 తేదీల్లో వృథా ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. అన్నపూర్ణాష్టకం పఠించండి..

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ప్రారంభంలో కొన్ని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఉద్యోగార్థుల యత్నాలు కొలిక్కి వస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలలో చికాకులు కొంతమేర తొలగుతాయి. ఉద్యోగులకు కొత్త అవకాశాలు లభిస్తాయి. కళాకారులు, పారిశ్రామికవేత్తల ప్రయత్నాలు విజయవంతంగా సాగుతాయి. 10,11 తేదీల్లో శ్రమాధిక్యం. గణేశాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆదాయం మరింత మెరుగుపడి, అప్పులు తీరి ఊరట చెందుతారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. స్థిరాస్తుల విషయంలో వివాదాలు తీరతాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు పనిభారం కొంత తగ్గవచ్చు. 10,11 తేదీల్లో స్వల్ప శారీరక రుగ్మతలు. కుటుంబసభ్యులతో విభేదాలు. రామరక్షాస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

కొన్ని కార్యక్రమాలను అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక రుణ బాధల నుంచి బయటపడే అవకాశం. స్థిరాస్తుల వ్యవహారాలలో కొత్త ఒప్పందాలు చేసుకుంటారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. వ్యాపారులకు పెట్టుబడులు అనూహ్యంగా దక్కుతాయి. క్రీడాకారులు, పరిశోధకులకు విజయాలు వరిస్తాయి. స్నేహితులతో విభేదాలు. హనుమాన్చాలీసా పఠించండి..

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. అదనపు ఆదాయం సమకూరి అప్పులు తీరతాయి. నిరుద్యోగులకు. ఉద్యోగలాభం. సేవాకార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలలో వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు ఉండవచ్చు. పరిశోధకులు, క్రీడాకారు లకు అంచనాలు నిజమమవుతాయి. 8,9 తేదీల్లో అనుకోని ఖర్చులు. పంచాక్షరి పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. కొన్ని సమస్యలు నేర్పుగా పరిష్కరించుకుంటారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కొత్త వ్యక్తులతో పరిచయాలు. స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులు లాభాలు గడిస్తారు. ఉద్యోగులు పనిభారం నుంచి బయటపడతారు. 12,13 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కష్టానికి తగిన ఫలితం కనిపించదు. ముఖ్యమైన కాంట్రాక్టులు తప్పిపోతాయి. స్థిరాస్తుల వివాదాలు కొంత సమస్యగా మారవచ్చు. గృహ నిర్మాణ యత్నాలు మందగిస్తాయి. వ్యాపారులకు చికాకులు, ఉద్యోగులకు అదనపు పనిభారం తప్పవు. పారిశ్రామిక, రాజకీయవర్గాలకు ఒడుదొడుకులు ఎదురు కావచ్చు. 10,11 తేదీల్లో ధనలాభం.. శుభవార్తలు. స్థిరాస్తి వృద్ధి. లక్ష్మీనృసింహస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

చేపట్టిన కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. ఎంతటి వారినైనా చాకచక్యంగా ఆకట్టుకుంటారు. కొన్ని వివాదాలను నేర్పుగా పరిష్కరించు కుంటారు. శత్రువులుకూడా స్నేహితులుగా మారతారు. విద్యార్థులకు అవకాశాలు అనుకోకుండా దక్కుతాయి. వ్యాపారులకు లాభసాటి. ఉద్యోగులకు అనుకున్న హోదాలు దక్కగలవు. 8,9 తేదీల్లో సన్నిహితులతో తగాదాలు. శారీరక రుగ్మతలు. కనకధారాస్తోత్రాలు పఠించండి. ★

# పదరసం-414

## ఆధారాలు

**అడ్డం**

1.'గోల్కొండ' పత్రిక ప్రతాపరెడ్డి ఇంటి పేరు (4)

4. గొప్పకవి (4)

8. వటవృక్షం...మాజీ ముఖ్యమంత్రి ఇంటి పేరు (2)

9. వాటా..క్షీరం (2)

11. అనేకానేక (2)

13. వధూవరుల కాళ్లకు పెట్టేది (3)

14. అందమైన పలువరుస కలది (3)

17. మగాడు..చెల్లాచెదరు (3)

18. స్వామికి వికృతి (2)

19. ఆలస్యం....(2)

23. మంచు....(2)

24. దీనికి లోకం దాసోహం (2)

25. చాలీచాలని (4)

27. సన్నని మెడగల పొడవైన పాత్ర (2)

30. ప్రఖ్యాత చిత్రకారుడు (4)

31. పాండురాజు తమ్ముడు (4)

**నిలువు**

2. వరంలో శబ్దం (2)

3. వర్ణాలు (3)

5. దండ..మాల (5)

6. తెలుగులో జ్ఞానపీఠ్ తొలి గ్రహీత (4)

7. కంచర్ల గోపన్నే....(4)

10 ఈ సంచికలో ధారావాహిక నవల (6)

12. రామానుజాచార్యులు తల్లి (4)

15. మోసం...వంచన (2)

16. గులాబి....(2)

20. కన్యాశుల్కం నాటక కర్త (4)

21. పశ్చిమ దిక్కు (4)


22. నక్షత్రం (2)

26. దీంతో తలగోక్కోవడం ఎందుకు? (3)

28. దారి...మార్గం.(2)

29. ఇది పోసినవాడు నీరు పోయడా? (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27



పదరసం - 414

పేరు : ..............................................................................................


చిరునామా:.......................................................................................

........................................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..............................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 మే 22 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

### పదరసం - 410 సమాధానాలు



**విజేతలు:** గండ్లూరి ఆనంద్, జి.మమత, టి.ఆర్.ఎస్. ఆంజనేయులు, ఎస్.రాజ్యలక్ష్మి, కె.వి.ఎస్.ఎన్.మూర్తి, విష్ణుచేతన, కౌముది, నాగేందర్‌రెడ్డి, కె.సూర్యప్రభ, నేమాన సుభాష్ చంద్రబోస్, టి.ఝాన్సి, సి.జి.శంకరరావు, తిప్పావఝుల జ్యోతి, వారణాసి సరస్వతి, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, జి.ఉష, ఆర్.అప్పాశేషశాస్త్రి, మత్స్యరాజ విజయలక్ష్మి, ఆర్.అంజనీదేవి, పులికంటి రాజేశ్వరరావు, ఆర్.వి.సిహెచ్. నాగేశ్వరరావు, డా. బి.ధన్వంతరి,జి.మాధురి, డా. గన్నోజు శ్రీనివాసచారి, కె.సత్యనారాయణ, జి.శాంత కుమారి, ఎన్.పద్మావతి, డి.బాబు, డి.సోమయ్య

**ఈ వారం విజేత : కె.వి.ఎస్.ఎన్ గణేశ్‌కుమార్,విశాఖపట్నం**

అరుణ



# AGENT
# ఆపరేషన్ ఫెయిల్!

అక్కినేని అఖిల్ తాజా చిత్రం 'ఏజెంట్' ఏప్రిల్ 28వ తేదీ విడుదలైంది. ఆ తరువాత నాలుగు రోజులకే దీని పరాజయానికి తనదే బాధ్యత అంటూ నిర్మాత అనిల్ సుంకర్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ సినిమా అక్కినేని అభిమానుల ఆశలపై నీళ్లు పోయడమే కాదు...ఎంతో కష్టపడి సిక్స్ ప్యాక్ చేసిన అఖిల్ శ్రమను బూడిదలో పోసిన పన్నీరు చేసేసింది. 'సైరా' తర్వాత దర్శకుడు సురేందర్ రెడ్డి తీసిన 'ఏజెంట్' కథా కమామీషు తెలుసుకుందాం.

రామకృష్ణ ఉరఫ్ విక్కీ (అఖిల్ అక్కినేని)కి చిన్నప్పటి నుండి సీక్రెట్ ఏజెంట్ కావాలనేది కల. 'రా' చీఫ్ మహదేవ్ ఉరఫ్ డెవిల్ (మమ్ముట్టి)ని గొప్పగా ఆరాధిస్తుంటాడు. 'రా'లోకి అడుగు పెట్టడం కోసం పరీక్షలకు హాజరవుతాడు కానీ సెలక్ట్ కాడు. అలాంటి విక్కీకి మహదేవ్ ద్వారా ఓ గొప్ప అవకాశం లభిస్తుంది. మహదేవ్ శిష్యుడు ధర్మ తేజ ఉరఫ్ గాడ్ (డినో మోరియో) మొదట్లో ప్రాణాలను పణంగా పెట్టి, 'రా' ఏజెంట్‌గా దేశానికి ఎంతో సేవ చేస్తాడు. కానీ ఆ తర్వాత ఈ దేశాన్ని అస్థిత్వపర్చాలని చూస్తున్న ఓ క్రైమ్ సిండికేట్‌తో చేతులు కలిపేస్తాడు. చివరకు ఈ దేశాన్ని నాశనం చేసేందుకు చైనాతో కలిసి కుట్ర పన్నుతాడు. అతని ఆగడాలకు చెక్ పెట్టాలంటే... అన్ ప్రెడిక్టబుల్‌గా వ్యవహరించే విక్కీనే కరెక్ట్ అని డెవిల్ భావిస్తాడు. అలా అతన్ని అనధికారికంగా 'రా'లోకి తీసుకుంటాడు. అక్కడ నుండి విక్కీ ఎలా గాడ్‌కు బుద్ధి చెప్పాడన్నది మిగతా కథ.

ఇందులో ప్రతినాయకుడి పేరు గాడ్‌గానూ, దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే 'రా' చీఫ్ పేరు డెవిల్‌గానూ కథా రచయిత, దర్శకుడు ఎందుకు పెట్టారో అర్థమే కాదు. నిజానికి ఈ తరహా కథాంశంతో స్పై మూవీస్ వివిధ భాషల్లో ఇప్పటికీ చాలానే వచ్చాయి. మరీ ముఖ్యంగా ఈ మధ్య వచ్చిన షారుక్ ఖాన్ 'పఠాన్' సైతం ఇదే ఛాయల్లో సాగుతుంది. కథా రచయితగా వక్కంతం వంశీకి మంచి పేరుంది. కానీ అతను ఇంత బలహీనమైన కథను అందిస్తాడని ఊహించలేం. అలానే వంశీ, దర్శకుడు సురేందర్ రెడ్డిది సక్సెస్ ఫుల్ కాంబినేషన్. కానీ ఈ సినిమా విషయంలో ఇద్దరూ పూర్తి న్యాయం చేయలేదనిపిస్తోంది. పైగా సినిమా విడుదలైన నాలుగు రోజులకే 'బౌండ్ స్క్రిప్ట్ లేకుండా ఈ మూవీ స్టార్ట్ చేసి పెద్ద తప్పుచేశానని, సినిమా పరాజయానికి తానే కారకుడిన'ని నిర్మాత అనిల్ సుంకర ప్రకటించారో. ఆయన పరోక్షంగా ఎవరిపై ఆ విమర్శనాస్త్రం సంధించారో తేలికగానే అర్థమై పోతుంది.


సహజంగా ఏజెంట్ కావాలనుకునే వ్యక్తికి కొన్ని అర్హతలుంటాయి. కొన్ని బాధ్యతలూ ఉంటాయి. కానీ హీరో క్యారెక్టరైజేషన్‌లో అదే మిస్ అయ్యింది. దానికి తోడు హీరోకు, అతని ఫ్యామిలీకి మధ్య ఉన్న అనుబంధం కానీ, హీరోయిన్‌తో హీరోకు ఉండే ఎటాచ్‌మెంట్ గానీ హృదయానికి హత్తుకునేలా చూపలేదు. ప్రతి సీన్ ఏదో ఇలా వచ్చి అలా వెళ్లిపోయినట్టే ఉంది! చివరకు యాక్షన్ సీన్స్‌లో కూడా ఎలాంటి కొత్తదనం లేదు. నిర్మాత అనిల్ సుంకర రాజీ పడకుండా భారీగా ఈ సినిమాను తీసినప్పటికీ, గ్రాఫిక్స్ సైతం దారుణంగా ఉన్నాయి. బలహీనమైన కథ, కథనాలు 'ఏజెంట్' ఆపరేషన్ ఫెయిల్ కావడానికి ప్రధాన కారకాలు.

నటీనటుల విషయానికి వస్తే అఖిల్ అక్కినేని ఫిజిక్ బాగుంది. ఈ పాత్రకు తగ్గట్టు కష్టపడి బాడీ బిల్డప్ చేశాడు. కానీ అతని క్యారెక్టర్‌ను తీర్చిదిద్దిన విధానం ఏ మాత్రం బాగాలేదు. కామెడీ ఎక్కువై పోయింది. దేశాన్ని కాపాడాల్సిన 'రా' ఏజెంట్‌ను ఇలా చూపిస్తే జనం ఆమోదించే పరిస్థితి లేదు. ఈ సినిమాతోనే బాలీవుడ్ భామ సాక్షి వైద్య టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. చిన్న కాన్ ఫ్లిక్ట్ తప్పితే... ఆమె పాత్రకు ఎలాంటి ప్రాధాన్యం లేదు. మమ్ముట్టి, డినో మోరియో తమ పాత్రల కోసం బాగానే కష్టపడ్డారు. వీళ్ళతో పాటు మురళీశర్మ, వరలక్ష్మీ శరత్ కుమార్, విక్రమ్ జీత్ విర్క్, డెంజిల్ స్మిత్, సంపత్ రాజ్, పోసాని, అనిష్ కురవిల్ల వంటి పాపులర్ ఆర్టిస్టులు చాలా మంది ఉన్నా... వారెవరినీ దర్శకుడు సరిగ్గా ఉపయోగించుకోలేదు. ఈ యేడాది ప్రారంభంలో 'వాల్తేరు వీరయ్య'లో ఐటమ్ సాంగ్ చేసిన ఊర్వశీ రౌతేలా ఇందులోనూ స్పెషల్ సాంగ్‌లో మెరిసింది. కానీ అది పరమ రొటీన్‌గా ఉంది.


హిప్ హాప్ తమిళ సమకూర్చిన బాణీలు ఏ మాత్రం బాగాలేవు. రీ-రికార్డింగ్ కొంతలో కొంత మెరుగు. ఐటమ్ సాంగ్‌ను భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేశారు. రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ బాగుంది. ఓవర్ ఆల్‌గా 'ఏజెంట్' అన్ని రకాలుగానూ అప్ టూ ద మార్క్ లేకుండా పేలవంగా తయారైంది. సినిమా గ్రాఫ్ సైతం పైకి కిందకు సాగుతూ ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించేదిగా ఉంది. అక్కినేని అభిమానులు సైతం థియేటర్లకు వెళ్లకుండా ఓటీటీ విడుదల వరకూ వేచి ఉంటే బెటర్!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.220/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-





వెల : ₹.300/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.695/-




వెల :₹.799/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 29

